# నినాదం

నిఖార్సైన జర్నలిజం

శనివారం, జూలై 12, 2025 | సంపుటి - 20 | సంచిక 181 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామా ఆమోదం

**పార్టీకి రాజీనామాను ఆమోదిస్తూ నడ్డా ఆదేశాలు**



హైదరాబాద్ : గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామాను భాజపా అధిష్ఠానం ఆమోదించింది. జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదేశాల మేరకు రాజాసింగ్ రాజీనామాను ఆమోదించామని, ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ ప్రకటన విడుదల చేశారు. భాజపా రాష్ట్ర అధ్యక్ష ఎన్నిక విషయంలో అలిగిన రాజాసింగ్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. మిగతా 2లో

# యువ సివిల్ ఇంజినీర్లు వినూత్నంగా ఆలోచించాలి

**2024-25లో నిర్మాణ రంగం వృద్ధి రేటు 11.97 శాతం**

పర్యావరణహిత నిర్మాణాలే పరిష్కారం

కాంపోజిట్ స్టీల్ స్ట్రక్చర్స్ నిర్మాణాలకు ప్రోత్సాహం

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న వాతావరణ మార్పులు, పట్టణీకరణ, కాలుష్యం, కర్బన ఉద్గారాల పెరుగుదల తదితర ఎన్నో సమస్యలకు పర్యావరణ హిత నిర్మాణాలు పరిష్కారం చూపుతాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తుందని, ఈ ప్రయాణంలో భాగస్వామ్యం కావాలని సివిల్ ఇంజనీర్లను కోరారు.

హైదరాబాద్ : మూడున్నరేళ్లలో 5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను అర్హులకు పంపిణీ చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్(హైదరాబాద్) సెంటర్ ఆధ్వర్యంలో రాయదుర్గంలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో "నెక్స్ట్ - జెన్ హైరైస్ బిల్డింగ్స్ (అడ్వాన్స్మెంట్స్ ఇన్ కాంపోజిట్ స్టీల్ స్ట్రక్చర్స్)" అనే అంశంపై నిర్వహించిన రెండ్రోజుల జాతీయ సదస్సును ఆయన శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. 2లో

## ఏడాదిన్నరలో రూ.50వేల కోట్ల పెట్టుబడులు..

**లైఫ్ సైన్సెస్ రంగంలో కొత్తగా 60వేల మందికి ఉపాధి**

**2024-25 లో రూ.66వేల కోట్ల ఉత్పత్తులు ఎగుమతి**

**రూ.లక్ష కోట్ల పెట్టుబడితో దీర్ఘకాలిక వ్యూహం**

**రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

తెలంగాణను "గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్" మార్చేందుకు ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తున్నామని, ఆ క్రమంలోనే కేవలం ఏడాదిన్నరలో రూ. 50వేల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించగలిగామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఫలితంగా కొత్తగా 60వేల మందికి ఉపాధి లభించిందన్నారు.

## మంత్రి వాకటి శ్రీహరిని కలిసిన స్పోర్ట్స్ స్టూడెంట్ ఫెడరేషన్



హైదరాబాద్ : స్పోర్ట్స్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకటి శ్రీహరిని కలిసి క్రీడా సమస్యలను, నూతనంగా వెలువడిన స్పోర్ట్స్ పాలసీ గురించి వచ్చే డిఎస్‌సి నోటిఫికేషన్‌లలో పిఈటి మరియు పిడి పోస్టులు భారీ స్థాయిలో నింపాలని వినతీ పత్రం అందజేయడం జరిగింది... మంత్రి స్పందించి 100% పోస్టులు మంజూరు చేసే విధంగా ప్రిన్సిపల్ సెక్రెటరీకి స్కూల్ ఎడ్యుకేషన్‌కి లేఖ రాయడం జరిగింది. క్రీడ సమస్యలు కూడా నా దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కారం చేస్తానని, తప్పకుండా వచ్చే నోటిఫికేషన్లు ఫిజికల్ ఎడ్యుకేషన్‌కి పెద్ద ఎత్తున ప్రాధాన్యత ఇస్తామని తెలపడం జరిగింది...

## ప్రతి మండలానికి 4-6 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లు

ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక జీపీవో

ఈనెల 27వ తేదీన అర్హత పరీక్ష

ఐదు నక్షా గ్రామాల్లో రీసర్వే పూర్తి

రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్ : రెవెన్యూ వ్యవస్థను మరింత బలోపేతం చేసి భూ సమస్యలపై సామాన్యులకు మెరుగైన సేవలందించడానికి వీలుగా గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సూచనల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి రెవెన్యూ గ్రామానికి జీపీవో, ప్రతి మండలానికి భూ విస్తీర్ణాన్ని బట్టి నాలుగు నుంచి ఆరుమంది వరకు లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించబోతున్నామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం నాడు రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రిగారు మాట్లాడారు. 2లో



## వచ్చే డిఎస్‌సిలో పిటి మరియు పిడి పోస్టులు భారీగా నియమించాలి

స్పోర్ట్స్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ నవీన్ నికోలస్ ని వచ్చే డీఎస్సీ నోటిఫికేషన్‌లలో పీఈటి మరియు పిడి పోస్టులు భారీ స్థాయిలో నింపాలని వినతీ పత్రం అందజేయడం జరిగింది. దానికి ఆయన చాలా సానుకూలంగా స్పందించి 100% 1500 పైగా పోస్టులు మంజూరు చేసే విధంగా కృషి చేస్తాము అని చెప్పి తప్పకుండా ఈ డీఎస్సీ లోనే వచ్చే విధంగా కృషి చేస్తానని మాట ఇవ్వడం జరిగింది.

## మరోమారు కాళేశ్వరం కమిషన్ ముందుకు హరీష్‌రావు

కేబినేట్ నిర్ణయాలు..అసెంబ్లీ ఆమోదించిన వివరాలు ఆందచేత

కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తప్పుల తడక

విమర్శలు గుప్పించిన మాజీమంత్రి



**కాళేశ్వరం కమిషన్ చీఫ్ జస్టిస్ పినాకి చంద్రఘోష్ ముందు విచారణకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు శుక్రవారం హాజరయ్యారు. బీఆర్‌కే భవన్‌లో మరోసారి పీసీ ఘోష్ కమిషన్‌ను హరీష్‌రావు కలిశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై మరింత అదనపు సమాచారాన్ని ఇచ్చారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లపై ఆరుసార్లు కేబినెట్ ఆమోదం పొందిందని గుర్తుచేశారు మాజీ మంత్రి హరీష్‌రావు. అసెంబ్లీలో కూడా మూడుసార్లు ఆమోదించారని మాజీ మంత్రి హరీష్‌రావు తెలిపారు.**

హైదరాబాద్ : కమిషన్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి సమాచారం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినవన్నీ అసత్యాలేనని ఆరోపించారు. 50 ఏళ్లుగా కాంగ్రెస్‌వి అబద్ధాలు, మోసాలేనని విమర్శించారు. కృష్ణా జలాల్లో 299 టీ-ఎంసీల కేటాయింపు కాంగ్రెస్ పాపమేనని మండిపడ్డారు. సెక్షన్ 3 కింద నీళ్ల పంపిణీ చేయాలని అప్పుడే అడిగారని హరీశ్‌రావు గుర్తుచేశారు. ప్రజా భవన్‌లో కాళేశ్వరంపై ఇచ్చింది పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కాదు...కవర్ పాయింట్ ప్రజెంటేషన్ అని మాజీ మంత్రి హరీష్‌రావు ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అజ్ఞానం, అహంకారం బయటపెట్టుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ 50 ఏళ్లు చేసిన ద్రోహాన్ని కప్పిపుచ్చుకోవడానికి కవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారని దెప్పిపొడిచారు. 299 టీ-ఎంసీల పేరుతో శాశత్వ ఒప్పందమని సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి ఆనాడే 299 టీ-ఎంసీలకి ఉమ్మడి రాష్ట్రంలో 2లో



# ప్రశాంత వాతావరణంలో బోనాలు

ఉజ్జయిని బోనాలపై తలసాని సమీక్ష

13న సిఎం రేంవత్ రెడ్డి ప్రత్యేక పూజలు

హైదరాబాద్ : ఆదివారం జరిగే ఉజ్జయిని మహంకాళి బోనాలకు వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. భక్తులు కూడా సహకరించి బోనాలను ప్రశాంతంగా జరుపుకోవాలని అన్నారు. శుక్రవారం మహంకాళి ఆలయ పరిసరాల్లో వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. అమ్మవారికి ఒడి బియ్యం పోసేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో రావడంతో ఆలయ పరిసరాలు కోలాహలంగా మారాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని మీడియాతో మాట్లాడుతూ.. బోనాల ఉత్సవాలు మన అందరి పండుగ. గొప్పగా చేసుకుందాం. బోనాల సందర్భంగా ఎంతో చరిత్ర కలిగిన మహంకాళి అమ్మవారి దర్శనం, బోనాలు సమర్పించేందుకు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు వస్తారు. వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటు-న్నాం. 13న తెల్లవారుమున 3 గంటల నుంచే బోనాలు సమర్పించేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు- చేశాం. భక్తులు క్యూ లైన్‌లలో ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకున్నాం. శాంతి భద్రతల పర్యవేక్షణలో భాగంగా సీసీ కెమెరాలను ఏర్పాటు- చేయడమే కాకుండా, వివిధ ప్రాంతాల నుంచి అదనపు పోలీసు బలగాలను రప్పిస్తున్నాం. భక్తులకు తాగునీరు అందించేందుకు జీహెచ్‌ఎంసీ వాటర్ వర్క్స్ అధికారులు ఏర్పాట్లు- చేస్తున్నారని చెప్పారు. ఉజ్జయిని మహాకాళి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో ఆమె పాల్గొన్నారు. మిగతా 2లో

## యూనివర్సిటీల్లో పెత్తనానికి కేంద్రం యత్నం



రోహిత వేములను అడ్డుకున్న వారికి అందలం

బెదరింపులకు పాల్పడ్డ రామచంద్రరావుకు బిజెపి పదివి

దళితులు, ఆదివాసీలను అణగదొక్కేవారికి పదవులు

ఢిల్లీలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క

న్యూఢిల్లీ : హెచ్‌సీయూ పీహెచ్‌డీ స్కాలర్ రోహిత్ వేముల ఆత్మహత్యకు కారణమైన రామచందర్ రావును తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా ఎలా నియమిస్తారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రశ్నించారు. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావుపై డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. శుక్రవారం నాడు దిల్లీలో ఏర్పాటు- చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన హక్కులను భాజపా ప్రభుత్వం హరిస్తోందన్నారు. ఆయనకు ఆ పదవి ఇవ్వడంపై బీజేపీ అధిష్టానం పునరాలోచన చేయాలన్నారు. రోహిత్ వేముల మరణానికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోకుండా పదవులు ఇస్తున్న బీజేపీ.. దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రోహిత్ వేముల ఆత్మహత్య ఘటనపై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ జరుపుతోందన్నారు. 2



## బలూచీలో 9మంది ప్రయాణికుల కాల్చివేత

లాహోర్ : బస్సులో ప్రయాణిస్తున్న వారిలో తొమ్మిది మందిని కిందకు దించి దారుణంగా కాల్చి చంపారు. ఈ సంఘటన పాకిస్తాన్‌లోని అల్లకల్లోల బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో చోటుచేసుకుంది. 2

# ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామా ఆమోదం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి లేఖ అందజేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవికి నామినేషన్ వేసేందుకు తనను అనుమతించలేదని, అందుకే రాజీనామా చేసినట్టు పేర్కొన్నారు. తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన గోషామహాల్ ఎమ్మెల్యే రాజాసింగ్ బీజేపీకి రాజీనామాను తాజాగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆమోదించారు. తెలంగాణ రాష్ట్ర బీజేపీ పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి సంబంధించిన విషయంలో నొచ్చుకున్న ఆయన పార్టీకి రాజీనామా చేశారు. ఆ సమయంలో రాజాసింగ్ తన రాజీనామా లేఖను రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డికి అందజేశారు. లేఖను స్పీకర్ కు పంపించాలని కూడా సూచించారు. తెలంగాణ బీజేపీలో చాలా లోపాలు ఉన్నాయని.. కొంతమంది పార్టీలో ఎదగకుండా చేస్తున్నారని ఆయన ఆ సమయంలో వ్యాఖ్యానించారు. అలాగే కొందరు పార్టీ ప్రగతికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తనకు మద్దతు ప్రకటించిన ముగ్గురు కౌన్సిల్ మెంబర్స్‌ను బెదిరించారని ఆయన అప్పట్లో ఆరోపించారు. తనను బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవికి నామినేట్ చేయనివ్వలేదని.. ప్రెసిడెంట్ ను ఎవరిని చేయాలో ముందే నిర్ణయించుకున్నప్పుడు ఎన్నికలు ఎందుకు..? అని తీవ్ర స్థాయిలో ప్రశ్నించారు.

# బలూచీలో 9మంది ప్రయాణికుల కాల్చివేత

ప్రావిన్స్‌లోని జోబ్ ప్రాంతంలో జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం ప్రయాణీకుల బస్సు నుండి పంజాబ్‌కు చెందిన తొమ్మిది మంది ప్రయాణికులను దింపి.. తిరుగుబాటు-దారులు కాల్చి చంపారని అసిస్టెంట్ కమిషనర్ జోబ్ నవీద్ ఆలం తెలిపారు. క్వెట్టా నుండి లాహోర్‌కు వెళ్తున్న బస్సును ఆపి ప్రయాణికుల ఐడి కార్డులను తనిఖీ చేసి.. వారిలో తొమ్మిది మందిని కిందకు దింపి కాల్చి చంపారు. మృతులు పంజాబ్ ప్రావిన్స్‌లోని వివిధ ప్రాంతాలకు చెందినవారిగా గుర్తింపు. తొమ్మిది మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ఆసుపత్రికి తరలించారని ఆయన అన్నారు.

# మరోమారు కాళేశ్వరం కమిషన్ ముందుకు హరీష్ రావు



ఒప్పందం చేశారని గుర్తుచేశారు. శాశ్వత ఒప్పందం కేసీఆర్ చేసి ఉంటే...సెక్షన్ 3 కోసం పోరాటం ఎందుకు చేస్తారని నిలదీశారు. సెక్షన్-3 విషయంలో ఉమా భారతి, గడ్కరీనీ కలిశారని చెప్పుకొచ్చారు మాజీ మంత్రి హరీష్‌రావు. కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేసి సెక్షన్-3ని కేసీఆర్ సాధించారని మాజీ మంత్రి హరీష్‌రావు ఉద్ఘాటించారు. బోర్డు తాత్కాలిక నీటి వినియోగం కోసం ఒప్పందం చేస్తుందని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి సైతం 299 టీఎంసీలకు సంతకాలు చేశారని మరి మీరు ఎలా చేశారని ప్రశ్నించారు. కృష్ణా నదిలో తెలంగాణ వాటాను రేవంత్ ప్రభుత్వం సాధించాలని కోరారు. రేవంత్ రెడ్డి అజ్ఞానంతో మాట్లాడారని.. తాను చాలా బాధతో చెబుతున్నానని అన్నారు. కృష్ణానదిని దోచుకో అని రేవంత్ రెడ్డి చంద్రబాబుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి అజ్ఞానాన్ని తాను బయటపెట్టిన తర్వాత ఆయన మాట మార్చారని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఎలాగూ తెలియదు... ఉత్తమ్ కుమార్ రెడ్డికి కూడా తెలీదు అంటే బాధేస్తోందని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు చెప్పినట్లు- కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందా అని ప్రశ్నించారు. 573 టీ-ఎంసీలు చాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పడం అజ్ఞానమని విమర్శించారు మాజీ మంత్రి హరీష్‌రావు. 00 ఏళ్ల కింద కాకతీయులు, నిజాం కాలంలో కట్టిన ప్రాజెక్టలని రేవంత్‌రెడ్డి ఖాతాలో వేసుకున్నారు. దేశానికి స్వాతంత్రం రాకముందు కట్టిన ప్రాజెక్టలను కూడా ఆయన ఖాతాలో వేసుకున్నారు. కాంగ్రెస్ 6లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తే...బీఆర్ఎస్ పాలనలో 48 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చాం. తుమ్మడిహెట్టి నుంచి బ్యారేజ్ మార్పుపై సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రప్రభుత్వాన్ని తప్పుబడుతున్నారు. కేంద్రం ఎందుకు అనుమతి ఇచ్చిందో ప్రశ్నించండి. 160 టీ-ఎంసీలకు కేంద్రం నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు అనుమతి తేలేదు?. అసెంబ్లీలో చర్చకు మేము సిద్ధం. మా మైక్ కట్ చేయకుండా, అసెంబ్లీ నుంచి పారిపోవద్దు. రేవంత్ 20 నెలల పాలనలో ఇప్పుడు ఒక్క చెరువు, చెక్ డ్యామ్ అయినా కట్టించారా.?. కేసీఆర్ ప్రభుత్వం ఏం చేయనిది నీళ్లు ఎలా వచ్చాయి.. పంటలు ఎలా పండాయి. కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లను వాడటం లేదు... 6శాతం నీళ్లను తక్కువగా వాడారని హరీష్‌రావు విమర్శించారు.

# హెచ్‌సిఎలో దొంగలు పడ్డారు

## సంబంధం లేనివారంతా పడి దోచుకున్నారు

## తెలంగాణ క్రికెట్ అసోషియేషన్ కార్యదర్శి గురువారెడ్డి

హైదరాబాద్,జులై 11 : క్రికెట్ అంటే ఏమిటో తెలియని వారితో హెచ్‌సీఏ భ్రష్టపు పట్టిపోయిందని, అవినీతిలో కూరుకుపోయిందని తెలంగాణ క్రికెట్ అసోషియేషన్ కార్యదర్శి గురువారెడ్డి అన్నారు. జగన్మోహన్ రావు అనహర్హుడని వ్యాఖ్యలు చేశారు. క్లబ్‌లో ఉన్నవారు ఎందుకు సహకరించారని నిలదీశారు. బీసీసీఐ ఇచ్చే గ్రాంట్‌ను గ్రౌండ్‌ల అభివృద్ధికి, క్రీడాకారులకు ఉపయోగించాలి కానీ దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. గతంలో ఉన్నట్టు ప్రస్తుతం లేదని.. అలా ఉంటే ప్రతీ సంవత్సరం తెలంగాణ రాష్ట్రం నుంచి ఒక క్రికెటర్ బయటకి వచ్చేవాడని గురువారెడ్డి అన్నారు. శుక్రవారంఆయన మీడియాతో మాట్లాడుతూ.. జగన్మోహన్ నీకు క్రికెట్ అంటే తెలుసా? ఎందుకు ఎలా ఎన్నికయ్యావు' అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ గ్రామీణ స్థాయిలో ఉన్న క్రికెటర్లకు గత పది సంవత్సరాలుగా గుర్తింపు ఇవ్వలేదన్నారు. తెలంగాణలో క్రికెట్‌కు గుర్తింపు వచ్చే వరకు పోరాడుతామని గురువా రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సిటీకే పరిమితం అయిందన్నారు. హెచ్‌సీఏలో ఎవరు ప్రెసిడెంట్ ఉన్నా అవినీతి జరుగుతోందని విమర్శించారు. ఐపీఎల్ నిర్వహణ కోసం బీసీసీఐ ప్రతీ సంవత్సరం హెచ్‌సీఏకు రూ.100 కోట్ల వరకు ఇస్తుందని ఆయన వెల్లడించారు. దాదాపు ఇప్పటి వరకు రూ.170 కోట్లు- గోల్ మాల్ జరిగిందని ఆరోపించారు. విజిలెన్స్ వారు విచారణ చేయడం.. తర్వాత సీఐడీ ఎంటర్ అవ్వడంతో పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి నిందితులను అరెస్ట్ చేసినట్లు- తెలిపారు. ఫేక్ క్లబ్ క్రియేట్ చేయడం, డాక్యుమెంట్లు- సృష్టించడం అంతా బయటపడిందని గురువారెడ్డి అన్నారు. ఎలక్షన్ కమిషన్ సంపత్ కుమార్ ఎలా ఇతనిని పోటీ చేయించారని ప్రశ్నించారు. జస్టిస్ నాగేశ్వర రావు చెప్పిన వివరాల ప్రకారం అంతకు ముందు నేర చరిత్ర ఉన్నవాళ్ళని కూడా విచారించాలని డిమాండ్ చేశారు. ఏ క్లబ్ కూడా సొంతంగా నడపట్లేదని స్పష్టం చేశారు. క్లబ్‌లలో ఉన్న 217 మంది సభ్యులు అందరూ దొంగలే. పబ్లిక్‌కు సంబంధించిన కోట్ల రూపాయలు ఎలా వాడుకున్నారు. దీని వెనక రాజకీయ నాయకులు ఎవరున్నా అన్నీ బయట పెడతాను. క్యాంటీన్‌ను కూడా ఎవరికి ఇచ్చారు? ఎంత నిధులు తిన్నారు అనే వివరాలు అన్నీ ఉన్నాయి. చాలా మంది దొంగలు ఇందులో ఉన్నారని మండిపడ్డారు.

# యువ సివిల్ ఇంజినీర్లు వినూత్నంగా ఆలోచించాలి

"2024%-25 ఆర్థిక సంవత్సరంలో నిర్మాణ రంగం 11.97 శాతం వృద్ధి రేటును నమోదు చేసి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ?80,000 కోట్లకు పైగా ఆదాయాన్ని సమకూర్చింది. రాష్ట్ర సేవల స్థూల విలువ జోడింపులో ఇది 24.9 శాతం. ఈ గణాంకాలు తెలంగాణ నిర్మాణ రంగ ప్రగతికి నిదర్శనం" అని ఈ సందర్భంగా మంత్రి వివరించారు. "ఇటీవల కాలంలో దేశంలోని అన్ని మెట్రో నగరాల్లో హైరైస్ భవన నిర్మాణాల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. మన హైదరాబాద్‌లో 100 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తున్న భవనాల సంఖ్య 200 కంటే ఎక్కువగా ఉంది. మరో 250 భవనాల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. ఇలాంటి తరుణంలోనే మనం పర్యావరణహితంగా అడుగులు వేయాల్సిన బాధ్యత మనపై ఉంది. ఈ తరహా భారీ భవనాల నిర్మాణంలో రీన్‌ఫోర్స్డ్ సిమెంట్ కాంక్రీట్(ఆర్ సీసీ) నిర్మాణాలకు బదులుగా కాంపోజిట్ స్టీల్ స్ట్రక్చర్స్ కు ప్రాముఖ్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది" అని అభిప్రాయపడ్డారు. "కంపోజిట్ స్టీల్ స్ట్రక్చర్స్ వినియోగం వల్ల భవనం పూర్తయ్యేందుకు పట్టే సమయం 40 శాతం, భారం 30 శాతం తగ్గుతుంది. భూకంపాలను సమర్థవంతంగా తట్టుకోగలవు. నిర్మాణ సమయంలో వెలువడే కాలుష్యం తగ్గుతుంది. మరీ ముఖ్యంగా... పునర్వినియోగం వల్ల సర్క్యులర్ ఎకానమీ వృద్ధి చెందుతుంది" అని చెప్పారు. "తెలంగాణలో ఆవిష్కరణలు కేవలం మాటలకే పరిమితం కావడం లేదు. ఆచరణలోనూ చూపిస్తున్నాము. భావితరాల కోసం కాంపోజిట్ స్టీల్ స్ట్రక్చర్స్ నిర్మాణాలను ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నాం. ఇందుకు నగరవాసులకు అందుబాటులోకి తెచ్చిన స్టీల్ వంతెనలు గొప్ప ఉదాహరణ. నిర్మాణ రంగంలో ఏఐ లాంటి ఎమర్జింగ్ టెక్నాలజీస్ వినియోగం, బిల్డ్ నౌ పోర్టల్ ద్వారా నిర్మాణ అనుమతుల్లో వేగం, జవాబుదారీతనం, విశ్వాసాన్ని పెంపొందించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాం" అని పేర్కొన్నారు. కాంపోజిట్ స్టీల్ హై-రైజ్ డిజైన్‌పై జాతీయస్థాయిలో ఒకే రకమైన మార్గదర్శకాలు(కోడ్) తెచ్చేలా కేంద్రం, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్)తో కలిసి పని చేస్తామన్నారు. సాంప్రదాయబద్ధంగా కాకుండా ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా వినూత్నంగా ఆలోచించాలని, కొత్త ఆలోచనలను ప్రోత్సహించేందుకు మా ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని యువ సివిల్ ఇంజనీర్లకు సూచించారు. స్మార్ట్ నగరాలు, స్థిరమైన గృహనిర్మాణం, సుస్థిర మౌలిక సదుపాయాల కల్పన ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేరుస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ ప్రతినిధులు ఎస్ జీఎస్ మూర్తి, మహేందర్ రెడ్డి, శేషాద్రి, కాశీరాం, నర్మదా, రమేష్, భీం రావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి మండలానికి 4-6 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లు

ఇందుకు సంబంధించి ఈనెల 27వ తేదీన శిక్షణ పొందిన లైసెన్స్‌డ్ సర్వేయర్లకు తుది పరీక్ష నిర్వహిస్తామని ఆ తర్వాత 28, 29 తేదీల్లో జెఎన్‌టియు ఆధ్వర్యంలో ల్యాబ్ ప్రాక్టికల్ పరీక్ష నిర్వహిస్తామని, ఆగస్టు 12వ తేదీన ఫలితాలు ప్రకటిస్తామని తెలిపారు. తుది పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్దులకు 40 రోజుల పాటు అప్రెంటిస్ శిక్షణ ఉంటుందని తెలిపారు. భూభారతి చట్టంలో రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్ తప్పనిసరి చేసిన నేపథ్యంలో ఇందుకు అవసరమైన సర్వేయర్లను అందుబాటులోకి తీసుకురావలన్న లక్ష్యంతో లైసెన్స్‌డ్ సర్వేయర్ల కోసం దరఖాస్తులను ఆహ్వానించగా 10 వేల మంది దరఖాస్తు చేసుకున్నారని ఇందులో తొలివిడతలో 7వేల మందికి 33 కేంద్రాల్లో మే 26వ తేదీనుంచి శిక్షణ ప్రారంభించామని ఈనెల 26తో 50 రోజుల శిక్షణ పూర్తవుతుందని తెలిపారు. మిగిలిన 3వేల మందికి ఆగస్టు 2వ వారం నుంచి శిక్షణ ప్రారంభిస్తామని తెలిపారు. రెవెన్యూ, సర్వే విభాగానికి మధ్య అవినాభావ సంబంధం ఉందని సర్వే విభాగం బలోపేతం తోనే రెవెన్యూ వ్యవస్థలో మెరుగైన సేవలు అందించగలుగుతామని దీనిని దృష్టిలో పెట్టుకొని సర్వేవిభాగాన్ని బలోపేతం చేస్తున్నామని గత పదేళ్ళలో సర్వే విభాగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందన్నారు. రెవెన్యూ సేవలను సామాన్యులకు అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంలో భాగంగా ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక జీపీవోను నియమిస్తున్నామని తెలిపారు. ఇందుకోసం విఆర్వో, వి ఆర్ ఎలకు అవకాశం కల్పించాలన్న ఉద్దేశంతో అర్హత పరీక్ష నిర్వహించగా 3554 మంది ఎంపికయ్యారని తెలిపారు. మరోసారి అవకాశం కల్పించాలన్న రెవెన్యూ సంఘాల అభ్యర్ధన మేరకు ఈనెల 27న మరోసారి వీరికి అర్హత పరీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. ఐదు నక్షా గ్రామాల్లో రీసర్వే పూర్తి.. గత ప్రభుత్వం నక్షా లేని గ్రామాలను గాలికి వదిలేస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి నేతృత్వంలో ఇందిరమ్మ ప్రభుత్వం దీనికి పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో రాష్ట్రంలో నక్షా లేని 413 గ్రామాలకు గాను 5 గ్రామాలలో ప్రయోగాత్మకంగా రీ సర్వేను విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందన్నారు. పైలెట్ గ్రామాలైన మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం సలార్ నగర్‌లో 422 ఎకరాలు, జగిత్యాల్ జిల్లా భీర్పూర్ మండలం కొమ్మనాపల్లి ( కొత్తది) గ్రామంలో 626 ఎకరాలు, ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమడ లోని 845 ఎకరాలు ,ములుగు జిల్లా వెంకటాపురం మండలం నూగురులో 502 ఎకరాలు, సంగారెడ్డి జిల్లా వట్ పల్లి మండలం షాహిద్ నగర్ లో 593 ఎకరాలలో మొత్తం ఐదు గ్రామాలలోని 2988 ఎకరాలలో చిన్న వివాదాలకు తావులేకుండా రైతుల సమక్షంలోనే క్షేత్రస్థాయిలో భౌతికంగా ఈసర్వే పూర్తిచేయడం జరిగిందన్నారు. దీని వల్ల భూమి సమాచారం, పారదర్శకత, వివాద పరిష్కారం, భూ యాజమాన్యంలో స్పష్టత వస్తుందని ఫలితంగా రైతులు, గ్రామీణ భూ యజమానులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ సర్వే ఫలితాలను పరిగణనలోకి తీసుకొని మిగిలిన గ్రామాల్లో కూడా రీసర్వే నిర్వహించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు

# యూనివర్సిటీల్లో పెత్తనానికి కేంద్రం యత్నం

త్వరలోనే తెలంగాణలో రోహిత్ వేముల చట్టాన్ని తీసుకువస్తామని.. న్యాయశాఖ దీనిపై పనిచేస్తోందని చెప్పారు. రోహిత్ ఆత్మహత్యకు కారణమైన బండారు దత్తాత్రేయకు గవర్నర్ పదవి, ఏబీవీపీ నాయకుడు సుశీల్ కుమార్‌కు ఢిల్లీ యూనివర్శిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్, రామచందర్ రావుకు తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవి ఇచ్చారన్నారు. 2016లో యూనివర్శిటీ- యాజమాన్యం రోహిత్ వేములపై చర్యలు తీసుకునేలా యూనివర్శిటీ- వద్ద రామచందర్‌రావు ఆందోళన చేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం దళితులు భయపడేలా బీజేపీ వ్యవహరిస్తోందని మండిపడ్డారు. దళితులు, ఆదివాసీలకు దేశంలో గౌరవం లేకుండా బీజేపీ ప్రవర్తిస్తోందని విమర్శించారు. దేశంలో దళితులు, ఆదివాసీలకు వ్యతిరేకంగా వ్యవహరించే వారికి బీజేపీ పదవులు ఇస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ వ్యవహరిస్తున్న తీరు ఆందోళనకరమన్నారు ఉపముఖ్యమంత్రి. రాజ్యాంగానికి వ్యతిరేకంగా బీజేపీ వ్యవహరిస్తోందని ఫైర్ అయ్యారు. దేశంలో వందల ఏళ్లుగా వెనుకబడిన వర్గాలు అణచివేతకు గురవుతున్నాయని తెలిపారు. దేశంలో ఉన్న ప్రతీ పౌరుడి హక్కులను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని డిప్యూటీ- సీఎం స్పష్టం చేశారు. అలాగే రోహిత్ వేముల చనిపోతే కనీసం ఆ కుటు-ంబాన్ని కేసీఆర్ పరామర్శించలేదని వ్యాఖ్యలు చేశారు. ఏ రోజు కూడా యూనివర్శిటీల సంక్షేమాన్ని పట్టించుకోలేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం యూనివర్సిటీలను నిర్వీర్యం చేస్తోందని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విమర్శించారు. యూనివర్సిటీలపై పెత్తనాన్ని సహించబోమని స్పష్టం చేశారు. ఏబీవీపీ, ఏఎస్ఏ మధ్య ఘర్షణ జరిగినప్పుడు భాజపా నేత రామచందర్‌రావు హెచ్‌సీయూకి వెళ్లి అధికారులపై ఒత్తిడి తెచ్చారు. రోహిత్ వేములతో పాటు మరో నలుగురు విద్యార్థులను యూనివర్సిటీ- నుంచి సస్పెండ్ చేయడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో అతను ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పట్లో ఈఘటన దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. దళిత, ఆదివాసీలను భాజపా చిన్నచూపు చూస్తోంది. కేంద్ర ప్రభుత్వం చర్యలను మేధావులు వ్యతిరేకించాలని భట్టి విక్రమార్క అన్నారు. 2017లో హైదరాబాద్ యూనివర్సిటీలో జరిగిన రోహిత్ వేముల ఆత్మహత్య దేశాన్ని కుదిపేసిందని గుర్తు చేస్తూ.. ఆ ఘటన వెనుక ఉన్న అసలు బాధ్యులను దేశ ప్రజలముందు నిలబడే చర్యనే అతి పెద్ద ప్రశ్నగా ఆయన అభివర్ణించారు. భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. 2017 లో రోహిత్ వేముల ఆత్మహత్య దేశాన్ని షేక్ చేసింది. సూసైడ్ లేఖలో రోహిత్ వేముల రాసిన అంశాలను పరిశీలిస్తే, ఎన్నో విషయాలు తెలుస్తాయి. ఆత్మగౌరవం కోసం చేస్తున్న పోరాటాలను అడ్డుకున్న ఏబీవీపీ సుశీల్ కుమార్కు డిల్లీ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టు ఇచ్చారు. ఇది దేశంలో జరుగుతున్న అన్యాయాన్ని ప్రజలు గమనించాలని భట్టి ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్ స్టూడెంట్ అసోసియేషన్ విద్యార్థులపై రామచందర్ రావు ఒత్తిడి తెచ్చారని.. వీసీపై ఒత్తిడి తెచ్చిన వ్యక్తిని బీజేపీ ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించడమంటే, దళితులను ఇబ్బంది పెట్టిన వారికి బహుమతి ఇచ్చినట్లే అని వ్యాఖ్యానించారు. అలాగే రోహిత్ వేముల కేసు పునర్విచారణకు కోర్టును ఆశ్రయించామని, త్వరలోనే తెలంగాణలో 'రోహిత్ వేముల చట్టం' తీసుకురావాలని సంకల్పించినట్లు- అయన వ్యాఖ్యానించారు.

# బిసి బిల్లుతో కవితకు ఏం సంబంధం

## ఆమె క్రెడిట్ కొట్టే ప్రయత్న మేందో

## ప్రభుత్వ వీప్ ఆది శ్రీనివాస్ సందేహం

న్యూఢిల్లీ,జులై 11 : బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు.. బీసీ బిల్లుకు ఏం సంబంధమని ప్రభుత్వ వీప్ ఆది శ్రీనివాస్ సందేహం వ్యక్తం చేశారు. ఈ బిల్లు ఆమోదం పొందడంపై ఆమె హడావుడి చేస్తుందంటూ మండిపడ్డారు. బీసీ బిల్లును సైతం కవిత హైజాక్ చేస్తుందని ఆరోపించారు. అయినా ఈ బిల్లు ఆమోదం పొందడంలో నీ పాత్ర ఏమిటంటూ కల్వకుంట్ల కవితను ఈ సందర్భంగా ఆయన సూటిగా ప్రశ్నించారు. బీసీలపై మొసలి కన్నీరు కార్చడం మానేయాలంటూ ఆమెకు ఆది శ్రీనివాస్ హితవు పలికారు. లేని రంగులు పూసుకుంటే ప్రజలు నమ్ముతారనేది వారి భ్రమని వ్యంగ్యంగా అన్నారు. కవిత మై డియర్ డాడీ అంటూ ఒక లేఖ రాసింది.. డాడీ మీరు ఇంటికి పరిమితం అయ్యారని కవిత అంటు-ందని ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ గుర్తు చేశారు. దేశ రాజధాని న్యూఢిల్లీ పర్యటనలో ఉన్న ఆది శ్రీనివాస్ శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ.. ఈ బిల్లు ఆమోదం పొందడం ద్వారా బీసీలు అందరూ సంబరపడి పండగ చేసుకుంటు-ంటే కవిత ఏదో కష్టపడినట్లు-గా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రిజర్వేషన్ బిల్లు కేబినెట్ ఆమోదం పొందడం కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధికి నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణన జరిగిందని గుర్తు చేశారు. ఆర్డినెన్స్ తీసుకు రావడం బీసీల విజయమన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లోని బీసీ నేతలంతా.. కాంగ్రెస్ పార్టీని అభినందించాలని ఈ సందర్భంగా వారికి సూచించారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధితో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళ్తుందని వివరించారు. సీఎం రేవంత్ రెడ్డితోపాటు- ఆయన మంత్రి వర్గం కష్ట పడుతుందన్నారు.

# ఏడాదిన్నరలో రూ.50వేల కోట్ల పెట్టుబడులు..

శుక్రవారం హైటెక్ సిటీ ట్రైడెంట్ హోటల్‌లో "ఈటీ ఫార్మా టెక్ ఇన్నోవేటివ్ కాంక్లేవ్" రెండో ఎడిషన్ ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. "2024-25లో రూ.66వేల కోట్ల విలువైన లైఫ్ సైన్సెస్ ఉత్పత్తులను తెలంగాణ ఎగుమతి చేసింది. ప్రపంచానికి కావాల్సిన మూడింట ఒక వంతు వ్యాక్సిన్లను అందిస్తూ హైదరాబాద్ 'వ్యాక్సిన్ రాజధాని'గా ప్రసిద్ధి చెందింది. దేశంలో అతిపెద్ద మెడికల్ డివైసెస్ పార్క్ నుంచి "మేడ్ ఇన్ తెలంగాణ" స్టెంట్లు, కేథెటర్లు యూఎస్, జపాన్ తో సహ 89 దేశాలకు ఎగుమతి అవుతున్నాయి" అని ఈ సందర్భంగా వివరించారు. "లైఫ్ సైన్సెస్ లో గ్రామీణ, సెమీ- అర్బన్ ప్రాంతాల్లో 5 లక్షల మందికి కొత్తగా ఉపాధి అవకాశాలను కల్పించాలని మా ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకోసం రూ.లక్ష కోట్లతో దీర్ఘకాలిక పెట్టుబడి వ్యూహాన్ని అమలు చేయబోతున్నాం. అందరి అభిప్రాయాలను సేకరించి వికారాబాద్, నల్గొండ, మెదక్ లో ఫార్మా విలేజెస్ ను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం" అని చెప్పారు. "లైఫ్ సైన్సెస్ రంగానికి అవసరమైన అత్యుత్తమ నైపుణ్య మానవ వనరులను అందించాలనే లక్ష్యంతో అంతర్జాతీయ ప్రమాణాలతో త్వరలోనే 'లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేయబోతున్నాం. ఇక్కడ స్వల్పకాలిక, దీర్ఘకాలిక కోర్సులను జీవ శాస్త్ర దిగ్గజ సంస్థల భాగస్వామ్యంతో అందించబోతున్నాం. ఇప్పటికే 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' ద్వారా డాక్టర్ రెడ్డీస్, అరబిందో లాంటి సంస్థలతో కలిసి తెలంగాణ యువతకు శిక్షణ ఇస్తున్నాం. సెంటర్ ఫర్ ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్(సీ4ఐఆర్) భాగస్వామ్యంతో సైన్స్ గ్రాడ్యుయేట్లకు లైఫ్ సైన్సెస్ రంగంలో నిపుణులను తీర్చి దిద్దుతున్నాం" అని పేర్కొన్నారు. "లైఫ్ సైన్సెస్ రంగంలో 'తెలంగాణ' బ్రాండ్ ను మరింత విశ్వవ్యాప్తం చేసేందుకు ప్రత్యేకంగా 'తెలంగాణ కాంప్రెహెన్సివ్ లైఫ్ సైన్సెస్ పాలసీ'కి శ్రీకారం చుట్టాం. ఇది చివరి దశలో ఉంది. ఈ రంగాన్ని కేవలం పరిశ్రమలు లేదా ఆర్ అండ్ డీ సెంటర్లకే మేం పరిమితం చేయడం లేదు. టెక్నాలజీ మేళవింపుతో ప్రజలకు ఉపయోగపడేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నాం. ఇప్పటికే మూడు జిల్లాల్లో నోటి, రొమ్ము , గర్భాశయ క్యాన్సర్ల ను ముందే గుర్తించేందుకు ఏఐ ఆధారిత స్క్రీనింగ్ ను ప్రయోగాత్మకంగా ప్రారంభించాం. సత్ఫలితాలు రావడంతో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వాసుపత్రులు, వైద్య కళాశాలలకు విస్తరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం" అని వివరించారు. కార్యక్రమంలో పలు దిగ్గజ ఫార్మా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో బోనాలు

బోనాల ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చిన తలసాని.. మాజీ ఎమ్మెల్యే ప్రసూనతో మాట్లాడారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పటి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ కాసేపు సరదాగా మాట్లాడారు. సికింద్రాబాద్ మహంకాళి బోనాల జాతరకు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు పోలీసులు. జులై 13 నుంచి 15 వరకు సికింద్రాబాద్ మహంకాళి ఆలయ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. వాహనదారులందరూ పోలీసులకు సహకరించాలని కోరారు ట్రాఫిక్ పోలీసులు. ట్రాఫిక్ పోలీసులు సూచించిన మార్గంలోనే వాహనదారులు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు పోలీసులు. జులై 13న సీఎం రేవంత్ రెడ్డి మహంకాళి అమ్మవారికి బోనం సమర్పిస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. ఈ మేరకు ప్రభుత్వం పక్షాన జిల్లా కలెక్టర్,దేవాదాయ శాఖ,పోలీస్ , జీహెచ్ ఎంసీ అధికారులు అన్ని ఏర్పాట్లు- పూర్తి చేశారు. ప్రభుత్వం ఎన్ని ఏర్పాట్లు- చేసిన ప్రజల సహకారం అవసరమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఎటువంటి అసౌకర్యం కలగకుండా భక్తులకు ఏర్పాట్లు- చేశామన్నారు. లష్కర్ బోనాలు చారిత్రాత్మక మైనవని చెప్పారు. ప్రజల మంచికొరకు అమ్మవారి ఆశీర్వాదం ఉండాలన్నారు. తెలంగాణ వ్యాప్తంగా బోనాల పండగ సందడి కొనసాగుతోంది..రాష్ట్ర వ్యాప్తంగా బోనాల పండుగ వైభవంగా జరుపుకుంటారు. ముఖ్యంగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో బోనాల పండగ తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా జరుపుకుంటారు. నెలరోజుల పాటు- జరిగే ఈ ఉత్సవాలతో నగరంలో అధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంటు-ంది. గోల్కొండ, లాల్ దర్వాజ, ఉజ్జయిని అమ్మవారి బోనాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ క్రమంలో ఆదివారం జులై 13 నుంచి 15 వరకు సికింద్రాబాద్ పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలతో పాటు- వైన్స్ లు కూడా క్లోజ్ చేయాలని ఆదేశించారు.

# జూబ్లీహిల్స్‌లో 5ఓట్లతో అభివృద్ధి కార్యక్రమాలు

## ప్రారంభించిన మంత్రులు పొన్నం, వివేక్, తుమ్మల

హైదరాబాద్,జులై 11 : జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో శుక్రవారం రూ.5 కోట్లకు పైగా నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లోని వెంగళ్‌రావు నగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి మంత్రులు వివేక్ వెంకటస్వామి, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అన్ని సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత హైదరాబాద్ నగరంలో బస్తీలు, కాలనీల అభివృద్ధి చెందలేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో నేతలు తాము ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గాల్లో మాత్రమే వివక్షపూరితంగా అభివృద్ధి చేసుకున్నారని విమర్శించారు. హైదరాబాద్ పరిధిలోని నియోజకవర్గాలను అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించినట్టు- తెలిపారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే స్థానిక అధికారి, ప్రజాప్రతినిధులు, మంత్రుల దృష్టికి తీసుకురావాలని కోరారు. కొంత మంది ఉప ఎన్నికల సమయంలోనే ఇక్కడికి వస్తున్నారని పొన్నం ప్రభాకర్ ఎద్దేవా చేశారు.

# రష్యా నుంచి చమురు దిగుమతులు

## ఓ రకంగా ప్రపంచ ఆర్థికానికి మేలు జరిగింది

## కేంద్ర పెట్రోలియ శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి

న్యూఢిల్లీ,జూలై11 : రష్యా నుంచి చమురు కొనడం ద్వారా భారత్ ప్రపంచానికి మేలు చేసిందని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి తెలిపారు. ఓరకంగా భారత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మేలు చేసిందని అన్నారు. లేదంటే అంతర్జాతీయ మార్కెట్లో ధరలు ఆకాశన్నంటేవని తెలిపారు. ఉక్రెయిన్‌పై యుద్ధం సాగిస్తున్న రష్యాపై పశ్చిమ దేశాలు ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ మాస్కో నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడంపై అప్పట్లో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీనిపై భారత్ ఎప్పటికప్పుడు స్పష్టతనిస్తూనే ఉంది. తాజాగా కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి దీనిపై మరోసారి స్పందించారు. రష్యా చమురును ఎన్నడూ ఆంక్షల పరిధిలోకి తీసుకురాలేదు. కేవలం దాని ధరపై మాత్రమే పరిమితి విధించారు. ప్రపంచ చమురు సరఫరా గొలుసు ఎలా ఉంటుందన్న వాస్తవం చాలామందికి తెలుసు. రష్యా నుంచి డిస్కౌంట్లో వచ్చిన చమురును భారత్ కొనుగోలు చేయడం వల్ల ప్రపంచ మార్కెట్లకు మేలే జరిగింది. లేదంటే చమురు ధరల మోత మోగేదని పురి అన్నారు. సాధారణంగా రష్యా రోజుకు 9 మిలియన్ బ్యారెళ్ల చమురును ఉత్పత్తి చేస్తోంది. ప్రపంచంలోని అతిపెద్ద ముడిచమురు ఉత్పత్తిదారుల్లో మాస్కో ఒకటి. ఇక, ప్రపంచవ్యాప్తంగా రోజుకు 97 మిలియన్ బ్యారెళ్ల చమురు సరఫరా అవుతోంది. ఆంక్షల కారణంగా ఇందులో 9 మిలియన్ బ్యారెళ్ల సరఫరా ఒక్కసారిగా ఆగిపోతే.. ప్రపంచ వినియోగంలో 10శాతం తగ్గించు కోవాల్సి వస్తుంది. అది అసాధ్యం. అప్పుడు సరఫరా తగ్గడంతో బ్యారెల్ చమురు ధర 120-130 డాలర్లకు పెరిగేదని కేంద్రమంత్రి వివరించారు. ఎనర్జీ మార్కెట్‌ను అర్థం చేసుకోలేనివారే ఇలాంటి అంశాలపై మాట్లాడతారని ఆయన దుయ్యబట్టారు.

# ఆపరేషన్ సింధూర్‌పై విదేశీ మీడియా దుష్ప్రచారం

### భారత్‌పై పాక్ దాడికి ఒక్క ఆధారమైనా చూపగలరా

### లక్ష్యాలను ఛేదించడంలో భారత్ అసమాన ప్రతిభ

### ఐఐటీ మద్రాస్ 62వ స్నాతకోత్సవంలో అజిత్ ధోవల్



చెన్నై,జులై 11 : ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ చేసిన దాడుల్లో భారత్‌కు నష్టం కలిగిందని విదేశీ మీడియా చేస్తున్న ప్రచారాలపై జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ ఆగ్రహం వ్యక్తంచేశారు. పాక్ దాడుల్లో భారత్‌కు నష్టం కలిగిందనే విషయాన్ని రుజువు చేయడానికి ఏ ఒక్క ఆధారాన్ని అయినా చూపాలని సవాలు విసిరారు. చెన్నైలోని ఐఐటీ మద్రాస్ 62వ స్నాతకోత్సవంలో డోభాల్ మాట్లాడుతూ, పాకిస్థాన్ లోపలకు వెళ్లి విజయవంతంగా 9 ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం దాడులు జరిపిందని, ఒక్క టార్గెట్ కూడా మిస్ కాలేదని చెప్పారు. ఉగ్రవాదులు ఎక్కడున్నారనే కచ్చితమైన సమాచారంతో ఈ దాడులు జరిపామని చెప్పారు. భారతదేశ ఇంటెలిజెన్స్, కార్యాచరణ కచ్చితత్వాన్ని ఈ మిషన్ చాటిచెప్పిందని అన్నారు. కేవలం 32 నిమిషాల్లో ఈ ఆపరేషన్ పూర్తి చేసినట్టు- చెప్పారు. భారతదేశ వ్యూహాత్మక ఆపరేషన్ విశ్వసనీయతను ప్రశ్నించే వారు భారత్ వైపు నష్టం జరిగిందని చెప్పే ఒక్క ఫోటోనైనా చూపించాలని సవాలు చేశారు. ఆపరేషన్ సిందూర్‌లో భారత సైన్యం పాక్‌లోని ఉగ్రస్థావరాలను ఎలా ధ్వంసం చేసిందనే విషయాలను వెల్లడించారు. ఈ ఆపరేషన్‌లో స్వదేశీ రక్షణ సాంకేతికతను వినియోగించి దాయాదికి ముచ్చెమటలు పట్టించామని అన్నారు. సోషల్ మీడియాలో విదేశీ వార్తాసంస్థలు ఆపరేషన్ సిందూర్‌పై ప్రచారం చేస్తున్న తప్పుడు కథనాలను డోభాల్ కొట్టిపడేశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ అది చేసింది.. ఇది చేసిందంటూ విదేశీ మీడియా అసత్య కథనాలు ప్రసారం చేసిందని మండిపడ్డారు. ఆ దేశంలో ఉగ్రస్థావరాలు ఎక్కడెక్కడ ఉన్నాయనే అత్యంత కచ్చితమైన సమాచారంతోనే భారత సైన్యం దాడులు నిర్వహించిందన్నారు. పాకిస్థాన్‌లోని 13 వైమానిక స్థావరాలు ధ్వంసమైన ఫొటోలు మాత్రమే బయటకు వచ్చాయి కానీ.. భారత్‌కు నష్టం జరిగినట్లు ఒక్క ఫొటో కూడా లేదని వ్యాఖ్యానించారు. భారత్‌కు చెందిన ఆయుధ స్థావరాలపై దేశ సైన్యం చిన్నగీత కూడా పడనివ్వలేదని అన్నారు. భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను, యుద్ధ పరిస్థితులను ఎదుర్కోవడానికి కేంద్ర ప్రభుత్వం ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా రక్షణ రంగానికి అవసరమైన సాధన సంపత్తిని దేశీయంగానే రూపొందిస్తోందని డోభాల్ పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో సుఖోయ్-30 ఎంకేఐ యుద్ధ విమానాల ద్వారా ప్రయోగించిన బ్రహ్మోస్ క్షిపణులు పాకిస్థాన్ భూభాగాల లోపలి వరకూ వెళ్లి ఆ దేశానికి చెందిన పలు వైమానిక స్థావరాలను దెబ్బతీశాయన్నారు. పాకిస్థాన్ సైన్యం ఢిల్లీ లక్ష్యంగా ప్రయోగించిన ఫతాహ్-11 బాలిస్టిక్ క్షిపణులను భారత బలగాలు... గగనతల రక్షణ వ్యవస్థ ఎస్-400తో మధ్యలోనే సమర్థమంతంగా పేల్చివేశాయని తెలిపారు.

## ఘనంగా కేంద్ర మంత్రి పుట్టినరోజు వేడుకలు



తిమ్మాపూర్, జూలై 11,(ది క్రైమ్ న్యూస్): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పర్లపల్లి, బాలయ్యపల్లి గ్రామాల్లో శుక్రవారం కేంద్ర మంత్రి బండి సంజయ్ పుట్టినరోజు సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు బీజేపీ మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి పేర్కొన్నారు. పర్లపల్లి గ్రామంలోని 75 మంది ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు గొట్టిముక్కలతిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో నోట్ బుక్స్, పెన్నులు, బిస్కెట్ పాకెట్ లను, బాలయ్యపల్లి లోని పాఠశాల పిల్లలకు కూడా బుక్స్, పెన్నులు తో పాటుగా,గురుపౌర్ణమి సందర్భంగా ఉపాధ్యాయ సిబ్బందికి సన్మానం నిర్వహించి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి సేవా స్ఫూర్తిని చాటుకున్నారు. పుట్టినరోజున హంగు ఆర్భాటాలకు తావివ్వకుండా ప్రజాప్రయోజనమైన సేవలు చేయాలని బండి సంజయ్ చెప్పిన విధంగానే కార్యక్రమాలు నిర్వహించినట్లు మండల అధ్యక్షులు తెలిపారు.కార్యక్రమంలో ఆయా గ్రామాల పార్టీ కార్యకర్తలు బుర్ర శ్రీనివాస్ గౌడ్,దేవ వినోద్ రెడ్డి,గట్టు రాజు, మహేష్,సత్యం, సంపత్, అఖిల్,తిరుపతి, జాడి రాజు,వినయ్, మనోహర్,గణేష్, వెంకటేష్, కళ్యాణ్,విగ్నేష్, విష్ణు, అభిషేక్ తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు.

## బండి సంజయ్ పుట్టిన రోజున సంబరాలు జరుపుకున్న బిజెపి పార్టీ శ్రేణులు

భూపాలపల్లి/కాటారం/జులై - 11:(ది క్రైమ్ న్యూస్) : భారత జాతీయ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంటు సభ్యులు, కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పుట్టినరోజును కాటారం మండల కేంద్రంలో శుక్రవారం మండల శాఖ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా సంబరాలు జరిపారు. మండల అధ్యక్షుడు దుర్గం తిరుపతి మాట్లాడుతూ ఒక కార్యకర్త నుంచి కార్పొరేటర్ గా ఎన్నికై పార్లమెంటు సభ్యులుగా రెండు దఫాలుగా ప్రస్తుతం కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రిగా కొనసాగుతున్నారని గుర్తు చేశారు. బిజెపి పార్టీలో కష్టపడి పనిచేసే వారికే గుర్తింపు ఉంటుందని, వారికే పదవులు వస్తాయని, ఒక ఎస్సి బిడ్డ బంగారు లక్ష్మణ్ ని జాతీయ అధ్యక్షుడిగా, ఒక అబ్దుల్ కలాం ని రాష్ట్రపతిని, రామ్నాథ్ కోవింద్ ని రాష్ట్రపతిగా, వెంకయ్య నాయుడుని గవర్నర్ గా, ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపతి ముర్మ నను రాష్ట్రపతిగా చేసింది భారత జనత పార్టీయే, వీళ్లంతా కూడా చిన్న స్థాయి కార్యకర్తల నుండి జాతీయ నాయకులు అయిన వారేనని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ పార్టీలో అంగ బలం, అర్థ బలం ఉన్నవాళ్లే నాయకులవుతారు అని, రాబోయే స్థానిక ఎలక్షన్లలో సర్పంచ్ ఎంపీటీసీ జెడ్పిటిసిలుగా గెలిపించుకుందాం అని కాంగ్రెస్ వాళ్ళను చిత్తుచిత్తుగా ఓడిద్దామని అన్నారు.



## ఎమ్మెల్యే చేతుల మీదుగా సీనియర్ జర్నలిస్టు బందెల రాజశేఖర్‌కు ఎల్‌ఓసి అందజేత



పెద్దపల్లి ప్రతినిధి ( క్రైమ్ న్యూస్) : గత ఆరు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో కుడికాలు తొలగించబడిన సీనియర్ జర్నలిస్ట్ తెలంగాణ ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కు బందెల రాజశేఖర్ కు కృత్రిమ కాలు కోసం లక్ష 25 వేల ఎల్ఓసి పత్రాన్ని పెద్దపెల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అందజేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్కే గార్డెన్ లో ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా సాయంత్రం పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రామారావు బందెల రాజశేఖర్ కు మంజూరైన ఎల్ఓసి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఎన్ని లక్షలైనా మంజూరు చేసేందుకు సిద్ధమని ఎంత ఖరీదైన కాలు పెట్టించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఎమ్మెల్యే విజయ రామారావు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ పెద్దపల్లి జిల్లా నాయకులు కుమ్మరి ముఖేష్ బందెల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## హామీని నిలబెట్టుకున్న నేత రేవంత్ రెడ్డి

### 42శాతం బిసి రిజర్వేషన్లతో సామాజనిక న్యాయం

### దేశంలో తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోంది

### రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి ప్రశంసలు



ఖమ్మం,జులై 11 : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడం ద్వారా సిఎం రేవంత్ రెడ్డి తన మాటను నిలబెట్టుకున్న నాయకుడిగా నిలిచాడని రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి అన్నారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాజీ కేంద్రమంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అంశంపై ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డిని ప్రశంసలతో ముంచెత్తారు. ఇది రాజకీయ నిర్ణయం కాదని, సామాజికంగా గొప్ప మార్పునకు నాంది అని అభివర్ణించారు. అలాగే, ఇవ్వాళ నాకు చాలా గర్వంగా ఉంది. దేశవ్యాప్తంగా తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తోంది. రాష్ట్ర ప్రజలందరికీ గర్వపడే రోజులు ఇవని రేణుక పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో సామాజిక న్యాయం సాధ్యమవుతోందని తెలిపారు. ఎవరెవరో మాటలు చెప్పారు కానీ.. చేసి చూపించింది మాత్రం సీఎం రేవంత్ రెడ్డి అంటూ ఆమె స్పష్టం చేశారు. గురువారం జరిగిన కేబినెట్ తీసుకున్న 42శాతం బీసీ రిజర్వేషన్ నిర్ణయం వల్ల వారికి రాజకీయాల్లోనే కాదు.. ఉద్యోగాల్లోనూ మెరుగైన అవకాశాలు లభించనున్నాయని పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ ఒక్క సంతకంతో మహిళల జీవితాలను మార్చారు. ఆయన తీసుకున్న నిర్ణయాలతో భర్తలు కూడా గౌరవం చూపించారు. ఇప్పుడు రాహుల్ గాంధీ హయంలో బీసీలకు చరిత్ర సృష్టించే నిర్ణయం తీసుకున్నారు. 42 శాతం రిజర్వేషన్ దేశానికే మార్గదర్శిగా నిలుస్తుందని ఆమె అన్నారు. ఈ నిర్ణయం జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. నాకు దేశవ్యాప్తంగా మెసేజ్‌లు వస్తున్నాయి. ప్రజలు, కార్యకర్తలు ఎంతో ఉత్సాహంతో ముందుకు వస్తున్నారు. న్యాయం చేయగలిగే ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమే అని రేణుకా చౌదరి అన్నారు. మరోవైపు బీఆర్ఎస్ పార్టీపై ఆమె విమర్శలు గుప్పించారు. వాళ్లు పూటకోసారి పార్టీ పేరు మారుస్తుంటారు. కేసీఆర్ ఆరోగ్యం బాగుండాలి.. ఎందుకంటే వాళ్లు అలాగే ఉన్నప్పుడు మేము అధికారంలో ఉంటాం. బీఆర్ఎస్‌లో గ్రూపులు ఉన్నాయి. ఎమ్మెల్సీ కవిత గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది అని వ్యాఖ్యానించారు. ఇన్ని సంవత్సరాలు నాయకులు చెప్పినవి సొల్లు కబుర్లే.. కానీ ఇప్పుడు రాష్ట్రానికి అసలైన సీఎం లభించడమే గొప్ప విషయం. రేవంత్ రెడ్డి చేసిన నిర్ణయం దేశానికి మార్గం చూపుతుంది. చేతి గుర్తు అన్నది దేశాన్ని ముందుకు నడిపే సత్తా ఉన్న చిహ్నం అని అన్నారు.

## హెచ్‌సిఎ అవకతవకలపై లోతైన విచారణ

హైదరాబాద్,జూలై11 : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో చోటుచేసుకున్న ఆర్థిక అవకతవకలపై సీబీఐ దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ కేసులో ఇప్పటికే అరెస్ట్ అయిన ఐదుగురు నిందితులు 14 రోజుల రిమాండ్‌లో ఉన్నారు. ఈ నేపథ్యంలో నిందితులను మరింతగా విచారించాల్సిన అవసరం ఉందంటూ, తెలంగాణ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సీఐడీ)మల్కాజ్‌గిరి కోర్టులో కస్టడీ పిటిషన్‌ను దాఖలు చేసింది. సీఐడీ తమ పిటిషన్‌లో నిందితులను 10 రోజుల పాటు తమ కస్టడీకి అప్పగించాలని కోరింది. ఈ కస్టడీ పిటిషన్‌పై నేడు మల్కాజ్‌గిరి కోర్టు విచారణ జరిపనుంది. విచారణ అనంతరం కోర్టు తుది తీర్పు వెల్లడించనుంది. హెచ్‌సీఏ వ్యవహారాలపై విచారణ చేస్తున్న సీఐడీ, అసోసియేషన్ పేరుతో భారీగా అక్రమాలు చోటు-చేసుకున్నట్టు- గుర్తించింది. హెచ్‌సీఏకి వచ్చిన నిధుల దుర్వినియోగం, క్లబ్బులకు జరిగిన నిధుల కేటాయింపు, ఖర్చుల తీరును తేల్చే క్రమంలో అనేక అనుమానాస్పద అంశాలు వెలుగులోకి వచ్చాయి. ప్రధానంగా హెచ్‌సీఏ మాజీ అధ్యక్షుడు జగన్మోహన్ రావు ఈ అవకతవకలకు కీలక సూత్రధారిగా వ్యవహరించినట్టు- అధికారులు భావిస్తున్నారు. బీసీసీఐ, ఐపీఎల్ ఫ్రాంచైజీల నుంచి గత రెండు సంవత్సరాలలో హెచ్‌సీఏకి దాదాపు రూ. 300 కోట్లు- వచ్చినట్టు సమాచారం. ఈ మొత్తంలో ఎన్నికలు, క్లబ్‌లకు నిధుల మంజూరు, ప్రాజెక్టుల కేటాయింపులపై అనేక ప్రశ్నలు నిలుస్తున్నాయి.

## కర్నాటక ప్రభుత్వం కీలక నిర్ణయం

### స్కూలు విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం

### వెల్లడించిన డిప్యూటి సిఎం శివకుమార్

బెంగళూరు,జులై 11 : కర్ణాటక ప్రభుత్వం విద్యార్థులకు గుడ్ న్యూస్ చెప్పింది. కర్ణాటక పబ్లిక్ స్కూల్స్ సహా ప్రభుత్వ పాఠశాలల్లో లోయర్ కిండర్ గార్టెన్ నుండి ప్రీ-యూనివర్శిటీ- కోర్సు వరకు చదువుతున్న విద్యార్థులకు ఉచిత బస్సు సర్వీసును ప్రకటించింది. శుక్రవారం ఉప ముఖ్యమంత్రి శివకుమార్ ఉచిత బస్సుపై ప్రకటన చేశారు. మారుమూల, వెనుకబడిన ప్రాంతాల పిల్లలకు ప్రయాణ ఖర్చులను తగ్గించడం, పాఠశాల హాజరును పెంచడం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు- తెలిపారు. ఈ సేవ విద్యార్థులు విద్యను పొందడాన్ని సులభతరం చేయడమే కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు, సమయపాలన, మొత్తం విద్యా పనితీరును మెరుగుపరుస్తుందని ప్రభుత్వం విశ్వసిస్తుందని చెప్పారు. ఈ మేరకు ఎక్స్ వేదిగా.. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది! ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కర్ణాటక ప్రభుత్వ పాఠశాలల్లో రఔఏ నుండి ÷ఖఈ వరకు చదువుతున్న విద్యార్థులకు ఉచిత బస్సు సర్వీసును ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని డిప్యూటీ- సిఎం శివకుమార్ చెప్పారు.

## భద్రాద్రి ఇవోపై దాడి దుర్మార్గం

### ఘటనపై బిజెపి స్పందించకపోవడం దారుణం: కెటిఆర్

హైదరాబాద్,జులై11 : భద్రాద్రి ఇవోపై దాడిని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ ఖండించారు. ఆంధ్రప్రదేశ్‌లోని పురుషోత్తపట్నంలో ఉన్న భద్రాద్రి దేవస్థాన భూముల్లో జరుగుతున్న ఆక్రమణలను, పక్కా భవన నిర్మాణాలను అడ్డుకునేందుకు వెళ్లిన ఆలయ కార్యనిర్వహణ అధికారిణి పైనా, 30 మంది సిబ్బందిపైనా ఆ గ్రామస్తులు మంగళవారం కర్రలతో దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. భద్రాద్రి ఆలయ ఈవోపై దాడి జరిగిన ఘటనపై బీజేపీ రాచమంద్రా నోరు తెరవరేం..? అని కేటీఆర్ ప్రశ్నించారు. రాములోరి భూములను ఆక్రమించుకుంటోంటే మాటైనా మాట్లాడరేం? మీ భాగస్వామి ప్రభుత్వం చెరలో ఉన్నాయని వదిలేస్తున్నారా? లేక ఈసారి మొత్తం భద్రాద్రినే గంపగుత్తగా వారి చేతిలో పెడదామనుకుంటున్నారా? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఓట్ల కోసమే చేసే మీ రామజపాలను, సీట్ల కోసమే వేసే మీ దొంగ నాటకాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారు. మోదీతో మాట్లాడతారో, మీ దోస్తు దగ్గర మోకరిల్లుతారో మీ ఇష్టం.. భద్రాద్రిని కాపాడండి.. ఆక్రమణల చెర నుంచి విడిపించండి అని కేటీఆర్ పేర్కొన్నారు.

## హిందీని గుడ్డిగా వ్యతిరేకించడం సరికాదు

### హిందీ నేర్చుకోవడంతో లాభమే తప్ప నష్టం లేదు

### హిందీ దివస్ కార్యక్రమంలో డిప్యూటి సిఎం పవన్

హైదరాబాద్,జులై 11 : విద్య, ఉపాధి, వ్యాపార అవకాశాల కోసం భాషతో సంబంధం లేకుండా ముందుకెళ్తున్న ప్రస్తుత రోజుల్లో హిందీని గుడ్డిగా వ్యతిరేకించడం సరికాదని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. అలా చేయడం రాబోయే తరాల అభివృద్ధిని అడ్డుకోవడమే అవుతుందన్నారు. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఏర్పాటు- చేసిన రాజ్య భాషా విభాగం గోల్డెన్ జూబ్లీ వేడుకలకు పవన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. హిందీ భాషపై ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య వివాదం కొనసాగుతూనే ఉంది.. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం.. బలవంతంగా.. రాష్ట్రాలపై హిందీని రుద్దే ప్రయత్నం చేస్తుందని ఆరోపణలు, విమర్శలు ఉన్నాయి.. అయితే, ఈ తరుణంలో జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.. హైదరాబాద్‌లో నిర్వహించిన హిందీ దివస్ కార్యక్రమంలో పాల్గొని హిందీ దివస్ శుభాకాంక్షలు తెలిపిన ఆయన.. హిందీని ప్రేమిద్దాం.. మనదిగా భావిద్దాం అని వ్యాఖ్యానించారు.. మన దేశం వివిధ సంస్కృతులు ఉంటాయి.. అందరినీ హిందీ ఒక కామన్ భాషగా కలుపుతుందన్నారు.. విదేశస్తులు మన భాష నేర్చుకుంటారు.. మనం హిందీ అంటే ఎందుకు భయపడాలని ప్రశ్నించారు. హిందీ జబర్దస్త్ వస్తువు ఏమీ కాదు.. జర్మనీ, ఇతర భాషలు నేర్చుకుంటున్నాం.. కానీ, హిందీతో రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.. హిందీ మనది అనడంలో సిగ్గు ఎందుకు..? హిందీ నీ ప్రేమిద్దాం.. మనదిగా భావిద్దాం అన్నారు పవన్ కల్యాణ్.. బెంగాలీ గీతం జాతీయ గీతం అయింది.. అబ్దుల్ కలాం మిస్సైల్ మన్ అయ్యారు.. దక్షిణ భారత దేశస్తుడు చేసిన జెండా భారత జెండా అయింది.. ప్రతీ భాష జీవ భాష.. రాష్ట్ర భాష హిందీ.. రాష్ట్ర భాష హిందీని స్వాగతిస్తున్నారు.. మాతృ భాష మన అమ్మ భాష అయితే.. పెద్దమ్మ భాష హిందీగా అభివర్ణించారు.. హిందీని వ్యతిరేకించడం రాబోయే తరాల అభివృద్ధిని పరిమితం చేయడమే అవుతుందన్నారు పవన్ కల్యాణ్.. ఉర్దూను, పర్షియన్ ను అంగీకరించి.. హిందీని వ్యతిరేకించడం అవివేకం అవుతుందన్నారు.. 31 శాతం సినిమాలు హిందీ లో డబ్ అవుతున్నాయి.. వ్యాపారానికి హిందీ కావాలి.. కానీ, నేర్చుకోవడానికి అభ్యంతరం ఎందుకు? అని నిలదీశారు పవన్ కల్యాణ్.. హిందీలో డబ్ అయిన 31 శాతం సౌత్ ఇండియన్ సినిమాలు ఆదాయం తెచ్చిపెడుతున్నాయి. వ్యాపారానికి హిందీ కావాలి కానీ, నేర్చుకోవడానికి ఎందుకు ఇబ్బంది. హిందీ నేర్చుకోవడమంటే మన ఉనికిని కోల్పోవడం కాదు. ఇంకో భాషను అంగీకరించడమంటే ఓడిపోవడం కాదు.. కలిసి ప్రయాణించడం‘ అని పవన్ కల్యాణ్ అన్నారు. వేడుకల్లో భాగంగా దక్షిణ సంవాదం పేరిట నిర్వహించిన కార్యక్రమంలో రాజ్యసభ డిప్యూటీ- ఛైర్మన్ హరివంశ్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## మానవ వనరుల వినియోగంలో వైఫల్యం!

జనాభా పెరుగుదల అన్నది అభివృద్ధికి సూచిక కానేకాదు. జనాభా వల్ల వనరులు తగ్గుతాయి. ఆర్థిక భారం పడుతుంది. భారత్ లాంటి ప్రజాస్వామ్య దేశంలో జనాభా వల్ల ఖజానాపై అత్యధిక భారం పడుతుంది. ఎందుకంటే వీరందరికి పెన్షన్లు ఇవ్వాలి. కిలోరూపాయి బియ్యం పథకం అమలు చేయాలి. ఇంట్లో ఎందరు ఉంటే అంతమందికి బియ్యం ఇవ్వాలి. ఎందరుంటే అంతమందికి పెన్షన్లు ఇవ్వాలి. వీరుమాత్రం దర్జాగా ప్రభుత్వ పథకాలతో కాలక్షేపం చేస్తూ బలాదూర్‌గా తిరుగుతున్నారు. ఇప్పటికే ఏ రంగంలోనయినా కూలీల కొరత తీవ్రంగా ఉంది. జనాభా ఉన్నాకూలీలు దొరకని దేశం ఒక్క భారత్ మాత్రమే అయివుంటుంది. జనాభాను ఉపయోగించి వస్తూత్పత్తి చేసి, ఎగుమతులు చేయడం ద్వారా పటిష్ట ఆర్థిక విధానాలు అమలు చేసే ప్రణాళికలు భారత దేశంలోని ప్రభుత్వాల వద్ద లేవు. చైనాలాంటి దేశాలు అధిక జనాభాను కూడా ఆర్థిక ఉత్పత్తికి కేంద్రాలుగా ఉపయోగించుకుంటున్నాయి. ప్రజలందరికి పని కల్పించి, వారితో వస్తూత్పత్తిని ప్రోత్సహిస్తున్నారు. దాంతో విదేశాలకు ఎగుమతులు పెంచి ఆర్థికంగా బలపడుతున్నారు. కానీ భారత్‌లో అది సాధ్యం కావడం లేదు. ఇప్పటికే వ్యవసాయానికి కూలీలు దొరకడం లేదు. పనులు చేసేందుకు ఎవ్వరూ ముందుకురావడంలేదు. పనిచేయకున్నా పస్తులుండే పరిస్థితులు లేవు. ఎందుకంటే ప్రభుత్వం ఏదోరకంగా ఏదో ఒక పథకంతో ఆదుకుంటోంది. లేదా రాజకీయ పార్టీల జెండాలు మోస్తే వారే మందు, బిర్యానీలు సరఫరా చేస్తుంటారు. ఇలా మానవవనరులను వృథా చేసుకుంటున్న ఏకైక దేశం భారత్ మాత్రమేనని చెప్పడంలో వెనకాడాల్సిన పనిలేదు. దీనికంతటికీ ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలే కారణం. ఉచిత పథకాలతో ప్రజలను సోమరులుగా తయారు చేస్తున్నారు. అందువల్ల వారు పనిచయడానికి ఇష్టపడడం లేదు. ప్రభుత్వ పథకాలు ఏవేవి వస్తున్నాయో లెక్కలు కట్టి మరీ రాబట్టు కుంటున్నారు. దీంతో వారు కాయకష్టం చేయడానికి ఇష్టపడడం లేదు. భారతదేశంలో 140 కోట్ల జనాభా ఉన్నా ప్రతిరంగంలోనూ కార్మికుల కొరత ఉంది. అందరూ వైట్ కాలర్జాబ్‌లే చేయాలనుకుంటున్నారు. స్వయం ఉపాధి రంగాలపై శ్రద్ధ చూపడం లేదు. ఆయా రంగాలకు రుణాలు ఇచ్చి ప్రోత్సహించేలా ప్రభుత్వ విధానాలు ఉండడం లేదు. ఉదాహరణకు కోళ్ల పెంపకానికి డిమాండ్ ఉంది. అలాగే పాడిపరిశ్రమకునిత్యం డిమాండ్ ఉంది. గొర్రెలు, చేపల పెంపకానికి కూడా డిమాండం ఉంది. ఈ రంగాల్లో స్వయం సమృద్ధితో ఉపాధి పొందవచ్చు. కానీ యువత అందుకు సిద్దంగా లేదు. ఈ క్రమంలో జనాభా పెరగాలని రష్యా లాంటి దేశాలు ఆరాటపడు తున్నాయి. భారత్ లాంటి దేశాలు వద్దు బాబోయం అంటున్నాయి. కొన్ని దేశాలు ఇప్పటికే అధిక జనాభాతో సతమతమవుతూ..జనాభా నియంత్రణ చర్యలు పాటిస్తున్నాయి. మరికొన్ని దేశాలు జనాభా పెరుగుదలకు ప్రోత్సాహకాలు ఇస్తున్నాయి. గతంలో జనాభా నియంత్రణను కఠినంగా అమలు చేసిన దేశాలు కూడా ఇప్పుడు ఆ నిబంధనను సడలిస్తున్నాయి. భారతదేశంలోని కొన్ని రాష్ట్రాల పరిస్థితులు కూడా ఇలాగే ఉన్నాయి. జనాభా పెరగాలని ఎపి సిఎం చంద్రబాబు లాంటి వారు కోరుకుంటున్నారు. యూపీ, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ లాంటి రాష్ట్రాలు ఇప్పటికీ జనాభా నియంత్రణకు ప్రాధాన్యమిస్తుండగా, దక్షిణాదికి చెందిన ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ వంటి రాష్ట్రాలు జనాభా పెరుగుదలను ప్రోత్సహించే దిశలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో జనాభా అనేది ప్రధాన సమస్య కాదని, ప్రభుత్వాల వద్ద సరైన ప్రణాళికలు లేకపోవడమే అసలు కారణమని తెలుస్తున్నది. జనాభా పెరగాలంటున్న చంద్రబాబు లాంటి వారివద్ద సరైన ప్రణాళికలు లేవు. ఉన్న జనాభాను ఎలా వినియోగిం చుకోవాలో తెలియదు. ఇప్పటికే ఖజానా భారంగా మారినా ఊరూరా పెన్షన్ల పంపిణీని జాతరలా కొనసాగి స్తున్నారు. ఇదంతా కేవలం రాజకీయ ప్రయోజనాలు ఆశించి చేస్తున్నదే తప్ప మరోటి కాదు. సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకొని, సరైన ప్రణాళికలతో జనాభాను వినియోగించుకుంటే దేశంలో అద్భుత ఫలితాలు సాధించవచ్చు. వస్తూత్పత్తని పెంచవచ్చు. వ్యవసాయక దేశమైన భారత్‌లో తిండిగింజలను పండించవచ్చు. వనరులను ఉపయోగించుకుని వ్యవసాయంలో ఆర్థిక విప్లవం తీసుకుని రావచ్చు. కానీ ఇలా ఆలోచన చేసే నేతలు దేశంలో లేరు. 140 కోట్ల జనాభాతో ప్రపంచంలో భారతదేశం మొదటి స్థానంలో ఉండగా, చైనా రెండో స్థానంలో ఉన్నది. జనాభా పెరుగుదల సమస్యలు దేశాల ఆర్థిక, సామాజిక, పర్యావరణంపై ఆధారపడి ఉంటాయి. సరైన ప్రణాళిక లేనప్పుడు జనాభా పెరుగుదల ఒత్తిడిని సృష్టిస్తుంది. వనరులను దెబ్బతీస్తుంది. పర్యావరణ విధ్వంసానికి కారణం అవుతుంది. అయితే సమర్థవంత మైన విధానాలతో ఈ సవాళ్లను అధిగమించవచ్చు. జనాభాను ఉపయోగించుకోవడం అన్నది నేతల సమర్థతకు పరీక్ష లాంటిది. అధిక జనాభా ఉన్నా కొన్ని దేశాలు సరైన ప్రణాళికలతో అభివృద్ధిపథంలో దూసుకు పోతున్నాయి. అందుకు చైనా మన కళ్లముందు కనిపిస్తున్న ఉదాహరణ. అధిక జనసాంద్రత ఉన్నప్పటికీ సింగపూర్ సమర్థవంతమైన ప్రణాళిక ద్వారా ఆర్థిక, సామాజిక అభివృద్ధిని సాధించింది. ప్రపంచంలో జనసాంద్రత పరంగా సింగపూర్ మూడో స్థానంలో ఉంది. ఈ దేశ వైశాల్యం 719.9 చదరపు కిలోమీటర్లు కాగా, చదరపు కిలోమీటర్‌కు 8,595 మంది నివసిస్తున్నారు. అధిక ఆర్థిక వృద్ధి, అత్యుత్తమ గృహనిర్మాణం, ఆరోగ్య సేవలతో ప్రపంచంలోనే ఈ దేశం అగ్రగామిగా ఉంది. జనసాంద్రత పరంగా చైనా ప్రపంచవ్యాప్తంగా 83వ స్థానంలో ఉంది. 1980 నుంచి 2015 వరకు చైనా వన్ చైల్డ్ పాలసీని అమలు చేసి, దాదాపు 40 కోట్ల జనాభాను నియంత్రించింది. ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చిన ఆ దేశం జనాభా వనరులను సమర్థవంతం గా ఉపయోగించింది. ఫలితంగా చైనా రెండో అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదిగింది. ప్రపంచంలోని ఇతర దేశాలతో పోల్చుకుంటే భారతదేశంలో 35 ఏళ్లలోపు యువ జనాభా 65 శాతం ఉంది. ఈ జనాభాను పనివిధానంలోకి మారిస్తే అద్భుతాలు సాధించవచ్చు. ఇది సరైన ప్రణాళికతో ఆర్థిక వృద్ధికి దోహదపడు తుంది. ఎగుమతి ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా యువ జనాభాను ఉత్పాదక శక్తిగా మార్చవచ్చు. అయితే ఇప్పటి వరకు ఏ రాష్ట్రం లేదా కేంద్రం ఇలాంటి ఆలోచనలు చేయలేదు. ప్రజాస్వామ్యంలో ఓటు ప్రధానం కనుక అటువైపే ప్రణాళికలు ఉంటున్నాయి. ఈ దుస్థితి పోవాలంటే జనాభాను తగ్గించుకోక తప్పదు.

# ఇంధన సరఫరా స్విచ్‌లో ఆఫ్ అయ్యాయా



### ఎయిరిండియా ప్రమాదంపై వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం

వాషింగ్టన్,జూలై11 : ఎయిర్ ఇండియా విమానం ఏఐ-171 ప్రమాదంలో ఇంధన సరఫరా స్విచ్‌లను ఆఫ్ చేసినట్లు సందేహాలను వ్యక్తంచేస్తూ అమెరికా పత్రిక వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం పేర్కొంది. విమానం గాల్లోకి ఎగిరే సమయంలో స్విచ్‌లు సాధారణంగానే ఉన్నట్లు వాల్‌స్ట్రీట్ చెబుతోంది. అవి ఎలా ఆఫ్ అవుతాయనే విషయాన్ని నిపుణులు స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. వీటిని ఉద్దేశపూర్వకంగా ఆపారా..? తిరిగి ఆన్ చేయడానికి ప్రయత్నించారా అనే అంశాన్ని వారు స్పష్టంగా చెప్పలేకపోతున్నారని వెల్లడించింది. స్విచ్‌లు ఆఫ్ అయితే మాత్రం ర్యాట్ ఎందుకు యాక్టివేట్ అయిందో చెప్పే అవకాశం ఉంది. అమెరికా అధికారుల అంచనాలను ఉటంకిస్తూ ఈ విషయాన్ని వెల్లడించింది. విమానంలోని జీఈ సంస్థకు చెందిన రెండు జెట్ ఇంజిన్లు సక్రమంగానే పనిచేస్తున్నట్లు పేర్కొంది. ఇంధనం సరఫరా చేసే స్విచ్‌లు ఆఫ్ అయి ఉంటాయని అమెరికా నిపుణులు అభిప్రాయపడుతున్నట్లు- పేర్కొంది. దీంతో టేకాఫ్ అయిన వెంటనే హఠాత్తుగా విమానం థ్రస్ట్‌ను కోల్పోయి ఉండొచ్చని పేర్కొంది. సాధారణంగా విమానం ఇంజిన్లను స్టార్ట్ చేయడం లేదా షట్‌డౌన్ చేయడానికి, కొన్ని అత్యవసర సందర్భాల్లో రీసెట్ కోసం వాడుతుంటారు. మరోవైపు భారత్‌కు చెందిన ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ప్రస్తుతం దీనిపై దర్యాప్తు చేస్తోంది. ప్రాథమిక నివేదిక అతిత్వరలో విడుదల కావచ్చన్న అంచనాలు ఉన్నాయి. అమెరికా నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్ ప్రస్తుతం భారత దర్యాప్తునకు సహకారం అందిస్తోంది. అయితే, భారత ప్రభుత్వం ఇతర దేశాలకు డేటాను షేర్ చేయడంలో అభిప్రాయబేధాలున్నట్లు- వాల్‌స్ట్రీట్ చెబుతోంది. ఈ ప్రమాదంపై అమెరికా అధికారులు ఆ పత్రికతో మాట్లాడుతూ విమానం మోడల్, లేదా జీఈ ఇంజిన్లతో దుర్ఘటనకు సంబంధం లేదని దర్యాప్తు సూచిస్తున్నట్లు వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు ఎఫ్‌ఏఏ లేదా బోయింగ్, జీఈలు ఎటువంటి సర్వీస్ బులెటిన్‌ను విడుదల చేయలేదన్నారు. మరోవైపు వైమానిక రంగానికి చెందిన పత్రిక 'ది ఎయిర్ కరెంట్' కూడా ఈ ప్రమాద దర్యాప్తు మొత్తం ఇంధన కంట్రోల్ స్విచ్‌ల చుట్టూనే తిరిగినట్లు పేర్కొంది. దర్యాప్తు ముందుకుసాగే కొద్దీ చేరే కొత్త సమాచారంతో ఈ అంచనాలు, అభిప్రాయాలు మారుతుంటాయని వెల్లడించింది. ఈ ప్రమాదంపై ఇప్పటివరకు జరిపిన విశ్లేషణ, దర్యాప్తు ఆధారంగా ఏఏఐబీ ప్రాథమిక నివేదిక రూపొందించింది. దాన్ని కేంద్ర పౌరవిమాన మంత్రిత్వశాఖతో పాటు సంబంధిత ఇతర అధికారులకు సమర్పించినట్లు ప్రభుత్వ ఉన్నతస్థాయి వర్గాలు వెల్లడించాయి. జూన్ 12న ఈ దుర్ఘటన చోటుచేసుకోగా.. ఆ మరుసటిరోజే ప్రమాదంపై దర్యాప్తునకు ఏఏఐబీ ప్రత్యేక కమిటీని ఏర్పాటు-చేసింది. దీనికి ఏఏఐబీ డైరెక్టర్ జనరల్ జీవీజీ యుగంధర్ నేతృత్వం వహిస్తుండగా.. ఏవియేషన్ మెడిసిన్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ నిపుణులు, అమెరికాకు చెందిన నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డు నిపుణులు సభ్యులుగా ఉన్నారు. ప్రమాదానికి గురైన విమానం నుంచి సేకరించిన బ్లాక్‌బాక్స్‌లను ఏఏఐబీ ల్యాబ్‌కు తరలించారు. అందులోని డేటాను విజయవంతంగా డౌన్‌లోడ్ చేసి ప్రమాదానికి గల కారణాలను విశ్లేషిస్తున్నారు.

## శ్రీశైలం జలాశయానికి కొనసాగుతున్న వరద ఉధృతి



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ జిల్లాలోని శ్రీశైలం జలాశయానికి వరద ఉధృతి కొనసాగుతుంది. ఎగువన కురుస్తున్న వర్షాలతో జలాయశయంలోకి భారీగా వరద నీటి ప్రవాహం వస్తోంది. దీంతో ప్రాజెక్టు మూడు గేట్లను తెరచి.. నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రాజెక్టులోకి ఇన్ ఫ్లో 1,48,696 క్యూసెక్కులుగా ఉండగా.. ఔట్ ఫ్లో 1,48, 734 క్యూసెక్కులుగా ఉంది. ఇక, జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు ఉండగా.. ప్రస్తుత నీటిమట్టం 882.80 అడుగులకు చేరుకుంది. ప్రాజెక్టు కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతుంది. అలాగే, తుంగభద్ర డ్యామ్ కు కూడా వరద ప్రవాహం కొనసాగుతుంది. దీంతో అధికారులు డ్యామ్ 12 గేట్ల ద్వారా నీటి విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం డ్యామ్ లోకి ఇన్ ఫ్లో 40,082 క్యూసెక్కులుగా.. అవుట్ ఫ్లో 40,657 క్యూ సెక్కులుగా ఉంది.

## తహశీల్దార్ కార్యాలయం ముందు ఒంటిపై పెట్రోల్ పోసుకొని రైతు ఆత్మహత్యాయత్నం

మోత్కూర్: యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ తహశీల్దార్ కార్యాలయం ముందు ఓ రైతు ఒంటిపై పెట్రోల్ పోసుకొని, పురుగుల మందు డబ్బాతో ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని అనాజిపురం గ్రామానికి చెందిన రైతు కుమ్మరికుంట్ల శేఖర్‌రెడ్డి 30 ఏళ్ల క్రితం తన బావి దగ్గర బోరు వేసుకున్నాడని, ఆ నీటితోనే తన పొలాన్ని సాగుచేసుకుంటున్నాని తెలిపాడు. కాగా అతని పక్కనే ఉన్న రైతు బండ మల్లయ్య ఏప్రిల్ 21న బోరు వేశాడని, దీంతో ఒక్కసారిగా తన బోరు నీరు పోయడం ఆగిపోయిందని విలపించాడు. మల్లయ్య వాల్టా చట్టానికి విరుద్ధంగా తన బోరు సమీపంలోనే బోరు వేయడంతో తన బోరు ఎండిపోయిందని, ఆ బోరును వెంటనే సీజ్ చేసి తనకు న్యాయం చేయాలని కోరాడు. శేఖర్‌రెడ్డి ఏప్రిల్ 22న తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశాడని, మే 22న మల్లయ్యకు నోటీసులు ఇచ్చినా నేటికీ చర్యలు తీసుకోలేదని, దీంతో భూమి సాగు చేసుకోలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు చావే శరణ్యమని, అధికారులు మామూళ్లు తీసుకొని చర్యలు తీసుకోకుండా తనను ఇబ్బంది పెడుతున్నారని అన్నాడు.

# కొత్త పుంతలు తొక్కుతున్న ఆవిష్కరణలు

### జపాన్‌లో అద్భుత ఇంటర్నెట్ ఆవిష్కరణ

టోక్యో,జూలై11 : ఆవిష్కరణలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఎప్పుడు ఎలాంటి ఆవిష్కరణలు వస్తాయో చెప్పలేని పరిస్థితి. ఏఐతో ప్రపంచం అంతా మారిందనుకుంటున్న వేళ అన్నింటా అద్భుతాలు ఆవిష్కృతం అవుతున్నాయి. బుల్లెట్ రైళ్లు, అత్యుత్తమ ఎయిర్‌పోర్టులు చూస్తున్నాం. రోబోలతో మొత్తం ప్రపంచ గతి మారుతోంది. వైద్యరంగంలోనూ ఆవిష్కరణలుకొత్త పుంతలు తొక్కిస్తున్నాయి. ఈ క్రమంలో అధునాతన సదుపాయాల్లో ముందుండే జపాన్ ఇప్పుడు మరో అద్భుతాన్ని ఆవిష్కరించింది. ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన ఇంటర్నెట్‌ను ఆ దేశ పరిశోధకులు అభివృద్ధి చేశారు. సెకనకు 1.02 పెటాబిట్స్ స్పీడ్‌తో పనిచేసే ఈ ఇంటర్నెట్‌తో.. కేవలం రెప్పపాటులో నెట్‌ఫ్లిక్స్ లైబ్రరీలో ఉన్న డేటా మొత్తాన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చని నిరూపించారు. అమెరికాలో ఉన్న సగటు ఇంటర్నెట్ కనెక్షన్ల కంటే ఇది 3.5 మిలియన్ రెట్ల వేగవంతమైనదని అంటున్నారు. ప్రత్యేక ఫైబర్ ఆప్టిక్ కేబుల్ సాయంతో జపాన్ ఈ వేగవంతమైన నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసింది. ఇందుకోసం పరిశోధకులు ట్రాన్స్‌మిటర్లు, రిసీవర్లు, 19 లూపింగ్ సర్క్యూట్లను వినియోగించారు. ఈ లూపింగ్ సర్క్యూట్ ఒక్కోటి 86.1 కిలోమీటర్ల పొడవు ఉంది. ఈ లూప్స్ నుంచి సిగ్నల్లు వెళ్లి డేటాను అందిస్తాయి. దీని సాయంతోనే సెకనుకు 1808 కిలోమీటర్ల దూరం వరకు డేటాను పంపించేందుకు వీలు లభిస్తుందని తెలిపింది. ప్రస్తుతానికి ఈ ఇంటర్నెట్ గృహ వినియోగదారులకు అందుబాటులోకి వచ్చే అవకాశాలు కన్పించట్లేదు. ప్రభుత్వాలు, డేటా సెంటర్ ఆపరేటర్లు, టెలికాం సంస్థలు దీన్ని వినియోగించు కునేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 6జీ నెట్‌వర్క్, తర్వాతితరం సముద్రగర్భ కేబుళ్లకు ఈ జపాన్ ఇంటర్నెట్ ఓ మోడల్‌గా నిలవనుంది. జపాన్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ తమ వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఇక భారత్‌లోని సగటు ఇంటర్నెట్ స్పీడ్‌తో పోలిస్తే దీని బ్రౌజింగ్, డౌన్‌లోడింగ్ వేగం 16 మిలియన్ రెట్లు ఎక్కువని తెలిపింది. ఎన్‌ఐసీటీలోని ఫొటోనిక్ నెట్‌వర్క్ లాబోరేటరీ టీమ్, సుమితోమో ఎలక్ట్రిక్ అండ్ యూరోపియన్ పార్ట్‌నర్స్‌తో కలిసి జపాన్ ఈ ఇంటర్నెట్‌ను అభివృద్ధి చేసింది. ఈ ఇంటర్నెట్‌తో కేవలం ఒక్క సెకనులోనే ఇంగ్లీష్ వికీపిడియా మొత్తాన్ని 10వేల సార్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆ వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. సాధారణంగా ఈ వికీపిడియా స్టోరేజీ 100 జీబీ వరకు ఉంటు-oది. ఇక, కొత్త ఇంటర్నెట్‌తో ఒక్క సెకనులోనే 8కే రిజల్యూషన్‌తో ఉన్న వీడియోలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని జపాన్ పరిశోధకులు చెబుతున్నారు.

## కాకినాడ రంగరాయ కాలేజీలో దారుణం


### విద్యార్థినులకు ల్యాబ్ ఉద్యోగుల లైంగిక వేధింపులు

### ఫిర్యాదులపై కఠిన చర్యలకు చంద్రబాబు ఆదేశం

అమరావతి,జూలై11 : కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలో విద్యార్థినులపై లైంగిక వేధింపుల ఘటన కలకలం రేపింది.. బయో కెమిస్ట్రీ ల్యాబ్ అటెండెంట్ కళ్యాణ్ చక్రవర్తి, మైక్రో బయాలజీ టెక్నీషియన్ జిమ్మీ రాజు, బయో కెమిస్ట్రీ ఎల్ టీ గోపాలకృష్ణ, పాథాలజీ ఎల్‌టీ ప్రసాద్ తమ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారని విద్యార్థినులు ఫిర్యాదు చేశారు.. మెయిల్ ద్వారా ఒకేసారి 50 మంది విద్యార్థినులు ఫిర్యాదు చేశారు.. అయితే, ఈ ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సీరియస్ అయ్యారు.. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాకినాడ జీజీహెచ్‌లో వైద్య విద్యార్థినులపై లైంగిక వేధింపుల ఘటనపై సీఎం చంద్రబాబు నాయుడు అధికారులను నివేదిక కోరారు.. దీంతో, సీఎంకు నివేదిక అందించారు వైద్యఆరోగ్య శాఖ అధికారులు. దీనిపై స్పందించిన సీఎం.. నిందితులపై కఠిన చర్యలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.. మెడికల్ కాలేజ్ ఆసుపత్రిలో ల్యాబ్ అటెండెంట్‌గా పనిచేస్తున్న కళ్యాణ్ చక్రవర్తి అనే ఉద్యోగిపై ఈనెల 9వ తేదీన విద్యార్థినిలు ఫిర్యాదు చేశారు.. ఘటనను సీరియస్ గా తీసుకుని.. దీనిపై అదే రోజు కమిటీ- నియమించి విచారణ చేపట్టారు అధికారులు.. నిన్న రాత్రి వరకు విద్యార్థినులతో మాట్లాడి నివేదిక సిద్ధం చేసింది విచారణ కమిటీ-.. చక్రవర్తితో పాటు- మరో ముగ్గురు కూడా వైద్య విద్యార్థినులను వేధించినట్లు- విచారణలో వెల్లడైంది.. నివేదిక ఆధారంగా లైంగిక వేధింపులకు పాల్పడిన సిబ్బందిపై చర్యలకు సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు.. నిందితులపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేయనున్నారు అధికారులు..

## అహంకారమే పతన హేతువు !

తిరుమల,జూలై11 : ప్రతి వ్యక్తీ గొప్పవాడు కావాలని కలలు కంటుంటాడు. కొందరు విశేషంగా ధనం సంపాదించి, తాము గొప్పవారమనే భ్రమతో గర్విస్తారు. మరికొందరు హోదా లభించగానే అధికార దర్పం, అహంకారం ప్రదర్శిస్తారు. ఇది సహజం. కానీ, అందరికన్నా గొప్పవాడు కావాలని కొందరు ఆరాటపడతారు. అలా కావటానికి చేతనైన అన్ని రకాల విధానాలూ అనుసరిస్తారు. అడ్డదారులు తొక్కుతారు. అవినీతికి సిద్ధపడతారు. అనాయాసంగా, నిస్సంకో చంగా అబద్ధాలు ఆడతారు. ఇది కూడా ఆధిక్యతాభావం వల్లనే! కొందరు తమకంటే అందరూ తక్కువ స్థాయిలోనే ఉండాలని కోరుకుంటారు. తమకన్నా ఎవరు మించిపోతున్నా భరించలేరు. అసూయతో కుమిలిపోతారు. వారిమీద కక్షగా ఉంటారు. అవకాశం లభిస్తే, ఏదో విధంగా, తమకన్నా అధికులకు అపకారం చేస్తారు. వారికి కష్టనష్టాలు కలిగినప్పుడు, లోలోపల సంతోషపడుతూ, పైకి కపట సానుభూతి ప్రకటిస్తారు. దుర్యోధనుడికి సుయోధనుడు అనే మరొక పేరు ఉంది. నిజానికి అతడు అసూయాధనుడు. పాండవుల ఔన్నత్యాన్ని, ఆధిక్యతను సహించలేక పోతుండేవాడు. బాల్యం నుంచే పాండవుల పట్ల అసూయ, ద్వేషం కలిగి ఉండేవాడు. అసూయ అగ్ని వంటిది. ద్వేషమూ అంతే. ఏ కర్ర నిప్పు ఆ కర్రనే కాల్చినట్టు, ఎవరు అసూయాపరులో, వారినే అసూయాద్వేషాలు దహిస్తాయి. ఇది నిత్య సత్యం.



ఆధ్యాత్మికం

# పోలీస్‌స్టేషన్‌లకు కాంగ్రెస్ ఆఫీస్ బోర్డు పెట్టేలా చేసుకోవద్దు

- పోలీసులను వాడుకోవడం మంథని ఎమ్మెల్యేకు అలవాటే
- ప్రేమ వ్యవహారంలో పూదరిని అరెస్టు చేయడం అప్రజాస్వామికం
- న్యాయబద్ధంగా లేవని కోర్టు తిరస్కరించినా మార్పు వస్తలేదు
- సమాజాన్ని మోసం చేసిన మంథని ఎమ్మెల్యేపై కేసు పెట్టండి
- పోలీస్‌స్టేషన్‌లకు కాంగ్రెస్ ఆఫీస్ బోర్డు పెట్టేలా చేసుకోవద్దు
- ఊకదంపుడు కేసులు...బెదిరింపులకు భయపడేది లేదు
- పోలీసులపై మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఫైర్








**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి జూలై 11 ( హైదరాబాద్ న్యూస్ ):** పోలీసులకు ఖాకీ యూనిఫాం ఇచ్చింది దుద్దిళ్ల కుటుంబం కాదనే విషయాన్ని నియోజక వర్గంలోని పోలీసులు గ్రహించాలని, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందించిన భారత రాజ్యాంగం ప్రకారమే ఉద్యోగాలు వచ్చాయని గుర్తించాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. రామగిరి మండలానికి చెందిన మాజీ మార్కెట్ కమిటి చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పూదరి సత్యనారాయణగౌడ్‌ను గురువారం రాత్రి అరెస్ట్ చేసి శుక్రవారం మంథని కోర్టులో హాజరుపర్చారు. కోర్టు నుంచి బెయిల్‌పై బయటకు వచ్చిన పూదరితో కలిసి ఆయన మాట్లాడుతూ మంథని నియోజకవర్గంలో బీసీ నినాదం ఎత్తుకున్న తమపై అణిచివేయాలనే ఆలోచనతో మంథని ఎమ్మెల్యే చాలా తెలివిగా ఇక్కడ బీసీ, ఎస్సీ అధికారులను పెట్టించి తమపై అక్రమ కేసులు బనాయించాలని చూస్తున్నారని అన్నారు. కులాల మధ్య చిచ్చుపెట్టి మంట కాగుతున్నారని, పోలీసులను వాడుకోవడం మంథని ఎమ్మెల్యే అలవాటేనని ఆయన విమర్శించారు. ఇప్పటికే ఇక్కడి పరిస్థితులపై పోలీసులకు వివరించడం జరిగిందని, పరిస్థితులను అర్థం చేసుకోవాలని చెప్పినా పోలీసుల్లో మార్పు రావడం లేదన్నారు. మంథని సీఐ, రామగిరి ఎస్ఐతో పాటు పెద్దపల్లి ఎస్ఐ అత్యుత్సాహం ప్రదర్శించారని ఆయన మండిపడ్డారు. ఓ ప్రేమ వ్యవహారంలో పూదరి సత్యనారాయణను అరెస్ట్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రేమించి పెళ్లి చేసుకున్న అమ్మాయిని పెద్దపల్లిలో తల్లిదండ్రులకు అప్పగించారని, అయితే తాలిబోట్టు తీసేసి ఇబ్బందిపెడితే మళ్లీ రామగిరికి వచ్చిందన్నారు. ఈ క్రమంలో గ్రామ పెద్దలుగా అక్కడకు వెళ్లిన పూదరిపై కేసు నమోదు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఓ వైపు ప్రభుత్వాలు కులాంతర వివాహాలను ప్రోత్సహించాలని పదేపదే చెప్తుంటే ఇక్కడ మాత్రం పోలీసులు కులాంతర వివాహాలను అడ్డుకుని కులాలను మాత్రమే ప్రోత్సహిస్తున్నారని, అలాంటి పెద్దపల్లి, రామగిరి ఎస్ఐలపై చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంలో పెద్దపల్లి ఎస్ఐని మఫ్టిలో రామగిరికి ఎలా పంపించారో ఏసీపీ సమాధానం చెప్పాలన్నారు. ఒక్క రామగుండం కమీషనర్ తప్ప మిగతా పోలీసులంతా మెజిస్ట్రేట్‌ను ఒప్పించే ప్రయత్నాలు చేశారని, కానీ పూదరిపై కేసు న్యాయబద్ధంగా లేదంటూ తిరస్కరించారని అన్నారు. నియోజకవర్గంలో అక్రమ కేసులు పెట్టిన జక్కు శ్రావన్, జువ్వాజి తిరుపతి, నేడు పూదరి సత్యనారాయగౌడ్‌ల విషయంలో కోర్టు తీర్పును చూసి పోలీసులు అవమానపడాలన్నారు. సమాజంలో న్యాయ వ్యవస్థల ద్వారా ప్రజాస్వామ్యం వర్థిల్లుతుంది కనుకనే ఈ కేసులను తిరస్కరించారని ఆయన అన్నారు. నియోజకవర్గంలో అనాదిగా మంథని ఎమ్మెల్యే కుటుంబం పోలీసులను వాడుకోవడం, పోలీసులపై తాము కొట్లాడటం ఇదేమి కొత్తది కాదని, ఇది అలవాటుగానే మారిందన్నారు. తాను ఒంటిరిగా ముందడుగు వేసినా ఈనాడు నియోజకవర్గంలో 72వేల మంది తనవెంట ఉన్నారనే విషయాన్ని పోలీసులు గమనించాలని, 35ఏండ్ల రాజకీయ జీవితంలో తాను మంథని ఎమ్మెల్యేకు ఓనమాలు నేర్పించిన విషయాన్ని గుర్తించాలన్నారు. ఇప్పటికే పూదరిపై 15కేసులు పెట్టారని, ఇంకా 50కేసులు పెట్టినా భయపడేది లేదని, ఊకదంపుడు కేసులకు వెనుకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. ఇప్పటికే పోలీస్‌స్టేషన్‌లకు కాంగ్రెస్ కార్యాలయ బోర్డులు పెడుతామని హెచ్చరించామని, డిసెంబర్‌లోగా మార్పు రాకపోతే బోర్డులు పెట్టక తప్పదన్నారు. కేవలం తమ సామాజిక వర్గాలకు చెందిన వాళ్లు ఉన్నారనే ఆలోచనతోనే ఆలస్యం చేస్తున్నామని, తమ సామాజిక వర్గంలో ఉద్యోగం రావాలంటే ఎన్నో కష్టాలు పడాల్సి వస్తుందనే ఆలోచన చేస్తున్నామని, తమ వర్గాలకు రాజకీయ, ఆర్థిక సామాజిక చైతన్యం వచ్చే వరకు పోరాటం చేస్తామన్నారు. మంథని పోలీసులకు చిత్తశుద్ధి ఉంటే ఆరు గ్యారెంటీలు, 420హమీలు ఇచ్చి ఒక్కటి అమలు చేయకుండా ఈ సమాజాన్ని మోసం చేసిన మానీఫెస్టో కమిటి చైర్మన్ మంథని ఎమ్మెల్యేను అరెస్ట్ చేయాలని అన్నారు. అంతేకాకుండా రామగిరి మండలంలో గంజాయికి అలవాటు పడి బాల్యం చెడిపోతుందని, మంథని ఎమ్మెల్యే తీసుకువచ్చిన జేఎన్‌టీయూ వల్ల యువత డ్రగ్స్‌కు అలవాటుపడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని, అనేక వీడియోలు వైరల్ అవుతున్నాయని అన్నారు. అలాంటి వాటిని కట్టడి చేసేందుకు చర్యలు తీసుకోవాలనే కానీ ఊకదంపుడు కేసులు పెడుతూ భయాందోళనలకు గురి చేస్తామంటే సహించేదిలేదని ఆయన స్పష్టం చేశారు. చట్టం పోలీసులకు ఉద్యోగాలు ఇచ్చింది తమను కంట్రోల్ చేసి అక్రమ కేసులు పెట్టడానికి కాదనే విషయాన్ని ఈ ప్రాంత పోలీసులు గమనించాలని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.

# విద్యార్థులకు చదువుతో పాటు నాణ్యమైన భోజనం అందించాలి

- వంట గది, డైనింగ్ హాల్ పరిశుభ్రంగా ఉంచాలని హెచ్చరిక,
- పాఠశాలలో పరిశుభ్రత కరువైందని గుర్తించి కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం
- తాను. మళ్ళీ తనిఖీకి వస్తానని మార్పు రాకుంటే చర్యలు తీసుకుంటాం.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి జూలై 11 ( హైదరాబాద్ న్యూస్ ):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం, దామెరకుంట లోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, గంగారం మోడల్ పాఠశాలలను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకస్మిక తనిఖీ చేశారు. దామెరకుంట గ్రామంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల తనిఖీ సందర్భంగా పాఠశాలలో పరిశుభ్రత కరువైందని గుర్తించి కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. డైనింగ్ హాల్ పరిశీలించి వంట కోసం తతెచ్చిన కూరగాయలు పరిశుభ్రంగా లేకపోవడం, వంటగదిలో ఈగలు ఉండడం, వంటగది పరిసరాలు ఆపరిశుభ్రంగా ఉండటంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం దృష్టిలో పెట్టుకొని, ఆహార తయారీ ప్రదేశాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యానికి హాని కలగకూడదని, పాఠశాలలో పరిశుభ్రత, పారిశుద్య ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. తాను. మళ్ళీ తనిఖీకి వస్తానని మార్పు రాకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిశుభ్రత పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వంట గది, డైనింగ్ హాల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాని హెచ్చరించారు. వానాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యార్థుల ఆరోగ్య సంరక్షణ చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు అనారోగ్య బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, వైద్య పరీక్షలు నిర్వహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని తెలిపారు. అనంతరం పాఠశాలలోని తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్ , స్టోర్ రూమ్, డార్మెటరీలను పరిశీలించి విద్యార్థులకు కావలసిన మౌలిక సదుపాయాలపై నివేదిక ఇవ్వాలని స్పష్టం చేశారు. పాఠశాలకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. కొన్ని చోట్ల భవనం పెచ్చులు ఊడుతున్నాయని విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఉండడంతో తరగతి గదులు సరిపోవడం లేదని ఉపాధ్యాయులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు రాగా పాఠశాల వెనకాల నిరుపయోగంగా ఉన్న జూనియర్ కళాశాల భవనాన్నీ పరిశీలించి మరమ్మతులు చేసి అందుబాటులోకి తేవాలని టి.ఎస్ ఈడబ్ల్యూఐడిసి ఈ.ఈ కి తక్షణమే ఫోన్ చేసి ఆదేశించారు. అనంతరం గంగారంలోని తెలంగాణ మాడల్ పాఠశాలను సందర్శించి పాఠశాలలో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. పాఠశాల వెనుకాల గల హాస్టల్ భవనాన్ని పరిశీలించి త్వరిత గతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాల భవనం ముందు కొంత మేర మిగిలిన సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని, పాఠశాల విద్యార్థుల కోసం వంట గది నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని ప్రధానోపాధ్యాయులు కోరగా నిధులు మంజూరు చేస్తామని హాస్టల్ భవనం లో గీజర్లతో పాటు కావలసిన మౌలిక వసతుల కల్పనకు నివేదికలు అందించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో బాబు తదితరులు పాల్గొన్నారు,





## కాటారంలో బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో కేంద్ర హెూంశాఖ మంత్రి బండి సంజయ్ జన్మదిన వేడుకలు.





**కాటారం, జూలై 11( హైదరాబాద్ న్యూస్ ):** కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రిబండి సంజయ్ కుమార్ జన్మదినం పురస్కరించుకొని కాటారం బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా సంబరాలు నిర్వహించారు ఈ సందర్భంగా బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు బొమ్మన భాస్కర్ రెడ్డి సీనియర్ నాయకులు దుర్గం తిరుపతి మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ ఏబీవీపీ సంస్థలలో కింది స్థాయి నుంచి పనిచేసుకుంటూ వచ్చి 3సార్లు కార్పొరేటర్ గా గెలిచి కరీంనగర్ ఎంపిగా గెలిచి అనతి కాలంలోనే బీజేపీ రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించి తన నాయకత్వపటిమ తో బీజేపీని అధికారం సాధించే దిశగా తీసుకెళ్లిన నాయకుడు సంజయ్ అన్న అని అన్నారు.రెండవసారి ఎంపిగా కరీంనగర్ చరిత్రలోనే అత్యధిక మెజారిటీతో గెలిచి కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రిగా బాధ్యత నిర్వహిస్తున్న బండి సంజయ్ అన్న నేటి బీజేపీ కార్యకర్తలకు మార్గదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు బొమ్మన భాస్కర్ రెడ్డి సీనియర్ నాయకులు దుర్గం తిరుపతి గంట అంకయ్య జిల్లాల శ్రీశైలం బొంతల రవి ఇంజపురి సదానందం గాలి సారయ్య గోగు రాజేష్ తదితరులు పాల్గొన్నారు,

## కాటారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్





**కాటారం, జూలై 11( హైదరాబాద్ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా కార్యాలయంలోని ఫైళ్ళను పరిశీలించారు. కాటారం మండలంలో జరుగుతున్న చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు భూ సేకరణ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. భూ భారతి లో వచ్చిన దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకుని ఎంత మందికి నోటీసులు జారీ చేశారని ప్రశ్నించారు. మొత్తం మండలంలో 5,610 భూభారతి దరఖాస్తులు వచ్చాయని అందులో 412 మంది దరఖాస్తు దారులకు నోటీసులు జారీ చేసినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపగా, భూ భారతిలో వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఆగస్ట్ 15 వ తేదీ వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు డిటి రామ్మోహన్, ఆర్.ఐ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## కోటగుళ్లలో ఈసీఐఎల్ ఆఫీసర్ టెక్నికల్ శాలిని ప్రత్యేక పూజలు





**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి జూలై 11 ( హైదరాబాద్ న్యూస్ ):** కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళ లో శుక్రవారం ఎలక్ట్రానిక్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఈసీఐఎల్ హైదరాబాద్ ఆఫీసర్ టెక్నికల్ శాలిని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు వినయ్ ఆమెను సాదరంగా ఆహ్వానించి గణపతి, నందీశ్వరుడు, గణపేశ్వరునికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలను అందజేశారు.

# ఎగురుడు, దనుకుడు, అమ్మాయిలపై తప్ప

# పేదలపై ఆలోచనే చేయలే

### ◆ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

**తిమ్మాపూర్, జూలై 11:** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నల్లగొండలో 12మందికి ఇండ్ల స్థలాలు మంజూరు కాగా శుక్రవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ భూమి పూజ చేశారు. అనతంరం ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బండారి రమేశ్ గౌడ్ మాట్లాడుతూ.....గత పదేళ్ళలో ఇండ్లులేక అవస్థలు పడ్డ నిజమైన పేదప్రజలను గుర్తించి కాంగ్రెస్ ప్రభుత్వం 175కోట్లతో ఇందిరమ్మ ఇళ్లు కేటాయించిందని, పేదల పట్ల ప్రత్యేక చొరవ తీసుకుంటున్న ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు తీసుకెళ్తే తప్పకుండా పరిష్కారిస్తారని ధీమా వ్యక్తంచేశారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి మాట్లాడుతూ..... గత బిఆర్ఎస్ ప్రభుత్వం దళితులకు కేటాయించిన భూముల్లో స్మశాన వాటికలు, హరిత హారం, క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేస్తే కాంగ్రెస్ ఆ భూములను పేదలకు పంచుతుండగా, ఎగురుడు, దునుకుడు, అమ్మాయిలపై తప్ప నిరుపేదలపై ఆలోచన చేయని మాజీ ఎమ్మెల్యే గత పదేళ్లలో పథకాల పేరుతో డబ్బులు తిన్న ఆలోచనతో సిగ్గులేకుండా ప్రభుత్వ పథకాలకు అడ్డుపడుతూ ప్రభుత్వంపై, తనపై విమర్శలు చేస్తున్నాడన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషితో కడుపేదలకు ఇండ్లు మంజూరు చేశామని లబ్ధిదారులు త్వరగా ఇళ్ళ నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని కోరారు. నల్లగొండలో 12మందికి ఇండ్ల స్థలాలు కేటాయించామని దీనికి సహాకరించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపుతూ రానివాళ్ళకు ప్రభుత్వం స్థలాలను వెతికి మరీ కేటాయిస్తుందని నిర్మాణం పూర్తయిన ఇళ్ళకు పట్టాలను కూడా ఇస్తామని ధీమా వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతుందని పదేళ్ళలో ఊసే లేని రేషన్ కార్డులను కాంగ్రెస్ అందరికి మంజూరు చేసిందని కాబట్టి ప్రజలు సమస్యలను తనకు గాని కాంగ్రెస్ నాయకులకు గానీ తెలిపాలని వైద్యపరంగా ఇబ్బందులు పడుతున్న వారికి 10లక్షల వరకు ఎల్ఓసీ ఇప్పిస్తానని పేద ప్రజలను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ తప్పకుండా అమలు చేసి తీరుతుందని దీనికి కృతజ్ఞతగా కాంగ్రెస్ పార్టీని దీవించి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి ప్రజలను కోరారు. కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో విజయకుమార్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బండారి రమేశ్ గౌడ్, మాజీ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, నాయకులు ఎస్ ఎల్ గౌడ్, చింతల లక్ష్మారెడ్డి, రెడ్డిగాని రాజు, శ్రీగిరి రంగారావు, కుంట రాజేందర్ రెడ్డి,





మామిడి అనిల్ కుమార్, మార్క నర్సయ్య, రొడ్డ సాగర్, మొండయ్య, లింగారావు, మల్యాల సంపత్, బి.సంపత్, బుదారపు శ్రీనివాస్, కొత్త తిరుపతిరెడ్డి, ఎస్.కొండల్ రావు, గొట్టిముక్కుల సంపత్ రెడ్డి, ముప్పిడి సంపత్ రెడ్డి, రాములు యాదవ్, ఎల్క రాజు, గుంటి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# హిందు ముస్లింలు వేర్వేరనే భావన ఉండొద్దు...

◆ మక్కాను మరిపించేలా మజీద్‌ను పునరుద్దరించిండు ◆ పండుగలను కలిసి జరుపుకునే సంస్కృతి మనదే

◆ జాఫర్ అంటేనే స్పెషలైజేషన్‌కు నిదర్శనం ◆ మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్







**రామగిరి, , జూలై 11:-** హిందువులు వేరు ముస్లింలు వేరు అనే భావన ఎవరిలో ఉండొద్దని, అలాంటి భావనను రూపుమాపాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. రామగిరి మండలం సెంటనరీ కాలనీలో ఎమ్.టీ.ఎన్ బ్రిక్స్ అధినేత ఎండీ జాఫర్ ఆధ్వర్యంలో పునరుద్దరించిన జామా మజీద్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రార్థనా మందిరాలు అంటేనే మనశాంతి లభిస్తుందనే భావం ఉంటుందన్నారు. హిందువులు ముస్లింలు క్రైస్తవులు దేవుడి అనుగ్రహంతో మనశాంతి లభిస్తుందని వెళ్తుంటారని, అలాంటి ప్రార్థనా మందిరాల్లో చిన్ని చిన్న వసతుల్లేక దేవుడిని తలచుకునే వెళ్లిపోతుంటారని అన్నారు. కానీ ఇక్కడ మాత్రం బీఆర్ఎస్ నాయకులు జాఫర్ జామా మజీద్‌ను సొంత ఖర్చులతో పునరుద్దరించి దేవుడు స్పష్టంగా అనుగ్రహించే వాతావరణం కల్పించారని కొనియాడారు. ముఖ్యంగా ఇక్కడి వాతావరణం మక్కాను తలపించే విధంగా ఉందని ఆయన అభినందించారు. జాఫర్ అంటేనే స్పెషలైజేషన్‌కు నిదర్శనంగా నిలుస్తాడని ఆయన అన్నారు. ఆనాడు తెలంగాణ ఉద్యమ సమయంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గంగా జమున తహజీబ్ తరహాలో అన్ని మతాలు కలిసి ఉండాలని పిలుపునిచ్చారని, పదేండ్ల పాలనలో అన్ని పండుగలను కలిసి జరుపుకున్నామని, ఇలాంటి సంస్కృతి కేవలం తెలంగాణలో మాత్రమే ఉందన్నారు. ఈ మట్టిలో పుట్టిన ప్రతి ఒక్కరు సంతోషంగా ఉండాలన్నదే తన ఆకాంక్ష అని, కులాలకు మతాలకు అతీతంగా పెరిగిన తానకు అందరూ సమానమేనని ఆయన తెలిపారు. అందరి ఆశీస్సులతో ఈ స్థాయిలో ఉంటూ తనవంతు సాయం, సేవలు అందిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్.టీ.ఎన్ బ్రిక్స్ అధినేత ఎండీ జాఫర్, రామగిరి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శెంకేసి రవీందర్, రామగిరి మండల రైతు సమన్వయ కమిటీ అధ్యక్షులు మాదరవైన కుమార్ యాదవ్, ముస్లిం పెద్దలు, సోదరులు తదితరులు పాల్గొన్నారు.

# కాలనీలో మంత్రి బండి సంజయ్ జన్మదిన వేడుకలు



**యైటింక్లయిన్ కాలనీ. :** కాలనీ కాషాయవాదులు శుక్రవారం కేంద్రమంత్రి బండి సంజయ్ 54 వ జన్మదిన వేడుకలు నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ కాలనీ పట్టణ అధ్యక్షులు ఆకుల శశి కుమార్ ఆధ్వర్యంలో ఉదయం రామగుండం కార్పొరేషన్ 15వ డివిజన్ పరిధిలోని, అంగన్ వాడి కేంద్రంలో ఈ వేడుకలు జరిగాయి. వేడుకల్లో పాల్గొన్న పట్టణ కాషాయవాదులు కేంద్రంలోని పిల్లల సమక్షంలో కేక్ కట్ చేసి మంత్రి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే కేంద్రంలోని గర్భిణీ స్త్రీలకు, పిల్లలకు అరటి పండ్లు, కేక్ ను అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. మంత్రి బండి సంజయ్ అన్నకు బగవంతుని ఆశీస్సులు నిండుగా ఉండాలని కోరుకుంటూ, కేంద్రంలో అధికారంలో ఉన్నప్పటికీ, ఆయన రాష్ట్రం లోని పేద ప్రజలకు నిరంతర సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ఇక ఈ జన్మదిన వేడుకల్లో బిజెపి నాయకులు మూకిరి రాజు, మనోహర, లింగం నాయక్, పాషా, మారేపల్లి శ్రీనివాస్, పొట్ల వెంకటేష్, ఆకుల కుమార్, నాగేంద్రం,అనిల్ కుమార్, సిహెచ్. లక్ష్మి నారాయణ, అంగన్ వాడి కేంద్రం సభ్యులు, తార, రమ, విజయ లక్ష్మి పాల్గొన్నారు.

# శ్రీ కట్ట మైసమ్మ తల్లికి, వెండి కిరటం బహుకరణ

**పెద్దపల్లి ప్రతినిధి :** పెద్దపల్లి పట్టణంలోని మినీ ట్యాంక్ బండ్, ఎల్లమ్మ చెరువు సమీపము లోని, శ్రీ కట్ట మైసమ్మ తల్లికి, వెండి కిరీటాన్ని బహుకరణ చేశారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన, జువెలరీ వ్యాపారి, రంగు కవిత శ్రీనివాస్, వెండి కిరాటాన్ని, ఆలయ పూజారి, నాగేశ్వరరావు ఆధ్వర్యంలో, ప్రత్యేకమైన పూజలు, పాలాభిషేకం చేసి, అమ్మవారికి వెండి కిరీటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు బొడ్డుపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆషాడ మాసంలో శ్రీ కట్ట మైసమ్మ తల్లి బోనాలు



ఉత్సాహాలు ఘనంగా జరుగుతున్నాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, మొక్కులు చెల్లించుకుంటున్నారని, భక్తులు కోరుకున్న మొక్కులు వారికి జరగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ రానున్న రోజుల్లో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గండు రంగయ్య, తాజా మున్సిపల్ కౌన్సిలర్, భూత గడ్డ సంపత్, సయ్యద్ మస్రత్, బొడ్డుపల్లి రామ్మూర్తి, దొడ్డుపల్లి జగదీష్, బొడ్డుపల్లి నవీన్, బొడ్డుపల్లి సంపత్, ముక్కెర రాజేశం, భూత గడ్డ అజయ్, చంద్రగిరి రవి, బొడ్డుపల్లి అశోక్, వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ జనాభా పై పీ హెచ్ సి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు




**ముత్తారం.జులై.11.:** ముత్తారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో మండల వైద్యాధికారి అమరేందర్రావు మాట్లాడుతూ అధిక జనాభా ప్రపంచ ప్రగతికి తీవ్ర అవరోధమని అన్నారు. అర్హత గల దంపతులు ఆధునిక కుటుంబ నియంత్రణ పద్దతులను పాటించాలని వైద్యాధికారి సూచించారు. ముత్తారం ప్రాథమిక ఆసుపత్రి వద్ద వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# నాడు సామాన్య కార్యకర్త - నేడు కేంద్రమంత్రి

**- బండి సారధ్యంలో బలోపేతమైన పార్టీ - బండి సంజయ్ జన్మదిన సందర్భంగా మెగా రక్తదానశిబిరం**



**పెద్దపల్లి ప్రతినిధి :** సామాన్య కార్యకర్త సైతం కేంద్రమంత్రి పదవులను చేపట్టడం కేవలం భారతీయ జనతా పార్టీలోనే కనిపిస్తుందని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం అన్నారు. కేంద్ర హెూంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ జన్మదినం సందర్భంగా శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రిలోని బ్లడ్ బ్యాంకులో మెగా రక్తదాన శిబిరం చేపట్టారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ, కార్యకర్తగా ప్రస్థానం మొదలు పెట్టి అంచెలంచెలుగా కేంద్రమంత్రిగా ఎదిగిన బండి సంజయ్ సారధ్యంలో తెలంగాణా రాష్ట్రంలో పార్టీ బలోపేతమైందని అభిప్రాయం వ్యక్తం చేశారు. సిద్దాంతమే ఊపిరిగా శ్యామాప్రసాద్ ముఖర్జీ, అటల్ బిహారీ వాజపాయి, లాల్ క్రిష్ణ అద్వాని, నరేంద్రమోదీ బాటలో నడుస్తున్న భరతమాత ముద్దుబిడ్డగా అభివర్ణించారు. పార్టీపరంగా ఆయన చూపిస్తున్న క్రమశిక్షణ కొత్త కార్యకర్తలకు స్ఫూర్తిగా పేర్కొన్నారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు తినిపించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జంగ చక్రధర్ రెడ్డి, బెజ్జంకి దిలీప్ కుమార్, పెంద్యాల కరుణాకర్, తూడి రవీందర్, గనబోయిన రాజేందర్, వెల్లంపల్లి శ్రీనివాసరావు, భూషనవేన శ్రీనివాస్, మంథెన కృష్ణ, కాసనగట్టు విజయ్, ముత్యాల సంతోష్, బంద కరుణాకర్, సాగర్, కొప్పుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# అర్జీ.2 ఏరియాను సందర్శించిన సింగరేణి "సీఎంఓ"



**యైటింక్లయిన్ కాలనీ. :** సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ (సిఎంఒ) డాక్టర్: కిరణ్ రాజ్ కుమార్ శుక్రవారం రామగుండం రెండవ ఏరియాలో సందర్శించారు. ఉదయం ఏరియాకు వచ్చిన ఆయన ముందుగా ఏరియా జీఎం ఛాంబర్ లో జనరల్ మేనేజర్ బి. వెంకటయ్య తో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఏరియాలోని ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులకు అందిస్తున్న వైద్య పరమైన అంశాలపై ఆయన ఏరియా జీఎం వెంకటయ్య తో చర్చించారు. అలాగే ఏరియా పరిధిలో సెక్టార్.3 డిస్పెన్సరీ లో ఉద్యోగులకు వారి కుటుంబ సభ్యులకు అందిస్తున్న వైద్య సేవలు, డిస్పెన్సరీలో సమకూర్చిన సదుపాయాలు, వైద్య సిబ్బంది, తదితర అంశాలపై కూడా ఆయన చర్చించారు. ఇక సీఎంఓ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత, మొదటి సారిగా ఏరియాకి విచ్చేసిన డాక్టర్ కిరణ్ రాజ్ కుమార్ ను ఏరియా అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. ఇంకా ఈ సమావేశంలో ఏరియా అఫిషియేటింగ్ ఎస్ఓ టు జిఎం సంతోష్ కుమార్, డీజీఎం (ఐఇ) మురళీకృష్ణ, సెక్టార్.3 డిస్పెన్సరీ మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ మహిపాల్, డీజీఎం (ఫైనాన్స్) వెంకట రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల విద్యార్థుల ఇండస్ట్రియల్ టూర్



**మంథని, :** మంథని మండలం ఎక్లాస్ పూర్ గ్రామానికి చెందిన జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాల విద్యార్థులను పాఠశాల యాజమాన్యం శుక్రవారం ఇండస్ట్రియల్ టూర్ కు తీసుకువెళ్లారు. ఇండస్ట్రియల్ టూర్ లో భాగంగా మంచిర్యాల జిల్లా జైపూర్ పవర్ ప్లాంట్ సందర్శించారు. పవర్ జనరేషన్, వాటర్ స్టీమింగ్, బొగ్గు ఏ విధంగా వాటర్ వేడి చేస్తుంది, వేడి అయినటువంటి వాటర్ నుండి వచ్చేటువంటి స్టీమ్ ద్వారా ఆ మిషన్ రన్ అయినప్పుడు పవర్ ఏ విధంగా జనరేట్ అవుతుంది అనే అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం జ్యోతి, ఉపాధ్యాయుని సంతోష్, డాక్టర్ దోమ్మటి రవి, మంథని రాజశేఖర్, ములకల రాజశేఖర్, మంజుల, అనిత, ధనంజయ్ లు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం



**ముత్తారం.జులై.11.:** ముత్తారం మండలంలోని పలు సబ్ స్టేషన్ లలో మరమ్మతుల దృష్ట్యా నేడు సరాపరా నిలిపివేయబడుతుందని విద్యుత్ ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు.ముత్తారం మరియు ఖమ్మంపెల్లి సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మత్తుల దృష్ట్యా ఉదయం 10 గంటల నుండి 11.30 వరకు మరియు అడవి శ్రీరాంపూర్ సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపుకై 12 గంటల నుంచి 1 గంట వరకు సరఫరా నిలిపివేయబడుతుందని వినియోగదారులు సహకరించగలరని విద్యుత్ ఏఈ తెలిపారు.

# ఘనంగా ఐపీఎస్ పాఠశాలలో గోరింటాకు సంబరాలు....




**సుల్తానాబాద్, జులై 11 :** సుల్తానాబాద్ పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో శుక్రవారం ఆషాఢ మాసాన్ని పురస్కరించుకోని గోరింటాకు వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా చేతులకు గోరింటాకు పెట్టుకుని విద్యార్థినిలు, ఉపాధ్యాయురాళ్లు సందడి చేశారు. ఈ మేరకు ఆషాఢ మాసంలో గోరింటాకు విశిష్టతను విద్యార్థులకు ఉపాధ్యాయురాళ్లు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణప్రియ మాట్లాడుతూ ఆషాఢ మాసంలో ప్రతీ ఏటా ఈసాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఆషాడ మాసంలో మహిళలు జరుపుకునే ఒక సాంప్రదాయ వేడుక అని. ఈ వేడుకలో మహిళలు గోరింటాకును చేతులకు, కాళ్లకు పెట్టుకుంటారని. ఇది ఒక సాంస్కృతిక, ఆరోగ్యపరమైన ఆచారమని,ఆషాడ మాసంలో వచ్చే వర్షాల వల్ల వాతావరణం చల్లగా మారుతుంది.ఈ సమయంలో గోరింటాకు పెట్టుకోవడం వలన చర్మవ్యాధుల నుండి రక్షణ పొందవచ్చని అన్నారు. శరీరంలోని వేడిని తగ్గించడానికి, చల్లదనాన్ని అందించడానికి గోరింటాకు ఉపయోగపడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాళ్లు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్‌తో అధిక లాభాలు



**ముత్తారం.జులై.11.** ముత్తారం మండలంలో ఆయిల్ పామ్ ను అధికంగా సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని హార్టికల్చర్ జిల్లా ప్రత్యేక అధికారి శేఖర్ అన్నారు. మండలంలోని అడవి శ్రీరాంపూర్, ఓడేడు, ముత్తారం గ్రామాలలో గల టమాట, వంకాయ, బెండా, బీరకాయ, ఆయిల్ పామ్ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ సాగు చేసి ప్రభుత్వం అందించే రాయితీలను రైతులు వినియోగించు కోవాలని సూచించారు. ఆయిల్ ఫామ్ పంటలో అంతర్ పంటగా కూరగాయలు, పూల తోటలు పండించి అధిక లాభాలు పొందవచ్చని అన్నారు. అడవి శ్రీరాంపూర్ లోని కళ్యాణపు రాయమల్లు, నాంసాని సమ్మయ్యకు చెందిన పంట గెలలు కోతకు రావడంతో ఆ పంటను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారులు జ్యోతి,ఆయిల్ పామ్ ఫీల్డ్ ఆఫీసర్ అజయ్, అనిల్, రైతులు పాల్గొన్నారు.

# అగ్నివీర్ ఎస్.ఏ.సి.జి.డి అభ్యర్థులకు ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహణ

## - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి ప్రతినిధి :** జూలై 14న అగ్నివీర్ ఎస్.ఏ.సి.జి.డి అభ్యర్థులకు పెద్దపల్లి ప్రభుత్వ ఐ.టి.ఐ లో ఉచితంగా మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అగ్నివీర్ ఎస్.ఎస్.సి. జిడి అభ్యర్థులకు పెద్దపల్లి ప్రభుత్వ ఐ.టి.ఐ లో జూలై 14న 18 రకాల మెడికల్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు.అభ్యర్థులకు కళ్ళు , పళ్ళు, చెవి, ముక్కు సంబంధించిన పరీక్షలను ప్రముఖ వైద్య నిపుణులు చేస్తారని, హైట్ ,వెయిట్ చెస్ట్ లాంటి పరీక్షలను మాజీ సైనికులు నిర్వహిస్తారని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా అభ్యర్థులకు ఏమైనా చిన్నచిన్న మెడికల్ సమస్యలు ఉన్నచో వాటిని అధిగమించి వారు మెడికల్ పరీక్షలు ఉత్తీర్ణత సాధించడానికి పూర్తి అవకాశం ఉంటుందని తద్వారా అధిక సంఖ్యలో యువత సైన్యం, పారా మిలీటరీ బలగాలలోకి వెళ్లవచ్చని అన్నారు.ఉచిత మెడికల్ క్యాంపు కార్యక్రమాన్ని యువత వినియోగించుకొని సైన్యంలో సేవలందించాలని జిల్లా కలెక్టర్ కోరారు . యువత కోసం నిర్వహించే ఈ వైద్య పరీక్షల నిమిత్తము ఏ అభ్యర్థి నుండి ఎలాంటి డబ్బులు తీసుకోవడం జరగదని, ఈ వైద్య పరీక్షలు పూర్తిగా ఉచితంగా ఉంటాయని, ఈ అవకాశాన్ని వినియోగించదల్చుకున్న యువత తప్పకుండా తమ పేర్లను నమోదు చేసుకోవాలని, రిజిస్ట్రేషన్ నిమిత్తం ఇతర వివరాలకై 8886304040, 9573688952 నెంబర్లను సంప్రదించగలరని కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.

# పర్యావరణ సంరక్షణ మనందరి బాధ్యత

◆ ప్రతి ఒక్కరు బాధ్యతతో మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు ◆ పెద్దపల్లి ప్రభుత్వ ఐ.టి.ఐ ప్రాంగణంలో వన మహోత్సవం ◆2025 కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి ప్రతినిధి :** పర్యావరణాన్ని సంరక్షించడం మనందరి బాధ్యతని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి పట్టణంలోని ప్రభుత్వ ఐ.టి.ఐ ప్రాంగణంలో స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావుతో కలిసి వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, పరిసరాలలో పచ్చదనం పెంచే దిశగా మనమంతా సంయుక్తంగా కృషి చేయాలని, ప్రతి ఒక్కరూ బాధ్యతతో మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వనమహోత్సవం కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా పాల్గొని మొక్కలు నాటి వాటినీ సంరక్షించాలని అన్నారు. పెద్దపల్లి పట్టణంలో బ్లాక్ ప్లాంటేషన్, అవెన్యూ ప్లాంటేషన్ లో ఎత్తైన మొక్కలు నాటాలని, వాటికి తప్పనిసరిగా ట్రీ గార్డ్ వంటివి ఏర్పాటు చేయాలని, రెగ్యులర్ వాటరింగ్ కు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు మాట్లాడుతూ, మొక్కలను కాపాడటం మనందరి బాధ్యతగా ప్రజలు ముందుకు రావాలని, మన పనిగా భావించి మొక్కలను పెంచాలని, అప్పుడే గ్రీనరీ పెరుగుతుందని అన్నారు. మొక్కలు నాటడంతో పాటు ఎన్ని బతుకుతున్నాయి అనేది కీలకమని అన్నారు. ప్రస్తుతం నాటుతున్న 550 మొక్కలు వచ్చే సంవత్సరం నిర్వహించే వన మహోత్సవం నాటికి కూడా బతకాలని అన్నారు. ఐ.టీ.ఐ లో వాకర్స్ ఎక్కువగా ఉన్నారని, వీరి సౌకర్యార్థం లైటింగ్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ ను కోరారు. 10 లక్షల నిధులు మంజూరు చేసి వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. పెద్దపెల్లి జిల్లా హెడ్ క్వార్టర్ లో నూతనంగా జరిగిన రొడ్డు నిర్మాణాల వెంబడి మొక్కలు నాటాలని అన్నారు. ఈ సమావేశంలో పెద్దపల్లి వ్యవసాయ కమిటీ చైర్ పర్సన్ స్వరూప, సుల్తానాబాద్ వ్యవసాయ కమిటీ చైర్మన్ ప్రకాష్ రావు, జిల్లా అటవీ అధికారి శివయ్య,ఆర్టీవో రంగారావు, పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, తహసిల్దార్ రాజయ్య, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.





# ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గోరింటాకు సంబరాలు....

◆ శాకాంబరి అలంకరణలో శ్రీ కన్యకా పరమేశ్వరి ◆ పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలు



**సుల్తానాబాద్, జూలై 11:** పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం ఆషాడమాసం ను పురస్కరించుకొని ఆర్యవైశ్య సంఘం మహిళలు గోరింటాకు సంబరాలను ఘనంగా జరుపుకున్నారు, మొదట అమ్మవారి విగ్రహానికి గోరింటాకుతో అలంకరణ చేశారు, పూజలు చేసిన తర్వాత మహిళలు గోరింటాకు పెట్టుకున్నారు, ఈ సందర్భంగా పట్టణ ఆర్యవైశ్య సంఘం మహిళా అధ్యక్షురాలు బాదం వాణి , అయితూ మానసలు మాట్లాడుతూ గోరింటాకు పెట్టుకోవడం ఆనవైతిగా వస్తుందని, గోరింటాకు లోని ఔషధ గుణాలతో ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని అన్నారు, భవిష్యత్ తరాలకు గోరింటాకు ఉపయోగం గురించి అవగాహన కల్పించాలని ఉద్దేశంతో వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. గోరింటాకు పెట్టుకోవడం వలన వ్యాధులు రాకుండా కాపాడుతుందన్నారు, అంతేకాకుండా శరీరంలోని వేడిని తగ్గిస్తుంది అన్నారు. శాకాంబరి అలంకరణలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి... వాసవి మాత దేవాలయంలో శుక్రవారం గోరింటాకు వేడుకలను పురస్కరించుకొని ఆర్యవైశ్య మహిళలందరూ మొదటగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని పలు రకాల కూరగాయలతో అలంకరించారు, భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు, శాకాంబరి అలంకరణలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి దీవెనలు పొందారు. పూజారి పారువెల్ల సంతోష్ శర్మ మాధవి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు, సంతోష్ శర్మ సతీమణి మాధవి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి, ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చకిలం మారుతి, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొమురవెల్లి భాస్కర్, కోశాధికారి కొమురవెల్లి (కేబి) శ్రీనివాస్, ఆర్యవైశ్య సంఘం ముఖ్య సలహాదారులు పల్లకిషన్ , వైస్ ప్రెసిడెంట్ కొమురవెల్లి శ్రీనివాస్, నార్ల శ్రీనివాస్ , జై శెట్టి రాము, రామిడి రవీందర్, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

# ఇరుకు రహదారికి ఇరువైపుల ఇసుక లారీల నిలుపుదల

◆ ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక లేదంటున్నారు మానేరు ఇసుకను తరలించకుపోతున్నారు ◆ డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్





**రామగిరి, , జూలై 11:** మంథని మండలం అడవి సోమన్ పల్లి ప్రధాన రహదారిగా కాకుండా ఇసుక లారీల అడ్డగా కనిపిస్తుందని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ ప్రయాణికులకు సౌకర్యవంతమైన రవాణా కోసం నిర్మించిన ప్రధాన రోడ్డు మార్గాన్ని ఇసుక లారీలు అమాంతంగా ఆక్రమించాయి బట్టుపల్లి, అడవి నాగేపల్లి గ్రామం నుంచి మొదలుకొని అడవి సోమనపల్లి మానేరు తీరం వరకు మానేరు నుంచి ఇసుక రవాణా పల్లెల్లో అగాధం సృష్టిస్తుంది ఇసుక రవాణాతో రోడ్లు ధ్వంసమై ప్రజా జీవనం అస్తవ్యస్తంగా మారుతుంది అధిక లోడు లారీలతో ఈ మధ్యకాలంలో అనేక ప్రమాదాలు జరిగినప్పటికిని ఇసుక తోడే కాంట్రాక్టర్ల తీరు మారడం లేదు కాంట్రాక్టర్ లేని సమయంలో సూపర్వైజర్ సైతం సూపర్ స్టార్ ల లారీలను తిప్పుతున్నాడు మారుమూల పల్లెల్లో ఇందిరమ్మ ఇండ్ల పైలెట్ ప్రాజెక్టుకు ఇసుక లేక ఇల్లు కట్టలేని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు అవస్థలు పడుతున్న తరుణంలో మానేరులోని ఇసుకను మాత్రం తరలించకపోతున్నారు గతంలో పెద్దపెల్లి జిల్లాలోని 23 ఇసుక రీచుల్లో కోటిన్నరకు పైగా మెట్రిక్ టన్నుల ఇసుకను తరలించకపోయారని అనుమతికి మించి ఇసుకను తరలించకపోవడమే కాకుండా అనేక ప్రమాదాలు కూడా జరిగాయని ప్రమాదం చేస్తున్నారు పారితోషకం ఇచ్చి సరిపెట్టు కుంటున్నారు అనే విమర్శలు కూడా కాంట్రాక్టర్లపై ఉన్నాయని ఏది ఏమైనాప్పటికిని రహదారికి ఇరువైపులా లారీలను నిలుపుదల చేయడం వలన వాహనదారుల ప్రయాణానికి ఇబ్బంది కరంగా ఉంటుందని మూలమలుపులు ఏర్పడకుండా లారీలు అడ్డుగా పెడుతున్నారని ఇసుక లారీలను రోడ్డు కిరువైపులా నిలుపుదల చేయకుండా సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని లేనియెడల ఆయా గ్రామ ప్రజలను కలుపుకొని మానేరు ఇసుకను తరలించకుండా లారీలను అడ్డుకుంటామని అప్పుడు రావు లారీలే ఇప్పుడు రావు లారీలే రోడ్డు కిరువైపులా నిలుపుదల చేస్తున్నారని లారీల నిలుపుదల వలన వాహన దారులకు మరిన్ని ప్రమాదాలు జరగక ముందే సంబంధిత అధికారులు కాంట్రాక్టర్లపై తగు చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్ డిమాండ్ చేశారు.

# ఝాన్సీ రెడ్డిని విమర్శించే స్థాయి తిరుపతి రెడ్డికి లేదు



**తొర్రూరు, :** పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత,టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు,కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డిని విమర్శించే స్థాయి అనుమాండ్ల తిరుపతి రెడ్డికి లేదని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు జక్కుల రాం రెడ్డి, చెవిటి సధాకర్ లు విమర్శించారు.శుక్రవారం డివిజన్ కేంద్రంలోని స్థానిక విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత రెండు రోజుల క్రితం నుండి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తిరుపతిరెడ్డి సోషల్ మీడియాలలో ఝాన్సీ రెడ్డిని విమర్శిస్తూ మాట్లాడడం సరైంది కాదని,ఝాన్సీ రెడ్డిని విమర్శించే నైతిక స్థాయి తిరుపతి రెడ్డికి లేదని, కాంగ్రెస్ పార్టీలో పాత కొత్త క్యాడర్ కలిసి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఝాన్సీ రెడ్డి నాయకత్వంలో పనిచేస్తున్నామని అన్నారు. కావాలని సోషల్ మీడియా ముందు పాత కాంగ్రెస్ క్యాడర్ గురించి మాట్లాడడం సిగ్గుచేటని సిగ్గుచేటన్నారు.కాంగ్రెస్ పార్టీలో అందరూ కలిసి మెలిసి పనిచేస్తున్నామని అన్నారు. ఝాన్సీ రెడ్డి పై విమర్శలు చేస్తే కాంగ్రెస్ కార్యకర్తల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు.ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు కందాడి అశోక్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు కాటం మల్లారెడ్డి,ప్రతి కంఠం దేవేందర్ రాజు, మిత్తింటి హరీష్, దీకొండ మధు,యూత్ నాయకులు వీరమనేని రమేష్,సతీష్, పరశురాములు,నడిగడ్డ మధు తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులతో పంచాయతీ ప్రత్యేక అధికారి సమావేశం



**తిమ్మాపూర్, జూలై 11,:** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పోలంపల్లిలో గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి,ఇందిరమ్మ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్లపై లబ్ధిదారులతో శుక్రవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఇండ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని సూచిస్తూ జరుగుతున్న నిర్మాణం ప్రకారం ఎలాంటి సందేహం లేకుండా బిల్లులు కూడా ప్రతి సోమవారం ఖాతాలో జమౌతాయని త్వరగా ఇండ్ల నిర్మాణాలను పూర్తిచేయాలని లబ్దిదారులను ప్రత్యేక అధికారి శ్రావణ్ కుమార్ కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు, పోలంపల్లి మాజీ ఎంపిటిసి బండారి రమేశ్ గౌడ్, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు కనకం కొమురయ్య, కార్యదర్శి గోలి మధుమిత రెడ్డి, ఇందిరమ్మ లబ్ధిదారులు పాల్గొన్నారు.

## సెంటినరీ కాలనీ ముదిరాజ్ కుల దైవం పెద్దమ్మ తల్లి ఆలయ నూతన కమిటీ ఎన్నిక



**రామగిరి, జూలై 11:-** రామగిరి మండలం సెంటినరీ కాలనీ లో ముదిరాజ్ ల ఇలా వేల్పుపైనట్టి పెద్దమ్మతల్లి ముదిరాజ్ సంఘం ఆలయ నూతన కమిటీ నియామకం చేయడం జరిగింది. ముదిరాజ్ సంఘ నూతన భవనం ఆవరణలో రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షులు నూనె రాజేశం ముదిరాజ్, సెంటినరీ కాలనీ ముదిరాజ్ సంఘం మాజీ అధ్యక్షులు తీగేల భూమయ్య, గుర్రల పెద్దలు ఆధ్వర్యంలో నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. సెంటనరి కాలనీ ముదిరాజ్ సంఘం అడ్వైజర్ గా ఎద్దు కుమార్, అధ్యక్షుడిగా నూనె రామచందర్, ఉపాధ్యక్షులుగా చిట్టి మల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా మట్ట రాములు, క్యాషియర్ గా మత్త మారి రవి, నూనె సంపత్ కుమార్ లను ఎన్నుకోవడం జరిగిందని తెలియజేశారు.మేరకు నూతన చైర్మన్ కుమార్ మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి, అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని అందరి సహాకారంతో ఆలయ నిర్మాణం పూర్తి చేసుకుంటామని అన్నారు. తనకు ఈ అవకాశం ఇచ్చిన కుల బంధువులు అందరి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు నూతన చైర్మన్ నూనె రామచందర్ మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి, అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని అందరి సహాకారంతో ఆలయ నిర్మాణం పూర్తి చేసుకుంటామని అన్నారు. ఈనెల 16 బుధవారం రోజున పెద్దమ్మతల్లి బోనాలు ఉన్నందున సెంటినరీ కాలనీలోని ముదిరాజులందరూ సకాలంలో విచ్చేసి ఆ బోనాల పండుగను విజయవంతం చేసి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. అలాగే నన్ను సెంటనరి కాలనీ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడుగా నామీద నమ్మకంతో నియమించినందుకు వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా నాకు ఇచ్చిన బాధ్యతలను నా శాయశక్తుల సంఘం కోసం కృషి చేస్తానని నన్ను అధ్యక్షుడుగా నియమించిన సీనియర్ నాయకులు నూనె రాజేశం ముదిరాజ్, తీగేల భూమయ్య, గుర్రల పెద్దలు ముదిరాజ్ లకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షులు నూనె రాజేశం ముదిరాజ్, సెంటినరీ కాలనీ ముదిరాజ్ సంఘం మాజీ అధ్యక్షులు తీగేల భూమయ్య, గుర్రల పెద్దలు, నూతన కమిటీ సభ్యులు సెంటనరి కాలనీ ముదిరాజ్ సంఘం అడ్వైజర్ ఎద్దు కుమార్, అధ్యక్షుడిగా నూనె రామచందర్, ఉపాధ్యక్షులు చిట్టి మల్లయ్య, ప్రధాన కార్యదర్శి మట్ట రాములు, క్యాషియర్ మత్త మారి రవి, నూనె సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## దేశ సమగ్రాభివృద్ధికి అధిక జనాభా అవరోధం

### ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ రమణారావు



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి జూలై 11( హైదరాబాద్ న్యూస్):** భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల సమగ్ర అభివృద్ధికి అధిక జనాభా అవరోధంగా మారిందని భూపాలపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ తెలియజేశారు. ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకొని కళాశాలలో అర్థశాస్త్రం శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ అధిక జనాభా వల్ల ఏర్పడే తిరోగమన ఫలితాల గురించి గ్రామాలలో అవగాహన కల్పించవలసిన బాధ్యత యువతపై ఉంటుందని తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రుక్షానామమ్మద్, జి చంద్రకళ, డాక్టర్ ఎన్ కవిత, డాక్టర్ వి కాత్య, డాక్టర్ ఎం హైమావతి, డాక్టర్ ఆర్ కుమారస్వామి, ఆర్ శ్రీధర్, టి శ్రీధర్, ఏ దేవేందర్ పాల్గొన్న ఈ సమావేశానికి అర్థశాస్త్ర అధ్యాపకుడు ఎన్ రామచంద్రం అధ్యక్షత వహించారు. వక్తలందరూ జనాభా పెరుగుదల వలన కలిగే అనర్థాలను వివరించారు. సందర్భంగా ఏర్పాటుచేసిన ఉపన్యాస పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు షీల్డ్ లను బహూకరించారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ప్రభుత్వ ఆసుపత్రుల సేవలను ప్రజలందరూ వినియోగించుకోవాలి
- లబ్ధిదారులకు సీ.ఎం.ఆర్.ఎఫ్
- కళ్యాణ లక్ష్మి, షాదీ ముభారక్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు







**పెద్దపల్లి ప్రతినిధి :** ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలకు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ ఆసుపత్రుల సేవలను ప్రజలందరూ వినియోగించుకోవాలని స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు.శుక్రవారం పెద్దపల్లి పట్టణానికి, మండలానికి సంబంధించిన వివిధ గ్రామాలకు చెందిన 51 కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు (?51,05,916/-) 51 లక్షల ఐదు వేల 916 రూపాయల విలువ గల చెక్కులను, నియోజకవర్గంలోని 417 మంది లబ్ధిదారులకు 1,83,52,500 /- ( 1 కోటి 83 లక్షల 52 వేల 5 వందల రూపాయలు) విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ పేద ప్రజల వైద్య ఖర్చులకు సీఎం రిలీఫ్ ఫండ్ అనేది తోడ్పాటును అందిస్తుందని పేదల కోసం కడుపునిండా భోజనం చెయ్యాలనే స్వర్గీయ ఎన్టీఆర్ 2 రూ. ప్రవేశపెడితే ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధనికులతో సమానంగా పేదలు సన్న బియ్యంతో భోజనం చెయ్యాలనే లక్ష్యంతో సన్న బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టి దేశానికే ఆదర్శంగా నిలిచామన్నారు. అలాగే తాను గెలిచిన సంవత్సరం కాలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో పెద్దపల్లి నియోజకవర్గానికి దాదాపు 1000 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు మంజూరు చేయడం మన అదృష్టమని, ప్రజల దీవెనలతో గెలిచిన తాను ప్రతిక్షణం ప్రజల సంక్షేమం కోసమే పని చేస్తున్నానని నియోజకవర్గంలో ఎక్కడ అవినీతి లేకుండా పాలన సాగిస్తున్నామని అన్నారు. గత పది సంవత్సరాలు రేషన్ కార్డుల కోసం ఎదురుచూశారు కాంగ్రెస్ ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయడం జరుగుతుందని, దేశంలో ఎక్కడా లేనివిధంగా పేదలకు రేషన్ ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, సన్న వడ్లకు ప్రభుత్వం రూ. 500 బోనస్ అందిస్తుందని, గతం కంటే ఎక్కువగా పెట్టుబడి సహాయం రైతు భరోసా క్రింద రూ. 12000 ఎకరానికి అందిస్తున్నామని తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిధి రూ. 10 లక్షలకు పెంపు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500 లకు గ్యాస్ సిలిండర్, సన్న రకం బియ్యం సరఫరా వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి తీరుతామని హామీ ఇచ్చారు. పెద్దపల్లి జిల్లాకు రూ.38 కోట్లు సన్న వడ్లకు బోనస్ ఇస్తే, కేవలం పెద్దపల్లి నియోజకవర్గ రైతులకు రూ. 31 కోట్లు బోనస్ చెల్లించామని పేర్కొన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామని పేర్కొన్నారు.పెద్దపల్లి ప్రభుత్వ దవాఖానలో నూతనంగా ఏర్పాటు చేసిన నవజాత శిశు కేంద్రం ద్వారా ఇప్పటి వరకు 100 మంది చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందించడం జరిగిందని కార్పొరేట్ స్థాయి వైద్యం ప్రభుత్వం ఆసుపత్రి లో అందించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి తహసీల్దార్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్లు, మాజీ సర్పంచులు , ఎంపీటీసీలు, కౌన్సిలర్లు మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణలో ప్రజలు భాగస్వామ్యులు కావాలి

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



**మానకొండూర్, జూలై 11,:** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలోని చెరువు కట్ట వద్ద, ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో వన మహొత్సవంలో భాగంగా జిల్లా అదనపు కలెక్టర్ అశ్వినీ తనాజీ వాకడేతో కలిసి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ శుక్రవారం మొక్కలు నాటారు.అనంతరం ఎమ్మెల్యే కవ్వంపల్లి మాట్లాడుతూ.....

పెరుగుతున్న కాలుష్య ప్రభావం ప్రజల ఆరోగ్యంపై పడకుండా మొక్కలు నాటాలని, పచ్చదనాన్ని పెంచుతూ కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే సూచించారు.కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్, అటవీశాఖ రేంజర్ బుర్ర లత, మండల పరిషత్ అభివృద్ధి అధికారి వరలక్ష్మి,ఎంపీవో శ్రీధర్, ఉప తహసీల్దార్ టి.సమ్మయ్య, రెవెన్యూ ఇన్ స్పెక్టర్ ప్రీతి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్ రెడ్డి, జిల్లా నాయకులు తాళ్లపల్లి సంపత్ గౌడ్, ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, ద్యావ శ్రీనివాస్ రెడ్డి, రామిడి శ్రీనివాస్ రెడ్డి, తాళ్లపల్లి నరేశ్, బండి మల్లేశం, రేమిడి తిరుపతి, కోండ్ర సురేష్, ఎండీ ఇర్ఫాన్, మడుపు ప్రేమ్ కుమార్, చెలిగంటి సంపత్, కనకం కుమార్, సాయిరి దేవయ్య,కానిగంటి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## 42% బీసీ రిజర్వేషన్ ఎంతవరకు వాస్తవం..?



**జగిత్యాల, ప్రతినిధి :** రాష్ట్ర క్యాబినెట్ పంచాయతీ రాజ్ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్న ఉద్దేశంతో పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించేందుకు ఆర్డినెన్స్ తీసుకురావాలని నిర్ణయించినట్టు వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో బీసీ ప్రజలు ఒక్కసారి చరిత్రను పునఃసమీక్షించాలి.2018లో రాష్ట్ర ప్రభుత్వం నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకువచ్చింది. ఇందులో సెక్షన్ 9 ప్రకారం బీసీలకు 34% రిజర్వేషన్ కల్పించింది. ఆ తర్వాత జూన్ 2018లో జీఓ నం.396 జారీ చేసి స్థానిక సంస్థలన్నింటిలోనూ బీసీలకు 34 శాతం రిజర్వేషన్ అమలుచేయాలనింది. అయితే దీనిపై హైకోర్టు మొత్తం రిజర్వేషన్లు 50 శాతాన్ని మించి పోతున్నాయని పేర్కొంటూ ఈ జీఓను కొట్టేసింది. దీనిపై అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు అప్పీల్ కు వెళ్లింది. అయితే సుప్రీంకోర్టు ఆమోదించకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్పీల్ వెనక్కి తీసుకుని, ఆర్డినెన్స్ 2/2018 జారీ చేసి బీసీలకు 22% రిజర్వేషన్ మాత్రమే కల్పించి పంచాయతీ ఎన్నికలు నిర్వహించింది. ఇప్పుడు మళ్లీ అదే ప్రయోగాన్ని మరోసారి చేయాలని ప్రభుత్వం యత్నిస్తుంది. కానీ ఈ 42% రిజర్వేషన్ నిర్ణయం పునర్విచారణకు లోనవుతుంది. గత అనుభవాల ప్రకారం, ఇది న్యాయపరంగా నిలవబోదనే అభిప్రాయం న్యాయవాదులు, రాజకీయ పరిశీలకులు వ్యక్తం చేస్తున్నారు.అందుకే బీసీ ప్రజలు మళ్ళీ మోసపోవద్దు. ఎన్నికల సమయంలో బీసీలను ఆకర్షించేందుకు తాత్కాలికంగా తీసుకువచ్చే ఈ విధమైన ఆర్డినెన్సులు కోర్టులో నిలవవు. నిజమైన బీసీ సంక్షేమం, రాజకీయం పరిరక్షించాలంటే 9 వ షెడ్యూల్ మాత్రమే శరణ్యమా...!

## 60 వసంతాలు ఘనంగా పూర్తి చేసుకున్న ఎస్. కె. ఎన్. ఆర్ ఆర్ట్స్, సైన్స్ కళాశాల

### - ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి ఘన స్వాగతం పలికిన విద్యార్థులు..



**జగిత్యాల, ప్రతినిధి ):** జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎస్ కే ఎన్ ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ మరియు సైన్స్ కళాశాల 60 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్ రమణ గారు మరియు జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ గారు సందర్శించడానికి వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే మరియు ఎమ్మెల్సీ గార్లకు ఘన స్వాగతం పలికిన కళాశాల బృందం, విద్యార్థులు తదుపరి ఎమ్మెల్యే మరియు ఎమ్మెల్సీ గార్లు కళాశాల ఆవరణలో పూల మొక్కను నాటారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాల ఆవిర్భవించి 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పూర్వ విద్యార్థులు అందరూ త్వరలో సమావేశమై 60 వసంతాల ఉత్సవాలను కళాశాలలో ఘనంగా నిర్వహించాలని తెలిపారు. ఈ సందర్భంగా గౌరవ ఎమ్మెల్సీ మరియు ఎమ్మెల్యే గార్లు కళాశాల అభివృద్ధికి ఒక్కొక్కరు లక్ష రూపాయల చొప్పున విరాళాలను ప్రకటించారు. కళాశాల పూర్వ విద్యార్థులు కూడా 60 వసంతాల సందర్భంగా కళాశాల అభివృద్ధికి తమ వంతుగా విరాళాలు మరియు సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. త్వరలో నిర్వహించబోయే ఈ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారిని పిలవాలని తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాలలో అడ్మిషన్లు పెంపొందించుటకై కావాల్సిన కార్యాచరణ తెలిపారు .కళాశాల ఆవరణలో హాస్టల్ వసతి, ఆడిటోరియం భవన నిర్మాణం, నూతన పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు మరియు అధ్యాపక పోస్టుల భర్తీ కొరకై త్వరలో ప్రభుత్వానికి నివేదిక సమర్పించి అన్ని వసతులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ ఏ. అశోక్ గారు మాట్లాడుతూ కళాశాలలో ఉన్న వసతులు, కోర్సులు మరియు అడ్మిషన్ల కొరకై తీసుకుంటున్న చర్యలను వారికి నివేదిక సమర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ గారు, కళాశాలపూర్వ విద్యార్థులు ,అధ్యాపకులు, పట్టణ తాజా మాజీ కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు..

# ఇంగ్లాండ్ పతనాన్ని శాసించాడు

## స్పోర్ట్స్

### ఐదు వికెట్లు ఖాతాలో వేసుకున్న బుమ్రా

### ఇంగ్లాండ్ 387 పరుగులకు ఆలౌట్

లార్డ్స్ టెస్టులో ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ ముగిసింది. టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లాండ్ మొదటి ఇన్నింగ్స్?లో రెండో రోజు 387 పరుగులకు ఆలౌటైంది. స్టార్ బ్యాటర్ రూట్ (104 పరుగులు) సెంచరీ సాధించాడు. బ్రెండన్ కార్స్ (56) జెమీ స్మిత్ (51) హాఫ్ సెంచరీలతో ఆకట్టుకున్నారు. టీమ్ఇండియాలో స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా అదరగొట్టాడు. ఐదు వికెట్లతో ఇంగ్లాండ్ పతనాన్ని శాసించాడు. నితీశ్ కుమార్ రెడ్డి, మహ్మద్ సిరాజ్ తలో 2, రవీంద్ర జడేజా 1 వికెట్ పడగొట్టారు.ఓవర్ నైట్ స్కోర్ 251-4తో రెండో రోజు బ్యాటింగ్ ప్రారంభించిన ఇంగ్లాండ్ మరో 136 పరుగులు జోడించి చివరి ఆరు వికెట్లు కోల్పోయింది. ఇందులో బుమ్రా 4 వికెట్లు తీయగా, సిరాజ్ 2 వికెట్లు దక్కించుకున్నాడు. ఇన్నింగ్స్ ప్రారంభమైన కొద్ది సేపటికే బెన్ స్టోక్స్ (44) ఔటయ్యాడు. దీంతో ఇంగ్లాండ్ సగం వికెట్లు కోల్పోయింది. ఇక వ్యక్తిగత స్కోర్? 99తో రెండో రోజు బ్యాటింగ్ కొనసాగించిన రూట్ మరో 5 పరుగులు చేశాడు. ఈ క్రమంలోనే కెరీర్?లో 37వ టెస్టు సెంచరీ నమోదు చేశాడు.




సెంచరీ తర్వాత కాసేపటికే రూట్?ను కూడా బుమ్రానే పెవిలియన్ చేర్చాడు.రూట్ ఔటైన తర్వాతి బంతికే ఆల్ రౌండర్ క్రిస్ వోక్స్?ను సైతం బుమ్రా బుట్టలో వేసుకున్నాడు. దీంతో 271 పరుగులకు ఇంగ్లాండ్ 7 వికెట్లు కోల్పోయింది. కానీ ఆ తర్వాత స్మిత్- కార్స్ మంచి పార్ట్?నర్?షిప్ చేయడంతో ఇంగ్లాండ్ ఇన్నింగ్స్? మళ్లీ నిలబడింది. దీంతో 353-7తో మంచి స్థితిలోనే ఇంగ్లాండ్ లంచ్ బ్రేక్?కు వెళ్లింది.లంచ్ తర్వాతి ఓవర్లోనే స్మిత్?ను సిరాజ్ ఔట్ చేశాడు. ఆ వెంటనే జోఫ్రా ఆర్చర్?ను బుమ్రా అద్భుత బంతితో క్లీన్ బౌల్డ్ చేశాడు. ఇక చిలర్లో బషీర్?తో కలిసి కార్స్ కాసేపు పోరాడాడు. ఈ క్రమంలోనే హాఫ్ సెంచరీ కంప్లీట్ చేశాడు. కాసేపటికి కార్స్?ను సిరాజ్ ఔట్ చేసి ఇంగ్లాండ్ ఇన్నింగ్స్?ను ముగించాడు. దీంతో పేస్?కు అనుకూలమైన ఈ పిచ్?పై 9 వికెట్లు ఫాస్ట్ బౌలర్లే పడగొట్టారు. ఒక వికెట్ స్పిన్నర్ (జడేజా)కు దక్కింది.తొలి రోజు ఒకే వికెట్ దక్కించుకున్న బుమ్రా, రెండో రోజు ప్రమాదకరంగా మారాడు. ఇన్నింగ్స్ ప్రారంభంలోనే రెండు కీలక వికెట్లు స్టోక్స్, రూట్?ను పెవిలియన్?కు పంపి టీమ్ఇండియాను గేమ్?లోకి తీసుకొచ్చాడు. కాసేపటికే డేంజరస్ హ్యారీ బ్రూక్ (11)ను సూపర్ బంతితో క్లీన్ బౌల్డ్ చేశాడు. ఇక లంచ్ తర్వాత ఆర్చన్?ను పెవిలియన్ చేర్చి ఐదో వికెట్ ఖాతాలో వేసుకున్నాడు.





## వరుస బంతుల్లో ఐదు వికెట్లు

క్రికెట్ మ్యాచ్లో ఓవర్లో ఒక వికెట్ పడగొట్టడం కోసం బౌలర్లు ఎంతో శ్రమిస్తారు. ఒక్కోసారి సింగిల్ ఓవర్లోనే రెండు, మూడు వికెట్లు కూడా కూల్చుతారు. అలా అప్పుడప్పుడు హ్యాట్రిక్ వికెట్లు పడగొట్టి సత్తా చాటుకున్న సందర్భాలూ మనం చూశాం. కానీ వరుస బంతుల్లో ఓ బౌలర్ ఐదు వికెట్లు పడగొడితే అది రికార్డే కదూ! ఇలాంటి అరుదైన సంఘటన నిజంగానే నమోదైంది. ఐర్లాండ్కు చెందిన ఆల్ రౌండర్ కర్టిస్ కాంఫర్ ప్రపంచ క్రికెట్లో చరిత్ర సృష్టించాడు. అతడు ఇంటర్-ప్రావిన్షియల్ 20 ట్రోఫీలో ఈ లైఫ్ టైమ్ అచీవ్?మెంట్ సాధించాడు. ఈ టోర్నీలో రీసెంట్?గా నార్త్ వెస్ట్ వారియర్స్- మున్స్టర్ రెడ్స్ మధ్య జులై 10న మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్?కు డబ్లిన్లోని శాండీమౌంట్లోని పెంబ్రోక్ క్రికెట్ క్లబ్ వేదికైంది. ఈ మ్యాచ్లోనే కర్టిస్ కాంఫర్ అరుదైన ఘనత సాధించి, ప్రపంచ రికార్డుల్లోకెక్కాడు.189 పరుగుల ఛేదనలో నార్త్ వెస్ట్ వారియర్స్ 11.4 ఓవర్లకు 87-5 స్కోర్?తో ఉంది. ఈ ఓవర్లో చివరి రెండు బంతుల్లో కాంఫర్ రెండు వికెట్లు పడగొట్టాడు. ఆ తర్వాత 12వ ఓవర్?లో ఒక పరుగు వచ్చింది. దీంతో వారియర్స్ జట్టు 13 ఓవర్లకు 88-7తో నిలిచింది. 14వ ఓవర్?లో కాంఫర్ మళ్లీ బంతి అందుకున్నాడు. ఈ ఓవర్లో తొలి మూడు బంతుల్లో మూడు వికెట్లు కూల్చి వారియన్స్?ను 88 పరుగులకే ఆలౌట్ చేశాడు.అలా ఒక్క పరుగు తేడాలో వారియర్స్ జట్టు చివరి ఐదు వికెట్లు కోల్పోయింది. కాంఫర్ దెబ్బకు నలుగురు బ్యాటర్లు డకౌట్ అయ్యారు. దీంతో కాంఫర్ హ్యాట్రిక్ నమోదు చేయడమే కాకుండా, వరుస 5 బంతుల్లో 5 వికెట్లు పడగొట్టిన తొలి బౌలర్?గానూ రికార్డు సృష్టించాడు. ఫలితంగా మున్స్టర్ రెడ్స్ 100 పరుగుల తేడాతో గ్రాండ్ విక్టరీ కొట్టింది. ఈ మ్యాచ్?లో 2.3 ఓవర్లు బౌలింగ్ చేసిన కాంఫర్ 16 పరుగులిచ్చి 5 వికెట్లు నేలకాల్చాడు. వరుసగా ఐదు బంతుల్లో ఐదు వికెట్లు తీసిన తొలి పురుష క్రికెటర్?గా కాంఫర్ రికార్డ్ కొట్టాడు. అయితే గతంలో మహిళల క్రికెట్?లో జింబాబ్వేకు చెందిన ఆల్ రౌండర్ కెలిస్ న్ధోవు ఈ ఫీట్ సాధించింది. ఆమె 2024లో డొమెస్టిక్? %u%20 టోర్నమెంట్?లో ఈగల్స్ జట్టుపై 5 బంతుల్లో 5 వికెట్లు తీసింది. కాగా, కాంఫర్ గతంలో 2021 టీ20 ప్రపంచ కప్ సందర్భంగా నెదర్లాండ్స్పై నాలుగు బంతుల్లో నాలుగు వికెట్లు పడగొట్టాడు.

## వైభవ్ టీమిండియాలో అరంగేట్రం చేయడం కష్టమే..

భారత క్రికెట్లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ.. ఇంగ్లాండ్తో జరిగిన యూత్ వన్డే క్రికెట్లో పేలుడు బ్యాటింగ్తో విధ్వంసం సృష్టించాడు. ఆతిథ్య ఇంగ్లాండ్ అండర్-19తో జరిగిన ఈ సిరీస్లో వైభవ్ 5 మ్యాచ్ల్లో 355 పరుగులు చేశాడు. ఇందులో 29 సిక్సర్లు, 30 ఫోర్లు ఉన్నాయి. ఇంతటి పేలుడు బ్యాటింగ్ చేసినప్పటికీ, వైభవ్ సూర్యవంశీకి ప్రస్తుతం టీమిండియాలో చోటు దక్కడం కష్టమే.వైభవ్ సూర్యవంశీ.. భారత సీనియర్ జట్టుకు ఎంపిక కావడానికి మరో ఏడాది వేచి చూడాల్సి ఉంటుంది. దీనికి ప్రధాన కారణం ఐసీసీ కొత్త నియమం. వైభవ్ సూర్యవంశీకి ఇప్పుడు 14 సంవత్సరాలు. ఐసీసీ నిబంధనల ప్రకారం, జాతీయ జట్టుకు ఆడే ఆటగాడికి కనీసం 15 సంవత్సరాలు నిండాలి.2020లో, ఐసీసీ అంతర్జాతీయ క్రికెట్ కోసం కనీస వయస్సు నియమాన్ని రూపొందించింది. దీని ప్రకారమే జాతీయ ఆటగాళ్ళను ఎంపిక చేస్తారు. వైభవ్ సూర్యవంశీ ప్రస్తుత వయస్సు 14 సంవత్సరాలు. అంటే వచ్చే ఏడాది మార్చి 27 నాటికి అతనికి 15 సంవత్సరాలు నిండుతాయి. అప్పుడే అతను జాతీయ జట్టుకు అర్హత సాధిస్తాడు.గతంలో అంతర్జాతీయ క్రికెట్ ఆడటానికి కనీస వయోపరిమితి ఉండేది కాదు. దీని కారణంగా, పాకిస్తాన్కు చెందిన హసన్ రాజా కేవలం 14 సంవత్సరాల 227 రోజుల వయసులో అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. ప్రస్తుత పరిస్థితిలో, వైభవ్ సూర్యవంశీ ఈ ప్రపంచ రికార్డును బద్దలు కొట్టడం కష్టం.కానీ ప్రస్తుతం భారత టీ20 జట్టులో చోటు కోసం భారీ సంఖ్యలో ఆటగాళ్లు ఎదురుచూస్తున్నారు. అందువల్ల, బీసీసీఐ అలాంటి అభ్యర్థన చేసే అవకాశం లేదు. దీని కారణంగా, వైభవ్ సూర్యవంశీ భారతదేశం తరపున అంతర్జాతీయంగా అరంగేట్రం చేయడానికి కనీసం ఒక సంవత్సరం వేచి ఉండాల్సి ఉంటుంది.





## దేశ సేవకే ప్రాధాన్యత ఇవ్వాలి

### ఆటగాళ్లకు కుటుంబం ముఖ్యమే

### మనం సెలవుల కోసం విదేశాలకు రాలేదు

### గౌతమ్ గంభీర్ కీలక వ్యాఖ్యలు

గత ఆస్ట్రేలియా పర్యటనలో టీమిండియా ఘోర పరాభవాన్ని చవిచూడడంతో బీసీసీఐ కొన్ని కఠిన నిబంధనలను తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. అందులో జట్టు విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు ఎక్కువ సమయం కుటుంబానికి కాకుండా ఆటకే కేటాయించాలని బీసీసీఐ స్పష్టం చేసింది. ప్రస్తుతం టీమిండియా ఇంగ్లండ్ జట్టుతో టెస్ట్ సిరీస్ ఆడుతోంది. ఈ టెస్ట్ సిరీస్ కు ముందు గంభీర్ తన తల్లికి అనారోగ్యం దృష్ట్యా స్వదేశానికి వచ్చి వెంటనే ఇంగ్లాండ్ చేరుకున్న సంగతి తెలసిందే. ఈ నేపథ్యంలో టీమిండియా ప్రధాన కోచ్ బీసీసీఐ నిబంధనలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఛతేశ్వర్ పుజారాతో జరిగిన ఇంటర్వ్యూలో కీలక అభిప్రాయాలను పంచుకున్నాడు. ఆటగాళ్లకు కుటుంబం ముఖ్యమే అయినా.. దేశ సేవకే ప్రాధాన్యత ఇవ్వాలని గౌతమ్ గంభీర్ అభిప్రాయపడ్డాడు. మనం సెలవుల కోసం విదేశాలకు రాలేదని.. దేశం కోసం ఆడేందుకు వచ్చామని అన్నారు. ఏదైనా పర్యటనకు వెళ్లినప్పుడు డ్రెస్సింగ్ రూమ్లో చాలా తక్కువ మందితో ఆడాల్సి ఉంటుందని.. వారితో పని చేసి దేశం గర్వపడేలా చేయాల్సిన బాధ్యత మనపై ఉంటుందన్నారు. కుటుంబానికి సమయం కేటాయించాలి.. కానీ దేశం కోసం ఆడేందుకు వచ్చినప్పుడు దృష్టి అంతా ఇక్కడే ఉండాలన్నారు. తన వరకు ఈ లక్ష్యమే ఎక్కువ అని గంభీర్ చెప్పుకొచ్చాడు. మనకు ప్రతిరోజు పోరాటమేనని.. దేశం కోసం ప్రాతినిధ్యం వహిస్తున్నప్పుడు ఇది తప్పదన్నాడు. మన విజయాలలో కుటుంబాల పాత్ర కూడా ఎక్కువగా ఉంటుందన్నాడు. ఆటగాళ్ల దృష్టంతా పూర్తిగా ఆటపైనే ఉండాలని ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ అభిప్రాయపడ్డారు.గతంలో ఈ బీసీసీఐ నిబంధనపై స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ విభిన్నంగా స్పందించాడు. కాస్త అసహనం కూడా వ్యక్తం చేశాడు. దీని వల్లే కోహ్లీ టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్ అయి ఉంటాడని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి. సురేష్ రైనా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, విదేశీ పర్యటనలకు కుటుంబ సభ్యులను అనుమతించకూడదని భారత జట్టు యాజమాన్యం విధించిన నిషేధమే కోహ్లీ, రోహిత్ టెస్టు క్రికెట్ నుండి రిటైర్ అవ్వడానికి కారణమని పేర్కొన్నాడు. ఇది మళ్లీ వివాదానికి దారితీసింది. ప్రస్తుతం బ్యాటింగ్కు అనుకూలమైన పిచ్పై రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు ఉండి ఉంటే మరిన్ని రికార్డులు సృష్టించేవారని చాలా మంది విమర్శిస్తున్నారు.

## ఆసియా కప్ 2025 రద్దు అయ్యే అవకాశం!!?

సెప్టెంబర్లో జరగాల్సిన ఆసియా కప్ 2025 మరింత ఇబ్బందుల్లో పడింది. ఇప్పుడు టోర్నమెంట్ రద్దు అయ్యే అవకాశం ఉంది. భారత క్రికెట్ నియంత్రణ మండలి, శ్రీలంక క్రికెట్ కీలక అడుగు వేసి జులై 24న ఢాకాలో జరగనున్న ఆసియా క్రికెట్ కౌన్సిల్ సమావేశానికి హాజరు కాకూడదని నిర్ణయించుకున్నాయి. టెలికాం ఆసియా స్పోర్ట్ నివేదిక ప్రకారం, ఈ ఆరు దేశాల టోర్నమెంట్ ప్రారంభానికి రెండు నెలల కన్నా తక్కువ సమయం మిగిలి ఉన్న సమయంలో రెండు బోర్డులు ఈ నిర్ణయం తీసుకున్నాయి. సమావేశం ప్రణాళిక ప్రకారం జరుగుతుందని %ూజజ% ధృవీకరించినప్పటికీ, భారత్, శ్రీలంక లేకపోవడం ఈ టోర్నమెంట్ భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తోంది. ఈసారి ఆసియా కప్ టీ20 ఫార్మాట్లో జరగనుంది. ఈ టోర్నమెంట్ సెప్టెంబర్ 5 నుంచి ప్రారంభం కావచ్చు, కానీ అంతకు ముందు, జూలై 24న ఢాకాలో జరగనున్న ఏసీసీ సమావేశంలో బీసీసీ, శ్రీలంక క్రికెట్ పాల్గొనకపోవడం వల్ల టోర్నమెంట్ జరగడంపై ప్రశ్నలు తలెత్తాయి. ఏసీసీ సమావేశం ఢాకాలో జరగడంపై బీసీసీఐ అభ్యంతరం వ్యక్తం చేసింది. పాకిస్తాన్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు మొహ్సిన్ నఖ్వీ ప్రస్తుతం ఏసీసీ అధ్యక్షుడిగా ఉన్నారు. భారత జట్టు బంగ్లాదేశ్ పర్యటనను నిరవధికంగా వాయిదా వేయాలని బీసీసీఐ ఇటీవల బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ)ని ఒప్పించింది. ఈ పర్యటన ఆగస్టులో జరగాల్సి ఉంది. కానీ ఏసీసీ ఢాకాలో తన సమావేశాన్ని నిర్వహించింది, ప్రస్తుతం బంగ్లాదేశ్లో రాజకీయ పరిస్థితి బాగా లేనందున బీసీసీఐ సంతోషంగా లేదు. ఆసియా కప్ నిర్వహణపై బీసీసీఐ మౌనం వహించడం స్పాన్సర్లను, ప్రసారకర్తలను గందరగోళానికి గురి చేసిందని నివేదికలు చెబుతున్నాయి. పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) హైబ్రిడ్ మోడల్పై అంగీకరించిందని, దీని కింద పాకిస్తాన్ వేరే దేశంలో ఏదైనా అంతర్జాతీయ టోర్నమెంట్లో భారత్తో మ్యాచ్లు ఆడుతుందని నివేదిక పేర్కొంది. భారతదేశం ఇప్పటికీ ఈ టోర్నమెంట్ను నిర్వహించాలని యోచిస్తోందా అని తెలుసుకోవడానికి ఏసీసీ అధికారికంగా బీసీసీఐని విచారించింది.సభ్య దేశాలన్నీ తమ ఏర్పాట్లను ఖరారు చేసుకోవడానికి 15 రోజుల సమయం ఇచ్చామని ఏసీసీ అధికారి ఒకరు తెలిపారు.

# భారత వన్డే కెప్టెన్గా శుభ్మన్ గిల్!

జాతీయ మీడియాలో వార్తలు


భారత వన్డే జట్టు కెప్టెన్గా శుభ్మన్ గిల్ త్వరలో బాధ్యతలు చేపట్టబోతున్నారంటూ జాతీయ మీడియాలో వార్తలు వస్తుండడం భారత క్రికెట్ వర్గాల్లో చర్చకు దారితీసింది. శ్రీలంక జట్టుతో జరగబోయే వన్డే సిరీస్కు శుభ్మన్ గిల్ కెప్టెన్సీ వహిస్తాడని వార్తలు వస్తున్నాయి. అలాగే గిల్ కు టీ20 వైస్ కెప్టెన్సీని కూడా అప్పగిస్తారని ఊహాగానాలు వెలువడుతున్నాయి. దీనిపై ప్రస్తుత వన్డే కెప్టెన్ రోహిత్ శర్మతో బీసీసీఐ చర్చలు జరిపినట్లు సమాచారం. అయితే శుభ్మన్ గిల్ ప్రస్తుతం టీమిండియా టెస్ట్ కెప్టెన్గా కొనసాగుతున్న సంగతి తెలిసిందే.టెస్టు క్రికెట్లో రోహిత్ శర్మ ఫామ్ కోల్పోవడంతో అతని టెస్ట్ కెరీర్ ముగియడం అనివార్యమని అంతా భావించారు. ఆస్ట్రేలియా పర్యటనలో పేలవ ప్రదర్శన తర్వాత ఇంగ్లండ్ పర్యటనకు ముందు రోహిత్ శర్మ టెస్టుల నుంచి తప్పుకున్నాడు. కెప్టెన్గా రోహిత్ భారత్కు అనేక గొప్ప విజయాలను అందించినప్పటికీ బ్యాటర్గా టెస్టుల్లో అంత గొప్పగా రాణించలేకపోయాడు. 2027 ప్రపంచ కప్ ను దృష్టిలో ఉంచుకొని రోహిత్, కోహ్లీ వన్డేలలో కొనసాగాలని నిర్ణయించుకున్నారు. వన్డేలలో రోహిత్ శర్మ అద్భుతమైన రికార్డు కలిగి ఉన్నందున కెప్టెన్గా కొనసాగుతాడని అందరూ ఊహించారు. అయితే ఒక ప్రముఖ జర్నలిస్ట్ సోషల్ మీడియా వేదికపై చేసిన పోస్ట్ ప్రకారం.. టీమిండియా తదుపరి వన్డే సిరీస్లో శుభ్మన్ గిల్ కెప్టెన్గా వ్యవహరించనున్నట్లు తెలిపారు. టెస్టుల్లో టీమిండియా పగ్గాలు చేపట్టిన గిల్.. రోహిత్ నుంచి వన్డే సారథ్య బాధ్యతలను కూడా తీసుకోనున్నట్లు చెప్పారు. ఈ పోస్ట్ సోషల్ మీడియా వేదికగా వైరల్ అయింది. దీనిపై ప్రస్తుతం నెట్టింట జోరుగా చర్చ జరుగుతోంది. దీనికి చాలా మంది మద్దతు తెలపగా.. మరికొందరు ఆశ్చర్యపోయారు.ఈ లోపు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ



సెప్టెంబర్లో బంగ్లాదేశ్ జట్టుతో జరిగే వన్డే సిరీస్కు తిరిగి రావాల్సి ఉంది. కానీ బీసీసీఐ, బీసీబీ పరస్పర నిర్ణయంతో ఈ సిరీస్ను వచ్చే ఏడాదికి వాయిదా వేశారు. ఈ సీనియర్ ఆటగాళ్లు నవంబర్లో టీమిండియా ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లినప్పుడు తిరిగి వన్డేలలో ఆడనున్నారు. ప్రపంచ కప్కు ముందు భారత్ కొన్ని వన్డేలు మాత్రమే ఆడనుంది. కాబట్టి ఈ స్టార్ ఆటగాళ్లు ఫిట్గా, ఫామ్లో ఉండటం వారికి పెద్ద సవాలుగా మారనుంది.

# విశ్వేజి

# జస్ట్.. ఇవి తీసుకుంటే చాలు



మనం రోజూ తీసుకునే ఆహారంలో ఫైబర్ (పీచు) అత్యవసరం. జీర్ణ వ్యవస్థను సరిగ్గా పని చేయడంలో దీని పాత్ర ప్రధానం. నిజానికి- జీర్ణ వ్యవస్థ చాలా సున్నితంగా ఉంటుంది. ఏ మాత్రం తేడా కొట్టినా విరేచనాలు, లేదా మలబద్ధకం వంటి సమస్యలు వస్తాయి. ఇర్రిటబుల్ బవెల్ సిండ్రోమ్ వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. ఫైబర్ జీర్ణ వ్యవస్థను సక్రమంగా ఉంచడంలో సహాయపడుతుంది. ప్రేగు కదలికలు, జీర్ణక్రియను మరింత క్రమబద్ధంగా చేస్తుంది. ఫైబర్ అధికంగా ఉండే ఆహారం చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించగలదు. ముఖ్యంగా కరిగే ఫైబర్ ఉన్న ఆహారాలు తీసుకోవడం మంచిది. ఇవి ఇతర ఆహారాలలో తినే చెడు కొలెస్ట్రాల్‌ను శరీరం గ్రహించకుండా నిరోధిస్తుంది. కరిగే ఫైబర్ జీర్ణ శయాంతర ప్రేగులలోని కొలెస్ట్రాల్, పిత్త ఆమ్లాలతో కలిసిపోతుంది. రక్తంలో చక్కెరను మెరుగుపరుస్తుంది. మనం తినే ఆహారంలో పీచు అధికంగా ఉండటం శరీరానికి అత్యవసరం. దీనివల్ల జీర్ణం బాగా జరుగుతుంది. మలబద్ధకం తగ్గుతుంది. బరువు, డయాబెటీస్, కొలెస్ట్రాల్ నియంత్రణలో ఉంటుంది. గుండె ఆరోగ్యం సైతం ఈ పీచు పదార్థాల వల్ల ఎంతగానో మెరుగుపడుతుంది. గుండెకు ఓ మెడిసిన్, ఓ టానిక్ లా ఇది ఉపయోగపడుతుందని, మరింత శక్తిని ఇచ్చినట్టవుతుందని డాక్టర్లు చెబుతుంటారు. డయాబెటీస్, క్యాన్సర్ ప్రమాదాల శాతాన్ని కూడా ఈ పీచు పదార్థాలు గణనీయంగా తగ్గించగలవు. ఫైబర్ అధికంగా ఉండే గింజలు- విత్తనాల జాబితాలో చియా సీడ్స్ టాప్ లో ఉంటాయి. ఓ వంద గ్రాముల చియా సీడ్స్ లో 34 గ్రాముల వరకు ఫైబర్ ఉంటుంది. అలాగే ఫ్లాక్స్ సీడ్స్. ఇందులో 27 గ్రాముల వరకు పీచు మిళితమై ఉంటుంది. వంద గ్రాముల బాదంలో ఉండే పీచు.. 12 గ్రాములు. ఫైబర్ అధికంగా ఉండే ధాన్యాల జాబితాలో గోధుమ బ్రాన్ లో పీచు అధికంగా ఉంటుంది. 100 గ్రాముల గోధుమ బ్రాన్ లో పీచు 43 గ్రాముల వరకు ఉంటుంది. ఓట్స్- 10 గ్రాములు, మిల్లెట్లు (సజ్జలు-కొర్రలు), బ్రౌన్ రైస్ లో ఫైబర్ అధికంగా ఉంటుంది. పండ్ల విషయాలకు వస్తే.. జామలో ఫైబర్ శాతం అధికంగా ఉంటుంది. అయిదు గ్రాముల వరకు పీచు ఇందులో ఉంటుంది. ఆపిల్ లో 4 గ్రాముల వరకు పీచు ఉంటుంది. నారింజ, అరటి, సీతాఫలం పండ్లల్లోనూ పీచు ఎక్కువ మోతాదులో ఉంటుంది. కూరగాయల్లో.. క్యారెట్, బెండకాయ, గుమ్మడికాయ, పొట్లకాయ, క్యాబేజీల్లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది.



## షుగర్ పేషెంట్లకు ఇది దివ్యౌషధం..

పచ్చి బొప్పాయి అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందించే పోషకమైన పండు. పచ్చి బొప్పాయి తినడం వల్ల అనేక ప్రయోజనాలు లభిస్తాయి. దీని తీసుకుంటే కలిగే ప్రయోజనాల గురించి చాలా మందికి తెలియదు. ఈ పచ్చి బొప్పాయి తినడం మధుమేహ రోగులకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. అయితే, ఈరోజు మనం పచ్చి బొప్పాయి తినడం వల్ల కలిగే అనేక గొప్ప ప్రయోజనాల గురుంచి తెలుసుకుందాం. డయాబెటిక్ రోగులకు ప్రయోజనకరమైనది మధుమేహ రోగులకు పచ్చి బొప్పాయి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇందులో ఉండే పపైన్ అనే ఎంజైమ్ శరీరంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో ఎంతో సహాయపడుతుంది. షుగర్ పేషెంట్లు క్రమం తప్పకుండా పచ్చి బొప్పాయిని తీసుకుంటే షుగర్ కంట్రోల్ లో ఉంటుంది. జీర్ణవ్యవస్థను బలపరుస్తుంది. పచ్చి బొప్పాయి తినడం వల్ల మీ జీర్ణవ్యవస్థ బలపడుతుంది. ఇది జీర్ణవ్యవస్థను బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. ఇందులో ఫైబర్, పపైన్ పుష్కలంగా ఉంటాయి. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అంతేకాకుండా.. మలబద్ధకం, గ్యాస్, ఇతర జీర్ణ సమస్యలను తగ్గిస్తుంది. బరువు తగ్గడంలో సహాయపడుతుంది.. ఒకవేళ బరువు తగ్గాలని ఆలోచిస్తుంటే పచ్చి బొప్పాయి ఎంతో సహాయపడుతుంది. ఇందులో ఉండే ఫైబర్, నీరు అధికంగా ఉండటం వల్ల కడుపు నిండుగా అనిపిస్తుంది. దీంతో ఆహారాన్ని ఎక్కువగా తీసుకోలేము. చర్మాన్ని ఆరోగ్యంగా చేస్తుంది.. ఇది చర్మాన్ని కూడా మెరుగుపరుస్తుంది. ఇందులో ఉండే విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని ఆరోగ్యంగా, ప్రకాశవంతంగా మారుస్తాయి. అయితే,పచ్చి బొప్పాయిని పేస్ట్ లా తయారు చేసుకుని, దానికి పాలు, పసుపు కలిపి ముఖానికి అప్లై చేసుకోవచ్చు. దీనివల్ల ముఖం మెరిసేలా అవుతుంది. జుట్టును ఆరోగ్యంగా చేస్తుంది.. పచ్చి బొప్పాయి జుట్టును ఆరోగ్యంగా ఉంచడంలో ఎంతో సహాయపడుతుంది. పచ్చి బొప్పాయిని పేస్ట్ లా చేసి జుట్టుకు అప్లై చేసుకోండి. కొంత సమయం తర్వాత ఈ పేస్ట్‌ని చల్లటి నీటితో శుభ్రం చేసుకోండి. ఈ నివారణతో జుట్టు చాలా ఆరోగ్యంగా, సిల్కీగా మారుతుంది. ఇది చుండ్రును తగ్గించడంలో కూడా సహాయపడుతుంది.

### నల్లగా ఉన్నాయని దూరం పెట్టకండి..

# తింటే ఎన్నో లాభాలు..



మన అర్యోగం మనం తీసుకునే ఆహారం మీద ఆధారపడి ఉంటుంది. ఆర్యోగంగా ఉండాలంటే తరచుగా పండ్లు, ఆకు కూరలు, కూరగాయలు తీసుకోవాలి. ఇవి ఆర్యోగానికి ఎంతో మేలు చేస్తాయి. ఈ క్రమంలో బ్లాక్ క్యారెట్ తీసుకోవడం వల్ల కూడా అనేక లాభాలు ఉన్నాయి. ఇది రుచికరంగా కూడా ఉంటుంది. ఆర్యోగానికి ఎంతో మంచిది కూడా. అయితే మార్కెట్లో దొరికే నార్మల్ క్యారెట్ గురుంచి అందరికి తెలుసు కానీ, బ్లాక్ క్యారెట్ గురుంచి ఎవరికి అంతగా తెలియదు. ఇప్పుడు బ్లాక్ క్యారెట్ తినడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలుసుకుందాం. బ్లాక్ క్యారెట్ తినడం వల్ల కలిగే ప్రయోజనాలు.. బ్లాక్ క్యారెట్‌లో ఉండే ఆంథోసైనిన్స్, పొటాషియం గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో ఎంతో సహాయపడతాయి. అంతేకాకుండా.. ఇది రక్తపోటును నియంత్రిస్తుంది. రక్తం గడ్డకట్టడాన్ని కూడా నిరోధిస్తుంది. అలాగే, షుగర్ ఉన్నవారు దీని పుష్కలంగా తినొచ్చు. బ్లాక్ క్యారెట్‌లో ఫైబర్ ఉంటుంది. కావున ఇది రక్తంలో చక్కెరను నియంత్రించడంలో ఎంతో సహాయపడుతుంది. కాబట్టి దీన్ని తినడం వల్ల మధుమేహం రాకుండా ఉంటుంది. ఇందులో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. దీని తీసుకోవడం వల్ల క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధించడంలో సహాయపడతాయి. బ్లాక్ క్యారెట్ లో అధిక మొత్తంలో విటమిన్ ఎ ఉంటుంది. దీని కారణంగా బ్లాక్ క్యారెట్ కంటి చూపును మెరుగుపరచడంలో పనిచేస్తుంది. కంటిశుక్లం వంటి సమస్యలను కూడా నివారిస్తుంది. అంతేకాకుండా బ్లాక్ క్యారెట్‌లో ఉండే ఫైబర్ జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. అంతేకాకుండా మలబద్ధకం, అపానవాయువు, ఆమ్లత్వం వంటి సమస్యల నుండి ఉపశమనాన్ని అందిస్తుంది. బ్లాక్ క్యారెట్‌లో ఉండే విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. దీంతో ఇది రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది. అంతేకాకుండా చలికాలంలో వచ్చే ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి సహాయపడతాయి. ఇకపోతే బ్లాక్ క్యారెట్‌లో కేలరీలు తక్కువగా ఉంటాయి. అంతేకాకుండా ఫైబర్ అధికంగా ఉంటుంది. దీంతో ఇది చాలా కాలం పాటు కడుపు నిండుగా ఉందనే భావన కలిగిస్తుంది. బ్లాక్ క్యారెట్‌లో ఉండే విటమిన్ ఎ, యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని ఆరోగ్యంగా, మెరిసేలా చేస్తాయి. అంతేకాకుండా జుట్టును బలోపేతం చేస్తాయి.

# మార్కెట్

## సామ్‌సంగ్ ట్రై-ఫోల్డ్ ఫోన్

న్యూయార్క్ : కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ పరికరాల తయారీ దిగ్గజం సామ్‌సంగ్..ఈ ఏడాది చివరినాటికి ట్రై-ఫోల్డ్ స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేయబోతున్నది. దేశీయ మార్కెట్లోకి గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 7, ఫ్లిప్ 7 స్మార్ట్‌ఫోన్లను విడుదల చేసిన అనంతరం కంపెనీ వైస్ ప్రెసిడెంట్ మిన్సోయిక్ కాంగ్ మాట్లాడుతూ.. వచ్చే ఆరు నెలల్లో మూడు మడతలు కలిగిన స్మార్ట్‌ఫోన్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్టు చెప్పారు. ప్రస్తు తం ఈ ఫోన్ అభివృద్ధి దశలో ఉన్నదని, న్యూఢిల్లీకి సమీపంలో ఉన్న ప్లాంట్లో ఉత్పత్తిని ప్రారంభించినట్టు తెలిపారు. ఇప్పటికే చైనాకు చెందిన స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ హ్యూవాయ్ ఇప్పటికే ట్రై-ఫోల్డ్ ఫోన్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే.




## జులై 15న భారత్‌లో టెస్లా తొలి షోరూం ప్రారంభం..!



ఇప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం (%వశ్రీవఎ- తీఅఎ ఝతీం%) టెస్లా (%ఠవంశ్రీఝ%) భారత్‌లో అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది. దేశ ఆర్థిక రాజధాని ముంబైలో తొలి షోరూం ప్రారంభించనున్నట్లు తెలిసింది. మరో నాలుగు రోజుల్లో అంటే జులై 15న టెస్లా భారత్‌లో తొలి షోరూంను అఫీషియల్‌గా లాంఛ్ చేయనున్నట్లు ప్రముఖ వార్తా సంస్థ రాయిటర్స్ నివేదించింది. ముంబై (%వీబఎఝఅ%) జియో వరల్డ్‌లో ఈ షోరూం ప్రారంభించనున్నట్లు తెలిసింది. ఇందుకోసం ఇప్పటికే టెస్లా సంస్థ వై మోడల్ కార్లను చైనాలోని షాంఘై నగరంలో గల తమ ఫ్యాక్టరీ నుంచి తీసుకొచ్చినట్లు సమాచారం. డిమాండ్‌ను బట్టి ఆ తర్వాత ఢిల్లీలోనూ షో రూం ఏర్పాటు చేయాలనే ప్రణాళికతో టెస్లా ఉందని సదరు నివేదికలు వెల్లడించాయి. ఈ షోరూం కోసం ముంబై నడిబొడ్డున బాంద్రా కుర్లా కాంప్లెక్స్ (బీకేసీ) బిజినెస్ డిస్ట్రిక్ట్‌లో 4,000 చదరపు అడుగుల స్థలాన్ని టెస్లా సంస్థ అద్దెకు తీసుకున్నట్లు ఇటీవలే వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. పార్కింగ్ సౌకర్యాలుగల ఈ షోరూమ్ స్పేస్‌కుగాను కంపెనీ ప్రమోటర్, బిలియనీర్ ఎలాన్ మస్క్ నెలకు రూ.35 లక్షల అద్దె (%వీశీత్ప్రశ్రీఎ =వత్%) చెల్లించనున్నారని తెలిసింది. అద్దె ఏడాదికి 5 శాతం పెంపు ప్రాతిపదికన ఐదేళ్ల కాలానికి యూనివ్‌కో ప్రాపర్టీస్ నుంచి లీజుకి తీసుకుంది. ఈ ప్రాపర్టీ గ్రౌండ్ ఫ్లోర్ దేశీయంగా ఏర్పాటైన తొలి యాపిల్ స్టోర్‌కు దగ్గరగా ఉంటుంది. రెంటల్ అగ్రిమెంట్ ఫిబ్రవరి 27న రిజిస్టరైంది. రూ.2.11 కోట్లు సెక్యూరిటీ డిపాజిట్‌గా కూడా టెస్లా జమ చేసినట్లు సమాచారం. ఎలన్ మస్క్ సారధ్యంలోని టెస్లా భారత మార్కెట్‌లోకి అడుగుపెట్టేందుకు ఎంతోకాలంగా ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. భారత్ విధించే దిగుమతి సుంకాలు తమకు అడ్డంకిగా మారాయని టెస్లా గతంలోనే పేర్కొంది. అయితే, భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ (%ఉవీ వీశీఎఅ%) ఇటీవలే అమెరికాలో పర్యటించిన విషయం తెలిసిందే. రెండు రోజుల పర్యటనలో భాగంగా టెస్లా బాస్ ఎలాన్ మస్క్ (%జుశ్రీశీఅ వీబంఎ%)తో భేటీ అయ్యారు. ఆ భేటీలో వాణిజ్య అంశాలపై చర్చించినట్లు తెలిసింది. ఇందులో భాగంగా టెస్లా భారత్‌లో ప్రవేశానికి సంబంధించిన కీలక అంశాలను కూడా ఇరువురూ ప్రస్తావించినట్లు సమాచారం. మెదీ అమెరికా పర్యటన సమయంలోనే భారత్‌లో టెస్లా విస్తరణకు బీజం పడింది. ఆటోమొబైల్ రంగంలో కొత్త ఒరవడి సృష్టించిన టెస్లా కంపెనీ ఎలక్ట్రిక్ కార్ల మార్కెట్‌కు ఈసారి భారత్‌ను ఎంచుకుంది. యూరప్, చైనాలో అమ్మకాలు పడిపోవడంతో ఇండియాలో సొమ్ము చేసుకోవాలనే ఆలోచనతో ఉంది ఎలాన్ మస్క్ సంస్థ. అందులో భాగంగానే ముంబైలో తమ తొలి షోరూంను ప్రారంభించేందుకు సిద్ధమైంది. ప్రస్తుతం ఎలక్ట్రిక్ కార్లలో అత్యధిక అమ్మకాలతో రికార్డు నెలకొల్పిన వై మోడల్ కారు ధర పన్నులు, బీమా కలిపితే రూ. 48 లక్షలపైనే ఉండనుంది.

## 25 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసిన ఆర్బీఐ

ముంబై : రిజర్వుబ్యాంక్ మరో 25 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసింది. గడిచిన ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో 25 టన్నుల గోల్డ్ రిజర్వులను పెంచుకున్నది. దీంతో సెంట్రల్ బ్యాంక్ వద్ద బంగారం నిల్వలు 879.59 టన్నులకు చేరుకున్నాయి. సెప్టెంబర్ 2024 నాటికి 854.73 టన్నుల గోల్డ్ నిల్వలు ఉండగా..ప్రస్తుతం 57 టన్నులను పెంచుకున్నది. గడిచిన ఏడేండ్లలో ఒకే ఏడాది ఇంతటి స్థాయిలో కొనుగోలు చేయడం ఇదే తొలిసారి. ఒకవైపు పసిడి ధరలు రికార్డు స్థాయి లో పెరిగినప్పటికీ ఆర్బీఐ గోల్డ్‌ను కొనుగోలు చేయడం విశేషం. సెంట్రల్ బ్యాంక్ వద్ద ఉన్న బంగారం నిల్వల్లో 511.99 టన్నుల గోల్డ్‌ను స్థానికంగా నిల్వ చేయగా, మరో 348.62 టన్ను లను బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్, బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్‌మెంట్స్ (బీఐఎస్) వద్ద, డిపాజిట్ రూపంలో 18.98 టన్నులు ఉంచింది.

# సోషల్ మీడియా పోస్టులపై కన్ను

**తప్పుడు పోస్టులకు శిక్షలు తప్పవు**
**గంజాయితో పట్టుబడితే సంక్షేమం రద్దు**
**హోంమంత్రి అనిత హెచ్చరిక**



అనకాపల్లి,జులై 11 : సోషల్ మీడియాలో అభ్యంతరకర, తప్పుడు పోస్టులు పెడితే, చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నామని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. గత జగన్ పాలనలో రాష్ట్రంలో గంజాయి విచ్చలవిడిగా ఏరులై పారేదని హోంమంత్రి అనిత ఆరోపించారు. గంజాయి కేసుల్లో పట్టుబడితే సంక్షేమ పథకాలు రద్దు చేస్తున్నామని ఉద్ఘాటించారు. గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్‌గా మార్చుదామని దిశానిర్దేశర చేశారు. పిల్లలు సామాజిక మాధ్యమాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిల్లల నడవడికపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని కోరారు. ఆడ, మగ అని తేడా ఉండకూడదని.. తల్లిదండ్రులు ఇద్దరిని సమానంగా చూడాలని సూచించారు. తాను ఒకప్పుడు టీచర్‌ని అని చెప్పడానికి గర్వంగా ఉంటుందని హోంమంత్రి అనిత ఉద్ఘాటించారు. మా నాన్న నాకు ఇచ్చిన ఆస్తి చదువు అని చెప్పుకొచ్చారు. శుక్రవారం నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌లో తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హోం మంత్రి అనిత హాజరయ్యారు. ఈ సమావేశంలో తల్లిదండ్రులు, విద్యార్థులు భారీగా పాల్గొన్నారు. పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను హోం మంత్రి అనిత సన్మానించారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత ప్రసంగించారు. కనిపించే దేవత అమ్మ.. అమ్మను ప్రతీ ఒక్కరూ గౌరవించాలని సూచించారు. విద్యను మించిన ఆస్తి లేదని ఉద్ఘాటించారు. తమ ప్రభుత్వంలో తల్లిదండ్రులు చాలా సంతోషంగా ఉన్నారని చెప్పుకొచ్చారు. ఇప్పుడు తమ ప్రభుత్వం లో ప్రైవేట్ పాఠశాలల నుంచి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్నారని హోంమంత్రి అనిత తెలిపారు. ఒకప్పుడు ప్రైవేట్ స్కూల్‌లో మాత్రమే పేరెంట్ టీచర్స్ మీటింగ్స్ జరిగేవని వెల్లడించారు. ఇప్పుడు ఏపీ వ్యాప్తంగా అన్ని పాఠశాలలు, కళాశాలల్లో పేరెంట్ టీచర్స్ మీటింగ్స్ జరుగుతున్నాయని తెలిపారు. విద్యకు ఎన్డీఏ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మధ్యాహ్న భోజన పథకం, హాస్టల్స్‌లో సన్నబియ్యం ఉపయోగిస్తున్నామని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. విద్యని తమ ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోందని చెప్పుకొచ్చారు. ఆ చదువే తనకు రాజకీయాల్లో పెట్టు-బడి అయిందని వెల్లడించారు. గంజాయి మత్తులో పిల్లల జీవితాలు నాశనం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీలో ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ, సంక్షేమ పథకాలన్ని అమలు చేస్తున్నామని హోం మంత్రి అనిత ఉద్ఘాటించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో హోంమంత్రి వంగలపూడి అనిత పర్యటించారు. పాడేరులో హోంమంత్రికి ఎన్డీఏ కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. పాడేరులో శ్రీ మోదకొండమ్మ అమ్మవారిని దర్శించికొని, ప్రత్యేక పూజులు చేశారు. ఆలయ మర్యాదలతో అధికారులు హోం మంత్రికి స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం పండితులు వేద ఆశీర్వచనం చేశారు. అనితకు అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అధికారులు అందజేశారు.

## ప్రజల్లో చైతన్యం తేవడంలో మీడియా కీలకం

**యోగాంధ్ర విజయవంతం నేపథ్యంలో కలెక్టర్**

విజయవాడ,జులై 11 : రాష్ట్ర నవ్య రాజధాని అమరావతికి గేట్ వే అయిన విజయవాడను సిటీ- ఆఫ్ విక్టరీగా తీర్చిదిద్దేందుకు, ఎన్‌టీఆర్ జిల్లా సమగ్రాభివృద్ధిలో మీడియా పాత్ర కీలకమని, యోగాంధ్ర వంటి వివిధ అంశాలపై ప్రజల్లో చైతన్యం తేవడంలో మీడియా చేస్తున్న కృషి అనిర్వచనీయమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. యోగాంధ్ర విజయవంతం నేపథ్యంలో శుక్రవారం నగరంలోని గురునానక్ కాలనీ శుభలగ్నం వేదికలో జరిగిన మీడియా ప్రతినిధుల ఆత్మీయ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొని మాట్లాడారు. ఆరోగ్య ఆంధ్ర.. స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధన దిశగా గౌరవ ముఖ్యమంత్రి దార్శనికతతో రాష్ట్ర ప్రభుత్వం ఆవిష్కరించిన యోగాంధ్ర విజయవంతానికి మీడియా విశేష కృషిచేసిందని.. వైబ్రెంట్ విజయవాడతో పాటు- జిల్లా అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధించేందుకు ఇదేవిధమైన చేయూత నందించాలని పేర్కొన్నారు. మీడియా వార్తలు, కథనాలతో ప్రజల్లో యోగా ఔన్నత్యంపై మంచి అవగాహన ఏర్పడిందని, యోగాంధ్ర కార్యక్రమ రూపకల్పన ఉద్దేశాలు, లక్ష్యాలు ప్రజలకు చేరువచేసేందుకు దోహదం చేశాయన్నారు. జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి అపార అవకాశాలున్న నేపథ్యంలో కొత్త టూరిజం సర్క్యూట్లపై దృష్టిపెడుతున్నామని, -టె-ంపుల్ టూరిజం, ఎకో టూరిజం అభివృద్ధికి దార్శనిక ప్రణాళికలు రూపొందించామని వివరించారు. మూలపాడు బటర్÷-లపై పార్క్- జీవవైవిధ్య పార్కు, బుద్ధిస్ట్ సర్క్యూట్, కొండపల్లి బొమ్మల ఎక్స్‌పీరియన్స్ సెంటర్ తదితరాలకు కృషిచేస్తున్నట్లు- వివరించారు. ఎ÷-లోటింగ్ యోగా, త్రికోణ ఆసనాల్లో ప్రపంచ రికార్డులు సాధించిన టీ-మ్ ఎన్‌టీ-ఆర్ సారథి, కలెక్టర్ డా. జి.లక్ష్మీశను జర్నలిస్టులు సత్కరించారు. కార్యక్రమంలో డీఐపీఆర్‌వో కేవీ రమణరావు, డీపీఆర్‌వో ఎస్.మోహనరావు, డివిజనల్ పీఆర్‌వో కె.రవి, పబ్లిసిటీ- సూపర్‌వైజర్ వీవీ ప్రసాద్, వివిధ మీడియా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## లిక్కర్ స్కామ్ చూస్తే దేశం నివ్వెరపోయేలా ఉంది

**బాక్సుల్లో డబ్బులు తరలించిన ఘనులు వారు**
**సుపరిపాలనలో తొలి అడుగులో మంత్రి పయ్యావుల**

అనంతపురం,జులై 11 : లిక్కర్ స్కామ్‌కు సంబంధించి సిట్ దర్యాప్తులో చాలా ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వస్తున్నాయని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. లిక్కర్ స్కామ్‌కు ఐటీ ప్రొఫెషనల్స్, ప్రైవేట్ వ్యక్తులను పెట్టుకుని బాక్సులకు బాక్సులు డబ్బులు తరలించారని ఆరోపించారు. లిక్కర్ స్కామ్‌లో వాస్తవాలు తెలిస్తే భారతదేశం నివ్వెరపోయే విధంగా ఉందన్నారు. శుక్రవారం జిల్లాలోని కనేకల్ మండల కేంద్రంలో నిర్వహించిన సుపారిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా మెయిల్స్ చేసిన ఉదయ భాస్కర్‌పై కేసులు పెట్టి తీరతామని స్పష్టం చేశారు. ఉదయ భాస్కర్ దాదాపు 200 తప్పుడు మెయిల్స్ పెట్టారని మండిపడ్డారు. బంగారుపాళ్యంలో ట్రాక్టర్ లాక్కొచ్చి మరీ వైసీపీ చేసిన ట్రిక్స్ అన్నీ డ్రోన్ కెమెరాల్లో బయటపడ్డాయన్నారు. బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి వెటకారం తగ్గించుకుంటే మంచిదని హితవుపలికారు. బుగ్గన నోటికి వచ్చినట్లు పార్టీలో అస్తిత్వం కోసం మాట్లాడు తున్నారని.. ఇప్పటికైనా బుర్రకథలు ఆపాలన్నారు. దోమల మీద యుద్ధం, గాల్లో యుద్ధం మీరు చేశారని... అందుకే ప్రజలు కాల్చివాత పెట్టారని ఎద్దేవా చేశారు. దొంగ ఈ-మెయిల్స్ పంపిన వారిపై కేసు పెడతామని స్పష్టం చేశారు. జగన్ రోడ్డు మీదకు వస్తే ఆయన కారు కింద తలకాయలు కానీ.. మామిడి కాయలు కానీ పగలాల్సిందే అంటూ దుయ్యబట్టారు. చిత్తూరులో మామిడికాయలు కొనొద్దని ఫ్యాక్టరీలకు చెప్పారని.. ట్రాక్టర్‌ల నుంచి బలవంతంగా మామిడికాయలు కింద పారబోశారని... చివరికి డ్రోన్ కెమెరాలో దొరికి పోయారని విమర్శించారు. పెట్టు-బడులు పెట్టవద్దని చెప్పారని మండిపడ్డారు. మెయిల్స్ పెట్టి రాష్ట్ర ప్రభుత్వం పరువు తీసే విధంగా చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామని మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు. సుపారిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి పయ్యావులతో పాటు- రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ గడిచిన సంవత్సర కాలంగా కూటమి ప్రభుత్వం ఏం చేసిందో ప్రజలకు మంత్రి, ఎమ్మెల్యే తెలియజేశారు

## రాష్ట్రంలో రైతులను పట్టించుకోని ప్రభుత్వం

**దయనీయంగా ఉన్నా అండగా నిలవని కూటమి**
**జగన్పరామర్శలకు వెళితే తట్టుకోలేని పెద్దలు**
**మాజీమంత్రి, వైకాపానేత పేర్నినాని విమర్శలు**



అమరావతి,జులై11 : రాష్ట్రంలో రైతులను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, గిట్టుబాటు ఇవ్వడం లేదని వైసీపీనేత మాజీమంత్రి పేర్ని నాని మండిపడ్డారు. ఏపీలో రైతుల పరిస్థితులు దయనీయంగా ఉండటం సమాజానికి విచారకరం అన్నారు. రైతుల వద్దకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ వెళ్తే ఏడుస్తారు అని కూటమి ప్రభుత్వంను విమర్శించారు. ఏపీలో రైతుల పరిస్థితులు దయనీయంగా ఉండటం సమాజానికి విచారకరం అని పేర్కొన్నారు. పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్నట్లుగా కూటమి ప్రభుత్వ వ్యవహారం ఉందని ఎద్దేవా చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి జగన్ గారిని తిట్టడానికి తప్ప ఎక్కడైనా తిరిగారా? అని పేర్ని నాని ప్రశ్నించారు. శుక్రవారం అమరావతిలో మాజీమంత్రి పేర్ని నాని మీడియాతో మాట్లాడారు. ధాన్యం, పత్తి, మిర్చి, పొగాకు, కోకో.. తాజాగా మామిడి పంటలు పండుతున్న రైతుల కడగండ్లు ప్రభుత్వానికి కనిపించటం లేదు. పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్నట్లుగా కూటమి ప్రభుత్వ వ్యవహారం. డబుల్ ఇంజిన్ సర్కార్ అంటే అర్థం ఏంటి?. ముందు నుంచి ఒకరు.. వెనుక నుంచి మరొకరు కోస్తారని అర్థమా?. రైతుల గోడు పట్టించుకునే నాథుడు లేడు. వ్యవసాయ శాఖ మంత్రి జగన్‌ను తిట్టడానికి తప్ప ఎక్కడైనా తిరిగారా?. హామీలు ఇచ్చిన మూడు పార్టీల్లో ఇద్దరు అవునంటారు.. మరొకరు తెలియదు అంటారు. వ్యవసాయ శాఖ మంత్రి రైతుల బాధలు పట్టించుకుంటు-న్నారా?. మిర్చి, పొగాకు రైతుల బాధలు చూడటానికి వెళ్తే సినిమా సెట్టింగుల యాత్రలు అంటారు. జగన్ వెళుంటే విమర్శిస్తారు.. మీరు వెళ్ళి చూస్తుంటారు. మిర్చి యార్డు ఉన్న కేంద్ర మంత్రి రైతుల కోసం వెళ్లారా?. ఒక్క ఎమ్మెల్యే అయినా రైతుల కోసం వెళ్లారా?. మీరు పట్టించుకోరు, రైతులకు గిట్టు-బాటు- ఇవ్వరు.. జగన్ వెళ్తే ఏడుస్తారు' అని పేర్ని నాని మండిపడ్డారు. పొగాకు రైతుల కోసం జగన్ వెళ్తే ఒక 20 మంది పచ్చ మూకలను పంపిస్తారు. వాళ్లకు డబ్బులు ఇచ్చి పంపిస్తారు. మీ టీ-వీ డిబేట్లలో డబ్బులు ఇచ్చి జగన్‌ను తిట్టిస్తారు. జగన్‌ను తిట్టకుండా ఒక్క డిబేట్ ఉంటు-ందా?. మీరు వచ్చినప్పటి నుంచి చేసిందేమీ లేదు కాబట్టి.. జగన్‌ను తిట్టడమే పనిగా పెట్టు-కున్నారు. ఉదయం, సాయంత్రం మీ వ్యాపారం మొత్తం జగన్ మీదే కదా. ఇవాళ మామిడి రైతుల గురించి ఇష్టం వచ్చినట్లు- మాట్లాడుతున్నారు. జగన్ పర్యటనకు హెలెక్రాప్టర్కు పర్మిషన్ ఇవ్వరు. తప్పుడు మాటలు.. విష ప్రచారం.. అసత్యాలు మాట్లాడుతున్నారు. జగన్ బంగారుపాళ్యం వెళున్నారని కేబినెట్లో తీర్మానం చేస్తారు. వీళ్లకు అబద్ధాల ప్రచారం తప్ప మరొకటి లేదు. 9వ తేదీ జగన్ వెళ్ళగానే 260 కోట్లు- విడుదల చేశామన్నారు.. జీవో వచ్చిందా. ఎవరి-కై-నా సమాచారం ఉందా?. ఒక్క మామిడి రైతుకన్నా న్యాయం చేశారా. రైతు కష్టం గురించి తెలియని వాళ్ళు.. విచిత్రమైన వ్యవసాయ శాఖ మంత్రి 80 శాతం కొనేసాము అంటారు. మరో మంత్రి 90 శాతం కొన్నారని అంటారు.. ఎవరిది నిజం' అని పేర్ని నాని ఫైర్ అయ్యారు. జగన్ వెళ్తున్నారని.. వాడు, వీడు అంటున్నాడు. మిమ్మల్ని వాడు, వీడు అనలేమా. జగన్ ఎప్పుడు కూడా వాడు, వీడు అని శత్రువుల గురించి కూడా మాట్లాడరు. అమ్మఒడి అందరికీ వేశామని చెప్పారు.. లక్ష మందికి అయినా 13 వేలు పడ్డాయా. ఈ దిక్కుమాలిన ప్రభుత్వం దగ్గరి నుంచి ఎలా వంచించాలో నేర్చుకోవాలి. 6.50 లక్షల టన్నుల పంట పండింది. 80 శాతం కొన్నామని వ్యవసాయ శాఖ మంత్రి.. 90 శాతం కొన్నామని సివిల్ స్లపై మంత్రి చెబుతారు. కలెక్టర్ మాత్రం 67 శాతం అని చెప్పారు. ఒక్క రైతు దగ్గరకు వెళ్లని వ్యవసాయ మంత్రి 80 శాతం కొనేసామని చెప్పారు.. సివిల్ స్లపై మంత్రి 90 శాతం అంటారు. మీ అబద్ధాలకు పోయే కాలం రాదా. ఫైనాన్స్ కాన్కరెన్స్ లేకుండా జీవో ఫైల్ జెనరేట్ చేశారు. ఏమీ చేయకుండా మమ అనేశారు' అని పేర్ని నాని విమర్శించారు.

## పరామర్శల పేరుతో జగన్ దండయాత్ర

**మంత్రి సత్యకుమార్ యాదవ్ విమర్శలు**

శ్రీసత్యసాయి,జులై11 : వైసీపీ అధినేత వైఎస్ జగన్ పర్యటనలపై ఏపీ మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.. శ్రీ సత్యసాయి జిల్లా పర్యటనలో మీడియాతో మాట్లాడిన ఆయన.. వైఎస్ జగన్ పరామర్శ పేరుతో దండయాత్రలు చేస్తున్నారని విమర్శించారు.. పోలీసులు రక్షణ ఇవ్వకపోతే ఇవ్వలేదంటారు.. ఎక్కువ మంది పోలీసులను పెడితే.. 2 వేల మంది పోలీసులను పెట్టారని మళ్లీ ఇప్పుడు కామెంట్ చేస్తున్నారని ఫైర్ అయ్యారు.. 500 మందితో వెళ్లి రైతులను పరామర్శించాలని వైఎస్ జగన్‌కు చెప్పాం.. కానీ, ఆయన చేసింది ఏంటి? అంటూ మండిపడ్డారు. గత ఐదేళ్లలో రైతులు గురించి ఏ రోజైనా పట్టించుకున్నారా..? అని వైఎస్ జగన్‌ను నిలదీశారు మంత్రి సత్యకుమార్ యాదవ్.. 250 కోట్ల రూపాయలు మామిడి రైతుల కోసం ఈ ప్రభుత్వం కేటాయించిందని స్పష్టం చే శారు.. గతంలో ధరల స్థిరీకరణ నిధి అని ఏం చేశారు? అని ప్రశ్నించిన ఆయన.. వైఎస్ జగన్ రైతుల గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్టు-గా ఉంది అంటూ మండిపడ్డారు.. అసలు, గత ఐదేళ్లలో ధర్మవరం మున్సిపాలిటీ- గురించి పట్టించుకున్న పాపాన పోలేదని దుయ్యబట్టారు.. గత ప్రభుత్వంలో కేవలం వైసీపీ వారికి మాత్రమే లబ్ధి చేశారని ఆరోపించారు మంత్రి సత్యకుమార్ యాదవ్..

## మోహన్ భగవత్ 75 ఏళ్ల రిటైర్మెంట్ వ్యాఖ్యలు

**మోడీని ఉద్దేశించి చేసినవే నంటూ**
**కాంగ్రెస్ నొక్కుళ్లు**
**భగవత్, మోడీ ఇద్దరూ 75కు చేరువలో ఉన్నారన్న జైరామ్**

న్యూఢిల్లీ,జులై 11 : రాజకీయ నేతలు ఎవరైనా సరే 75 ఏళ్లు రాగానే రిటైర్మెంట్ తీసుకోవాలంటూ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశ మవుతున్నారు. దీనిపై కాంగ్రెస్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా రంగంలోకి దిగింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఉద్దేశించే మోహన్ భాగవత్ ఈ వ్యాఖ్యలు చేశారని విమర్శలు గుప్పించింది. మోహన్ భాగవత్ గత బుధవారంనాడు నాగపూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ.. రిటైర్మెంట్‌పై మరాఠా సామ్రాజ్య మొదటి పీష్వా, సంఘ్ సిద్ధాంతకర్త మోరోపంత్ పింగ్లే అభిప్రాయాన్ని ప్రస్తావించారు. 75 ఏళ్ల శాలువా మన మీద కప్పారంటే.. మనం ఒక నిర్దిష్ట వయసుకు చేరుకున్నామని అర్థం. అప్పుడు మనం పక్కకు జరిగి.. వేరే వాళ్లు పనిచేసేందుకు అవకాశం ఇవ్వాలని పింగ్లే వ్యాఖ్యలను భాగవత్ గుర్తుచేశారు. ఇది కాస్తా నెట్టింట చర్చనీయాంశంగా మారింది. ఈ ఏడాది సెప్టెంబరుతో ప్రధాని మోదీకి 75 ఏళ్లు నిండుతాయి. ఆయనను ఉద్దేశించే భాగవత్ ఈ వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. పలు అవార్డులు తీసుకొని, విదేశీ పర్యటనలు ముగించుకుని వస్తున్న ప్రధాని మోదీకి ఎలాంటి స్వాగతం లభించిందో చూడండి..! ఈ ఏడాది సెప్టెంబరు 17 నాటికి మోదీకి 75 ఏళ్లు పూర్తవు తాయనే విషయాన్ని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ గుర్తుచేస్తున్నారు. కానీ, భాగవత్‌కు కూడా ఈ ఏడాది సెప్టెంబర్ 11 నాటికి 75 ఏళ్లు నిండుతాయనే విషయాన్ని మోదీ గుర్తు చేయాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి జైరాం రమేశ్ పోస్ట్ పెట్టారు. 'ఒక్క దెబ్బకు.. రెండు పిట్టలు' అంటూ ఎద్దేవా చేశారు. ఈ ఏడాది మార్చిలో ప్రధాని మోదీ నాగ్‌పుర్‌లోని ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలోనే మోదీ రి-టైర్మెంట్ గురించి చర్చ మొదలైంది. అప్పట్లో దీనిపై శివసేన (యూబీటీ-) ఎంపీ సంజయ్‌రౌత్ స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గత 10, 11 ఏళ్లలో మోదీ ఎన్నడూ ఈ కార్యాలయానికి రాలేదు. దేశ నాయకత్వంలో మార్పు రావాలని ఆర్‌ఎస్‌ఎస్ కోరుకుంటోంది. ఆ సంస్థ నియమాల ప్రకారం మోదీ కూడా రాజకీయాలకు రిటైర్మెంట్ ప్రకటించాలని సంఘ్ భావిస్తోందని నాడు రౌత్ వ్యాఖ్యానించారు. అయితే, దీన్ని భాజపా కొట్టిపారేసింది. ఇప్పుడు భాగవత్ వ్యాఖ్యలతో మరోసారి ఈ అంశం తెరపైకి వచ్చింది.

## టోల్ ప్లాజా వద్ద లారీ బీభత్సం

అనకాపల్లి,జులై11 : అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం కాగిత టోల్ ప్లాజా వద్ద ఓ లారీ బీభత్సం సృష్టించింది. విశాఖ నుంచి కాకినాడ వైపునకు వెళ్తున్న లారీ.. కాగిత టోల్‌ప్లాజా వద్దకు రాగానే అదుపుతప్పి మొదటి కౌంటర్ నుంచి రెండో కౌంటర్‌కు దూసుకెళ్లింది. ఆ సమయంలో రెండో కౌంటర్ వద్ద ఆగి ఉన్న మరో వ్యాన్‌నూ ఢీకొట్టింది. అప్రమత్తమైన సిబ్బంది అక్కడి నుంచి బయటకు పరుగులు తీశారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు అక్కడ ఏర్పాటు- చేసిన సీసీ కెమెరాలో నమోదు అయ్యాయి.

## వైద్య కళాశాల విద్యార్థినులకు వేధింపులు

**బాధ్యులైన ఉద్యోగుల సస్పెన్షన్..**
**క్రిమినల్ కేసులు నమోదు: కలెక్టర్ వెల్లడి**

కాకినాడ,జులై 11 : రంగరాయ వైద్య కళాశాలలో వైద్య కళాశాల విద్యార్థినులకు వేధింపుల కేసులో తోణ చర్యలకు దిగారు. బాధ్యులైన ఉద్యోగుల సస్పెన్షన్..వేటుపడింది. వారిపై క్రిమినల్ కేసులు నమోదుచేశారు. రంగరాయ విద్యార్థినులకు లైంగిక వేధింపుల ఘటనలో బాధ్యులను సస్పెండ్ చేశామని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. బాధ్యులపై క్రిమినల్ కేసులు పెట్టామన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌తో కలిసి కలెక్టర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈనెల 9న కళాశాల ప్రిన్సిపల్ విష్ణువర్ధన్‌కు ఓ విద్యార్థిని నుంచి మెయిల్ వచ్చింది. నలుగురు వేధిస్తున్నారని 50 మంది విద్యార్థినులు ఫిర్యాదు చేశారు. బయోకెమిస్ట్రీ ల్యాబ్‌లో ఉన్న కల్యాణ్ చక్రవర్తిపై ఎక్కువ ఫిర్యాదులు అందాయి. వాట్సప్‌లో అసభ్య మెసేజ్‌లు, వ్యాఖ్యలు చేస్తున్నట్లు గుర్తించాం. కొంతమంది విద్యార్థులతో మాట్లాడి నప్పుడు కల్యాణ్ చక్రవర్తితో పాటు- జిమ్మిరాజు, గోపాలకృష్ణ, ప్రసాద్ పేర్లు కూడా వచ్చాయి. వారిపైనా చర్యలు తీసుకున్నాం. వారిని సస్పెండ్ చేసిన అనంతరం విచారణ చేపట్టాం. కళాశాలలో గతంలో ఇలాంటివి జరిగాయా? అనే కోణంలో విచారించాం. వేధింపులపై మెయిల్ పంపిన విద్యార్థినిని అభినందిస్తున్నాంఅని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ ఘటనపై శుక్రవారం ఉదయం నుంచి మూడు ఫిర్యాదులు అందాయని ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. వన్‌టౌన్ పీఎస్‌లో 2, టూటౌన్‌లో ఒక ఫిర్యాదు వచ్చిందన్నారు. నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ చేపట్టినట్లు- తెలిపారు.

## తాట తీస్తానన్న పవన్ ఎక్కడ

**కాకినాడ ఘటనపై వైకాపా నేత కళ్యాణి**

అమరావతి,జులై 11 : మహిళల మీద చెయ్యి వేస్తే తాట తీస్తా అన్న డిప్యూటీ- సీఎం పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఎక్కడ ఉన్నారని వైసీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కళ్యాణి విమర్శలు చేశారు. 50 మంది మహిళను నెల రోజుల నుంచి వేధిస్తే.. పవన్ కళ్యాణ్ గారు ఏం చర్యలు తీసుకున్నారు అని ప్రశ్నించారు. టీడీపీ నేతల మద్దతుతో మహిళలు, చిన్నారులపై హత్యలు, హత్యాచారాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. హోం మంత్రి వంగలపూడి అనిత నివాసానికి కూత వేటు- దూరంలో డ్రగ్స్ దొరకడం దారుణ ఘటన అని వరుదు కళ్యాణి పేర్కొన్నారు. కాకినాడ జీజీహెచ్ రంగరాయ మెడికల్ కాలేజీలో చోటు చేసుకున్న ఘటనపై ఆమె ధ్వజమెత్తారు. కాకినాడ జీజీహెచ్‌లో కీచక పర్వం జరిగింది. ల్యాబ్ అసిస్టెంట్ చేతిలో నెల రోజులకు పైగా వేదింపులకు గురయ్యారు. నేను చెప్పినట్లు- చేయకపోతే ఫెయిల్ చేస్తానని ల్యాబ్ అసిస్టెంట్ బెదిరించాడు. మహిళల మీద చెయ్యి వేస్తే తాట తీస్తా అన్న పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఎక్క?. 50 మంది మహిళలను నెల రోజుల నుంచి వేధిస్తే.. ఏమి చర్యలు తీసుకున్నారు. టీ-డీపీ నేతల మద్దతుతో మహిళలు, చిన్నారులపై హత్యలు, హత్యాచారాలు జరుగుతున్నాయి. ఈ దుర్మార్గాలు హోమ్ మంత్రి అనిత కంటికి కనిపించవా?. పోలీస్ వ్యవస్థను కక్షియ సాధింపు చర్యలకు ప్రభుత్వం వాడుతుంది. రాష్ట్రంలో గంజాయి డ్రగ్స్ విచ్చలవిడిగా పెరిగిపోయింది. హోం మంత్రి నివాసానికి కూత వేటు- దూరంలో డ్రగ్స్ దొరికాయి' అని వరుదు కళ్యాణి మండిపడ్డారు.

## యానాంలో చిక్కి పులస

**వేజీ 15వేలు పలికిన ధర**

కాకినాడ,జులై11 : పుస్తెలు అమ్మైనా సరే.. పులస తినాలి' అనే నానుడి గోదావరి జిల్లాలో బాగా విపిస్తుంటు-ంది. 'పులస' చేప దొరకడం చాలా అరుదు కాబట్టే.. జీవితంలో ఒక్కసారైనా పులసను తినాలని భావిస్తుంటారు. నదీ ప్రవాహానికి అతి వేగంగా ఎదురీదడం ఈ చేప ప్రత్యేకత. అంతేకాదు ఈ చేప ఎంతో రుచికరంగా కూడా ఉంటుంది. అందుకే వేలంలో ఎంత ధర పెట్టడానికైనా జనాలు వెనుకాడరు. ఇప్పటికే ఎన్నో పులస చేపలు రికార్డు ధరలో అమ్ముడుపోయాయి. గోదావరి నదికి వరదలు వచ్చే సమయంలో పులస చేపల సీజన్ ఆరంభం అవుతుంది. ఈ ఏడాది కూడా గోదావరికి వరద నీటి తాకిడి పెరిగింది. దాంతో పులస చేపల సీజన్ మొదలైంది. ఎర్ర నీరు ఉధృతంగా రావడంతో పులసలు ఎదురీదుతూ వస్తున్నాయి. ఇప్పటికే గోదావరి తీరానికి సమీపంలో ఉండే యానాం ప్రాంతంలో తొలి పులస చేప చిక్కింది. మూడు రోజుల క్రితం యానాం ఫిష్ మార్కెట్‌లో పులస రూ.4000 ధర పలికింది. శుక్రవారం మరో పులస చేప మత్స్యకారులకు దొరికింది. పులస ప్రియులు వేలంలో పోటీ- పడ్డారు. దాంతో కేజీ ధర రూ.15000 పలికింది. యానాంలో పులసల సందడి మొదలవడంతో మత్స్యకారుల పంట పండుతోంది.

## వైసిపినేత, ఉప సర్పంచ్ హత్య

శ్రీకాకుళం,జులై11 : శ్రీకాకుళం జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. ఎచ్చెర్ల మండలం ఫరీద్ పేట గ్రామానికి చెందిన వైసీపీ నేత, ఉప సర్పంచ్ సత్తారు గోపి దారుణ హత్యకు గిరయ్యాది. కోయిరాల జంక్షన్ సమీపంలో గుర్తు తెలియని దుండగులు కొందరు గోపిపై రాడ్లు, కత్తులతో దాడి చేసి హత్య చేశారు. తల, మెడపై తీవ్ర గాయాలు కావడంతో గోపి అక్కడిక్కడే మృతి చెందాడు. రక్తపు మడుగులో పడిఉన్న గోపి మృతదేహం వద్ద కుటు-ంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. బైక్‌పై వెళుండగా గోపిపై ఏడుగురు వ్యక్తుల దాడి చేసినట్లు- తెలుస్తోంది. సత్తారు గోపి దారుణ హత్య నేపథ్యంలో జాతీయ రహదారిపై బంధువుల ఆందోళనకు దిగారు. దాంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. సత్తారు గోపి హత్యపై కేసు నమోదు చేశారు. ఎంపీపీ మగతలవలస చిరంజీవి అనుచరుడే సత్తార్ గోపి. ఈ హత్యపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.




# తమన్ స్టూడియోలో ప్రభాస్ సందడి

## రాజాసాబ్సాంగ్స్ కంపోజింగ్‌పై ఆసక్తి

రెబల్ స్టార్ ప్రభాస్, మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా 'ది రాజా సాబ్'. హార్రర్, కామెడీ, రొమాంటిక్ కథాంశంతో రానున్న ఈ సినిమాలో నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిధిలు హీరోయిన్లుగా నటిస్తున్నారు. థమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను పీపుల్స్ మీడియా ఫ్యాక్టరి బ్యానర్ పై విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. తాజాగా రెబల్ స్టార్ ప్రభాస్ తమన్ మ్యూజిక్ సిట్టింగ్స్ లో దిగిన ఫోటో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. అయితే తమన్ అందించిన సాంగ్స్ ప్రభాస్ కు నచ్చులేదని అందుకే స్వయంగా డార్లింగ్ దిగాడని కెమెంట్స్ చేస్తున్నారు ఫ్యాన్స్. వాస్తవానికి రాజాసాబ్ సినిమాకు తమన్ ఎప్పుడో సాంగ్స్ కంపోజ్ చేసి ఇచ్చేసాడు. అందులో కొన్ని సాంగ్స్ ను షూట్ కూడా చేసారు. ఆ తర్వాత స్క్రిప్ట్ లో వచ్చిన కొన్ని మార్పుల కారణంగా ముందు కంపోజ్ చేసిన సాంగ్స్ అన్నిటిని పక్కన పెట్టేసారు. ఇప్పుడు మరలా తమన్ తో సాంగ్స్ ను కంపోజ్ చేపిస్తున్నారు. తమన్ అందుకోసం వర్క్ స్టార్ట్ చేసాడు. ఈ నేపథ్యంలోనే తమన్ స్టూడియోకు ప్రభాస్ వెళ్లి సరదాగా కాసేపు ఉండి వచ్చాడు. అంతే తప్ప వర్క్ నచ్చక కాదు. తమన్ సాంగ్స్ ఫినిష్ చేసాక సాంగ్స్ షూట్ చేసేందుకు షెడ్యూల్ ఎ÷-లాన్ చేస్తున్నారు మేకర్స్. తమన్ వర్క్ పట్ల మారుతీ చాలా అండ్ టీ-మ్ హ్యాపీ గా ఉన్నారు. జెట్ స్పీడ్ లో జరుగుతున్న రాజాసాబ్ ఈ ఏడాది డిసెంబర్ 5న థియేటర్స్ లో అడుగుపెట్టనున్నాడు.



# పెళ్లంటే జీవితకాలపు బాధ్యత

## నటి శృతిహాసన్ ఆసక్తికర విషయాలు వెల్లడి

తన వ్యక్తిగత విషయాల గురించి ఎప్పుడూ అభిమానులతో పంచుకునే నటి శ్రుతి హాసన్ పెళ్లి విషయంలోనూ ఆసక్తికర విషయాలను వెల్లడించారు. పెళ్లిపై తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. వివాహం అనే ఆలోచన కూడా తనకు భయాన్ని కలిగిస్తుందన్నారు. నాకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడానికి జీవితమంతా కష్టపడ్డాను. ఆ గుర్తింపును ఓ కాగితం ముక్కతో ముడిపెట్టాలనే ఆలోచన కూడా భయంకరంగా అనిపిస్తుంటుంది. వివాహ బంధాన్ని.. ఆ వ్యవస్థలో ఉన్న విలువలను నేను గౌరవిస్తాను. కానీ, వాటిని ధ్రువీకరించడానికి ఓ చట్టపరమైన కాగితం అవసరం లేదని నా అభిప్రాయం. నా జీవితంలో ఒకసారి నేను వివాహానికి చాలా దగ్గరగా వెళ్లాను. కానీ, అది ముడి పడలేదు. ఇద్దరు మనుషులు ఒక్కటవ్వాలంటే వారి అభిప్రాయాలు కలవాలి. అయినా, పెళ్లి అనేది ఇద్దరు వ్యక్తులకు సంబంధించిన విషయం కాదు. అది జీవితకాలపు బాధ్యతని అన్నారు. మరికొన్ని రోజుల్లో 'కూలీ'తో పలకరించనున్న ఆమె.. ఈ సినిమా ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు వెల్లడించారు. రజనీకాంత్‌తో కలిసి వర్క్ చేసిన అనుభవంతో పాటు తన కెరీర్ గురించి మాట్లాడారు. పవన్ కల్యాణ్ హీరోగా వచ్చిన 'గబ్బర్ సింగ్'లో అవకాశం వచ్చినప్పుడు కొన్ని కారణాల వల్ల నేను నటించలేనని చెప్పాను. హరీశ్ శంకర్ నన్ను ఒప్పించారు. ఆ పాత్రలో నన్ను కాకుండా మరో నటిని ఊహించుకోలే నన్నారు. కానీ, ఆ సినిమా నా కెరీర్ మొత్తాన్ని మార్చేసింది. నేను నటించిన ఎన్నో సినిమాలు మంచి సక్సెస్‌ను సాధించినప్పటికీ తొలి విజయాన్ని ఇచ్చింది మాత్రం తెలుగు పరిశ్రమే. పవన్ ఎప్పుడూ వ్యవసాయం గురించి, గ్రామీణ ప్రాంతాల్లో ఉండే వారి గురించే మాట్లాడుతుండేవారు. ఆయనకు రాజకీయ రంగం కూడా సరిపోతుంది.మా నాన్న, రజనీకాంత్ ఇద్దరూ తమిళ ఇండస్ట్రీకి రెండు కళ్ల లాంటి వాళ్లు. రజనీకాంత్ సూపర్ స్టార్. ఇన్ని రోజులు మా నాన్న దృష్టికోణంలోనే ఆయన నాకు తెలుసు. 'కూలీ' సినిమాలో ఆయనతో వర్క్ చేస్తున్నప్పుడు పూర్తిగా తెలుసుకున్నాను. సెట్‌లో ఎంతో యాక్టివ్‌గా ఉంటారు. తన చుట్టూ ఉండేవాళ్లు కూడా సంతోషంగా ఉండాలని కోరుకుంటారు. ఆయన ఎనర్జీకి ఎవరూ సరితూగరు. ఆయనతో కలిసి నటించే అవకాశం వచ్చినందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఇండస్ట్రీలో ఎంతోమంది గొప్ప నటులు ఉన్నారు. ఎవరి ప్రత్యేకతలు వారికి ఉంటాయి. అమితాబ్ బచ్చన్ , కమల్ హాసన్, రజనీకాంత్.. వీరందరినీ ఒకరితో ఒకరిని పోల్చలేం అని శ్రుతి వివరించారు.



# సర్దార్2 25న విడుదల

2012లో ప్రేక్షకుల ముందుకు వచ్చి నవ్వులు పంచిన సినిమా 'సన్ ఆఫ్ సర్దార్'కి కొనసాగింపుగా తెరకెక్కిన చిత్రం 'సన్ ఆఫ్ సర్దార్ 2'. అజయ్ దేవగణ్, మృణాల్ ఠాకూర్ ప్రధానపాత్రల్లో నటించిన ఈ సీక్వెల్ జులై 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా టీమ్ దీని ట్రైలర్‌ను విడుదల చేసింది. పంజాబీ అమ్మాయిగా సర్దార్‌తో కలిసి నవ్వులు పంచుతోంది మృణాల్. విజయ్ కుమార్ అరోరా దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సంజయ్ దత్ కీలక పాత్రలో కనిపించనున్నారు.




# 18నుంచి అమెజాన్ ప్రైమ్‌లోకి కుబేర

శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ధనుష్, నాగార్జున, రష్మిక ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కుబేర' ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా జులై 18 నుంచి స్ట్రీమింగ్ కానుంది. గత కొన్ని రోజులుగా దీని ఓటీటీ- విడుదలపై ఎన్నో వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వాటికి చెక్ పెడుతూ.. తాజాగా ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ అమెజాన్ ఓ పోస్టర్ విడుదల చేసింది. దేశంలోనే అత్యంత సంపన్నుడైన గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ సీఈవో నీరజ్ మిత్ర (జిమ్ సర్బ్) ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా నిలవాలని కలలు కంటుంటాడు. ఆ కల కోసం ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సాగర్ ప్రాజెక్ట్‌ను వినియోగించుకోవాలనుకుంటాడు. రూ.లక్ష కోట్ల డీల్ కుదుర్చుకుంటాడు. ఆ మొత్తం డబ్బులో రూ.50 వేల కోట్లు బ్లాక్‌లో.. మిగిలిన డబ్బు వైట్‌లో ఇవ్వాలని నీరజ్‌కు సిద్ధప్ప షరతు విధిస్తాడు. ఈ పనిని సమర్థంగా చేయడం కోసం జైల్లో ఉన్న మాజీ సీబీఐ అధికారి దీపక్ తేజ్ (నాగార్జు)ను బయటకు తీసుకొస్తాడు. ఈ పని కోసం దీపక్ బిచ్చగాళ్లను ఎంచుకుంటాడు. ఈ పని పూర్తి కాగానే ఆ నలుగురు బిచ్చగాళ్లను చంపేయాలని నీరజ్ ప్లాన్ చేయగా.. వారిలో ఒకడైన దేవా (ధనుష్) తప్పించుకుంటాడు. మరి వీళ్ల చేతికి దేవా దొరికాడా? తన ఖాతాలో ఉన్న వేల కోట్ల డబ్బును దేవా ఏం చేశాడన్నది మిగిలిన కథ. శేఖర్ కమ్ముల మూవీ కావడంతో ఆసక్తి పెరిగింది. అయితేఅనుకున్నంతగా ఇది సక్సెస్ సాధించలేదన్నది వేరు విషయం.

# సాయిపల్లవి సీతకి సరిపోదంటూ విమర్శలు

ఇండియన్ సినిమా హిస్టరీలో భారీ బడ్జెట్ తో రాబోతోంది రామాయణ మూవీ. రణ్‌బీర్ కపూర్ రాముడిగా, యష్ రావణుడిగా, సాయిపల్లవి సీతగా కనిపిస్తున్నారు. నితేష్ తివారీ డైరెక్షన్ లో వస్తోంది. దాదాపు రూ.900 కోట్ల బడ్జెట్ తో ఈ సినిమాను బాలీవుడ్ నిర్మాతలతో కలిసి అల్లు అరవింద్ నిర్మిస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉంది. కానీ సాయిపల్లవిని పనిగట్టుకుని కొందరు నార్త్ యూట్యూబ్ ఛానెళ్లు, కొందరు బాలీవుడ్ మీడియా వాళ్లు ట్రోల్స్ చేస్తున్నారు. సాయిపల్లవి సీత పాత్రకు సరిపోదంటూ తెగ పోస్టులు పెడుతున్నారు. కాజల్ రావణుడి భార్యగా, రకుల్ శూర్పనకగా నటిస్తున్నారంటూ ఒక ప్రచారం అయితే నడుస్తోంది. దీంతో కాజల్ లాంటి అందమైన భార్య ఉండగా రావణుడు అందంగా లేని సాయిపల్లవి కోసం పరితపించడం ఏంటని వెకిలి పోస్టులు పెట్టేస్తున్నారు. పైగా గో వధ చేసే వారిపై గతంలో సాయిపల్లవి సానుభూతి చూపించింది కాబట్టి ఆమెను సీత పాత్రకు తీసుకోవడం ఏంటని ట్రోల్స్ చేస్తున్నారు. కానీ సాయిపల్లవి సీత పాత్రకు న్యాయం చేస్తుందని ఆమె ఫ్యాన్స్ అంటున్నారు. ఎందుకంటే సీతమ్మ పాత్రలో చేయాలంటే అద్భుతమైన నటన వచ్చి ఉండాలని.. అది సాయిపల్లవికే ఉందంటున్నారు. పైగా ఇతర హీరోయిన్లలాగా సాయిపల్లవి ఎలాంటి ఎక్స్‌పోజింగ్, బోల్డ్ పాత్రలు చేయలేదని.. కాజల్, రకుల్ అలాంటి పాత్రలు చేశారని చెబుతున్నారు. సీతమ్మ పాత్రలో చేయడానికి ఉండాల్సిన అన్ని అర్హతలు సాయిపల్లవికి ఉన్నాయంటున్నారు. అందం ముఖ్యం కాదని.. అభినయమే ముఖ్యం అంటూ ఆమెకు మద్దతు ఇస్తూ నార్త్ మీడియాను ఏకి పారేస్తున్నారు.



Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com